# ఇస్లామ్

# ఉగ్రవాదమా ఆదర్శవాదమా



స్వామి లక్ష్మీశంకరాచార్య

273

Islam Atank Yaa Aadarsh
(Telugu)

# ఇస్లామ్ ఉగ్రవాదమా? ఆదర్శవాదమా?


మూలం
స్వామి లక్ష్మీశంకరాచార్య

అనువాదం
షేక్ ఖాజా మొహియుద్దీన్
ప్రిన్సిపాల్, నవభారత్ హిందీ పండిట్ ట్రైనింగ్ కాలేజ్, కర్నూలు



ప్రకాశకులు :
తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-500 002. ఫోన్: 040-24564583

**Islam Ugravadama? Aadarshvaadma?**
**Islam Aatank? Yaa Aadarsh? (Telugu)**

**TIP Series No. : 273**

*Writer* : **Swamy Lakshmi Sankara Charya**

*Translator* : Shaik Khaja Mohiuddin
*Principal, Navabharat Hindi Pandit Training College, Kurnool*

*All Rights Reserved with Publishrs*

6th Edition : October 2018

Copies : 2000

**Price : Rs.70**

ISBN : 978-93-81111-24-6

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam Lakkadkote, Chatta Bazar, Hyderabad- 500 002, India.
Phone : 040 - 24564583, 24576237
geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers, Hyderabad-2.

# విషయసూచిక


| | |
|---|---|
| పాఠకులకు విజ్ఞప్తి | 4 |
| రచయిత పరిచయం | 5 |
| ఇస్లామీయ పారిభాషిక పదాలు | 6 |
| నాకు సత్యజ్ఞానం కలిగినప్పుడు | 7 |
| ఒక సునిశ్చిత ప్రయత్నం | 11 |
| హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి సంక్షిప్త జీవిత చరిత్ర | 13 |
| ఇస్లాం మరియు ఉగ్రవాదం | 26 |
| ఖుర్ఆన్‌లోని ఆ 24 వచనాలు | 32 |
| ఖుర్ఆన్ ఆదర్శాలు | 58 |
| ఖుర్ఆన్‌లోని ఆధ్యాత్మిక ఆదర్శాలు | 59 |
| ఇస్లాంలో మానవ శ్రేయస్సుకై అనుసరించవలసిన సదాచారాలు | 66 |
| ఇస్లాంలో ఆదర్శవంతమైన న్యాయం | 68 |
| ఇస్లాంలో ప్రపంచ సర్వోన్నత న్యాయ వ్యావహారిక ఆదర్శం | 71 |
| ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి ప్రవచనాలు | 75 |
| సనాతన వైదిక ధర్మం మరియు ఇస్లాం | 78 |
| సనాతన వైదిక ధర్మం మరియు ఇస్లాంలో ఆశ్చర్యజనక సమానతలు | 80 |
| కాస్త ఆలోచించండి! | 90 |
| మనందరి కర్తవ్యం | 95 |
| సమర్పణ | 97 |

## పాఠకులకు విజ్ఞప్తి

ఇస్లాంను గూర్చి సరైన అవగాహన లేనివారు ఉగ్రవాదం విషయంలో ఇస్లాం దృష్టికోణాన్ని దాని వాస్తవ రూపంలో తెలుసుకోవడం కోసమని ఈ పుస్తకం హిందీ మూలంగా వ్రాయబడింది. మన ముస్లిం సోదరుల కర్తవ్యమేమిటంటే, వారు తమతమ శక్తి (ఆర్థిక స్థోమత) మేరకు ఈ పుస్తకాన్ని సాధ్యమైనంత అధిక సంఖ్యలో ముస్లిమేతరులకు పంచి, దీనిని చదవటానికి వారిని ప్రేరేపించాలి.

మేము ఈ పుస్తకాన్ని ఇతర భాషలలో కూడా అనువాదం చేయిం చాలనుకుంటున్నాము. దైవచిత్తమయితే ఈ పని కూడా పూర్తవుతుంది. ఈ సత్య సందేశాన్ని మేము ప్రజలందరి వద్దకు చేర్పించాలనుకుంటు న్నాము. ఈ పనిలో క్రియాశీలురై దీనిని ముందుకు నడిపించాలని పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ సమాజ హిత కార్యం, ఇంకా ముందు ముందు జరిగే కార్యాలలో సత్యం పట్ల సమర్పిత భావం గల ప్రజల నుండి సకల విధాల సహాయ సహకారాల అవసరం ఎంతైనా ఉంది.

**నివేదితుడు : స్వామి లక్ష్మీశంకరాచార్య**

# రచయిత పరిచయం

శ్రీ స్వామి లక్ష్మీ శంకరాచార్యుల వారు క్రీ.శ. 1953వ సంవత్సరం ఉత్తర ప్రదేశ్, కాన్పూరు జిల్లాలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వారి తండ్రి శ్రీ సీతారామ్ త్రిపాఠి, తల్లి శ్రీమతి కౌసల్యా దేవి. వృత్తి రీత్యా ఉపాధ్యాయులు. స్వామీజీ గారు కాన్పూర్ మరియు అలహాబాద్‌లలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత వారు గుత్తేదారు (కాంట్రాక్టర్) వృత్తిని చేపట్టారు. కొంత కాలం తరువాత వారు భౌతిక తత్వాన్ని త్యజించి ఆధ్యాత్మికత వైపు మరలిపోయారు.

ఈ మధ్యకాలంలో ఇస్లాంను గురించి జరుగుతున్న దుష్ప్రచారం పట్ల ప్రభావితులై స్వామీజీ గారు "ఇస్లాం ఆతంక్‌వాద్ కా ఇతిహాస్" (ఇస్లాం ఉగ్రవాదం చరిత్ర) అనే పుస్తకాన్ని వ్రాశారు. అది ఆంగ్లంలో "The History of Islamic Terrorism" పేరుతో ముంబై నుండి ప్రచురించబడింది. కాని ఇస్లాం పట్ల సత్యజ్ఞానం కలిగిన తరువాత స్వామీజీగారు తమ మొదటి పుస్తకం పట్ల విచారం వ్యక్తం చేస్తూ "ఇస్లాం ఆతంక్‌వాద్ యా ఆదర్శ్‌వాద్" (ఇస్లాం ఉగ్రవాదమా? ఆదర్శవాదమా) అనే పుస్తకాన్ని వ్రాశారు.

అనంత కరుణామయుడు పరమ దయాళు అయిన అల్లాహ్ పేరుతో

# ఇస్లామీయ పారిభాషిక పదాలు

## ఈమాన్

విశ్వాసం, నమ్మకం, వాస్తవికతను ధృవీకరించి దానిని స్వీకరించటాన్ని 'ఈమాన్' అంటారు. అల్లాహ్ అవతరింపజేసిన ఇస్లామీయ బోధనలను హృదయపూర్వకంగా స్వీకరించి వాటిని ఆచరించటం. దీనికి విరుద్ధ పదం నిరాకరించుట, త్రోసిపుచ్చుట, అవిశ్వాసం వగైరా.

## గ్రంథ ప్రజలు

అల్లాహ్ తరఫు నుండి గ్రంథాన్ని పొందినవారు. ఇది దేవుని తరఫు నుండి తౌరాతు గ్రంథాన్ని పొందిన యూదులకు, ఇంజీల్ గ్రంథాన్ని పొందిన క్రైస్తవులకు వర్తిస్తుంది.

## కాఫిర్

తిరస్కారులు, అవిశ్వాసులు, సత్యాన్ని దాచేవారు, కృతఘ్నులు. దైవప్రవక్తల ప్రబోధనల వాస్తవికతను ఆచరించటానికి తిరస్కరించేవారు. కాఫిర్ అనే పదం వ్యాకరణాత్మకంగా ఒక గుణవాచకం. ఇది 'అవమానం' అనే అర్థాన్నిచ్చే పదం కాదు. అల్లాహ్ ఆదేశాలను తిరస్కరించేవారి కోసం ఖుర్ఆన్‌లో 'కాఫిర్' అనే పదం ఉపయోగించబడిందంటే దాని అర్థం తిడుతున్నట్టుగానో, ద్వేషిస్తున్నట్టుగానో, నిరాదరిస్తున్నట్టుగానో కాదు. వారు తిరస్కరించిన కారణంగా ఆ అర్థం స్ఫురించటానికి ఇలా చెప్పబడింది. ప్రస్తుతం దుష్ప్రచారం చేస్తున్నట్టు 'కాఫిర్' అనే మాట హిందువులకు పర్యాయ పదం కూడా కాదు.

'కాఫిర్' అనే పదానికి కొంచెం అటూ ఇటూగా 'నాస్తికుడు' అనే నిర్వచనం చెప్పుకోవచ్చు. కేవలం ఇలా నిరాకరించిన కారణంగా ఇస్లాం దృష్టిలో ప్రపంచంలో ఏ వ్యక్తికీ ఎలాంటి శిక్షనూ విధించటంగానీ అతణ్ణి మానవీయ హక్కుల నుండి దూరం చేయటంగానీ జరుగదు. ప్రాపంచిక విషయాల్లో అతడు సమాన అధికారాలు కలిగి ఉంటాడు.

ప్రతి ధర్మంలోనూ ఆయా ధర్మాలలోని మౌలిక భావనలను, బోధనలను ఆచరించే వారి కోసం వాటిని ఆచరించని వారి కోసం వేర్వేరు విశేష పదాలు ప్రయోగిం చబడుతూ ఉంటాయి. ఏ విధంగానైతే హిందూ ధర్మాన్ని తిరస్కరించిన వారికి నాస్తికుడు, అసభ్యుడు, దస్యుడు, మ్లేచ్ఛుడు లాంటి పదాలు వాడుకలో ఉన్నట్టు.

## రసూల్, నబీ

దైవప్రవక్తగా నియుక్తుడైన వ్యక్తి. అల్లాహ్ (పరమేశ్వర్) తన ఆదేశాలను ప్రజలకు చేరవేయటాని కోసం, తన మార్గాన్ని చూపించటాని కోసం ప్రభవింపజేయ బడిన వ్యక్తి.

## జిహాద్

ప్రాణాలను త్యజించి సలిపే ప్రయత్నం. ఏదేని లక్ష్యసిద్ధికై సర్వశక్తులనూ ధారపోయడం. యుద్ధం కోసమైతే ఖుర్ఆన్‌లో 'ఖితాల్' అనే పదం ఉపయోగించ బడింది. 'ఖితాల్' అనే శబ్దార్థం కంటే 'జిహాద్' శబ్దార్థం ఎంతో విస్తృతార్థం కలిగివుంది. ఎవరైతే ధర్మపథంలో తన ధనం, కలం, గళం మొదలగు వాటితో అలుపెరుగని ప్రయత్నం చేస్తున్నారో వారు 'జిహాద్' చేస్తున్నారన్న మాట. సత్యపథంలో ఒకవేళ సమరం సలుపవలసివస్తే అందుకోసం తన ప్రాణాలను సయితం పణంగా పెట్టవలసి వస్తుంది. ఇది కూడా 'జిహాద్'లో భాగమే. అల్లాహ్ కోసం, ఆయన ఆదేశానుసారం సలిపిన జిహాద్ మాత్రమే 'ఇస్లామీయ జిహాద్' అనబడుతుంది. కాని ధన, సంపదల ప్రాప్తి కోసం చేసేది 'జిహాద్' అనిపించుకోదు.

# నాకు సత్యజ్ఞానం కలిగినప్పుడు

కొన్నేళ్ళ క్రితం 'జాగరణ్' దిన పత్రికలో బలరాజ్ మధోక్ 'అల్లర్లు ఎందుకు జరుగుతాయి' అనే శీర్షికన ఒక వ్యాసాన్ని వ్రాశారు. ఆ వ్యాసంలో ఆయన ముస్లింల మత గ్రంథం ఖుర్ఆన్‌లో కాఫిర్‌లతో పోరాడమంటూ చెబుతున్న ఆదేశాలే హిందు వులు, ముస్లింల మధ్య జరిగే అల్లర్లకు ప్రధాన కారణమంటూ ఖుర్ఆన్‌లోని ఆ వచనాలను కూడా ఉటంకించారు.

ఆ తరువాత ఢిల్లీలో ప్రచురింపబడిన ఒక కరపత్రం ఒక అపరిచిత వ్యక్తి ద్వారా నా చేతికి అందింది. అందులో అన్య ధర్మావలంబీకులతో పోరాడమంటూ ఖుర్‌ఆన్‌లో ఆదేశింపబడినట్టు చెబుతున్న ఆ 24 వచనాల వివరాలు ఇవ్వబడ్డాయి. దాన్ని చదివిన తరువాత నా మనసులో 'ఖుర్‌ఆన్'ను చదవాలనే జిజ్ఞాస కలిగింది. ఒక ఇస్లాం సాహిత్య పుస్తక దుకాణంలో నాకు హిందీలో అనువదింపబడిన ఖుర్‌ఆన్ ప్రతి లభించింది. ఆ కరపత్రంలో వ్రాయబడిన ఆ 24 ఖుర్‌ఆన్ వచనాలు అందులో కనిపించాయి. దీంతో చరిత్రలో హిందూ రాజులు, ముస్లిం పాదుషాల మధ్య జరిగిన యుద్ధాలు, భయంకర యుద్ధకాండ, ఇంకా నేడు హిందూ ముస్లింల మధ్య జరుగుతున్న అల్లర్లు, ఇతర ఉగ్రవాద చర్యలకు ముస్లింలే కారణం అనే తప్పుడు భావన నాలో కలిగింది. నా మనసంతా భ్రమించిపోయింది. ప్రతి ఉగ్రవాద చర్య ఇస్లాంతోనే ముడివడి ఉన్నట్లు నాకు తోచింది.

ఇస్లాం చరిత్రతో నేటి సంఘటనలను జోడించి "ఇస్లామిక్ ఆతంక్‌వాద్ కా ఇతిహాస్" (ఇస్లామీయ ఉగ్రవాద చరిత్ర) "The History of Islamic Terrorism" పేరుతో నేనొక పుస్తకాన్ని వ్రాశాను. అది 'సుదర్శన్' ప్రచురణలు, 'సీతాకుంజ్ లిబర్టీ గార్డెన్, రోడ్ నెం.3, మలాడ్ (పశ్చిమ), ముంబయి 400 064 ద్వారా ప్రచురించబడింది.

ఇటీవల నేను ఇస్లామీయ ధార్మిక విద్వాంసుల (ఉలేమాలు) ఉపన్యాసాలను చదివి ఉగ్రవాదంతో ఇస్లాంకు ఎలాంటి సంబంధం లేదని తెలుసుకున్నాను. ఇస్లాం, ప్రేమ, సద్భావన, సర్వమానవ సోదరభావాన్ని బోధించే ధర్మమనీ, నిరపరాధులెవరినైనా చంపటం ఇస్లాం ధర్మానికి విరుద్ధమనీ, అది ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ధర్మాదేశాన్ని (ఫత్వా) కూడా జారీ చేసిందని తెలుసుకున్నాను.

తర్వాత నేను పవిత్ర ఖుర్‌ఆన్‌లో జిహాద్‌కై ఆదేశింపబడిన వచనాలను గురించి వివరంగా తెలుసుకోవాలని ముస్లిం విద్వాంసులతో కలిసి చర్చించాను. దానికి వారు పవిత్ర ఖుర్‌ఆన్‌లోని ఆ ఆదేశాలు ఆయా కాల పరిస్థితుల్లో, ఆయా సందర్భాలకు అనుగుణంగా అవతరించబడ్డాయనీ వాటిని గూర్చి సవివరంగా గ్రహించటానికి

ఖుర్‌ఆన్ అనువాదాలను చదవటంతోపాటు అందులోని ఏ ఏ ఆదేశాలు ఎప్పుడు అవతరించబడ్డాయి, ఆ సందర్భం, అప్పటి పరిస్థితులను బట్టి వాటి అర్థం, ఉద్దేశ్యం పూర్తిగా గ్రహించగలమని తెలిపారు.

ఇక్కడ గ్రహించవలసిన మరో ప్రధానమైన విషయమేమిటంటే, ఈ పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథం ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ (సఅసం)[1]పై అవతరించబడింది. కాబట్టి ఖుర్‌ఆన్ గ్రంథ సారాంశాన్ని సరిగ్గా అర్థం చేసుకోవటానికి దైవప్రవక్త (సఅసం) జీవిత సంగ్రహాన్ని తెలుసుకోవడం తప్పనిసరి అవసరం.

హిందీ భాషలోనికి అనువదించబడిన ఆ ఖుర్‌ఆన్ ఆదేశాలు దైవసందేశ హరులైన ముహమ్మద్ (సఅసం) గారితో నిత్యం జగడమాడుతూ, దేశంలో అల్లకల్లోలం రేకెత్తించడంలో తలమునకలైన అత్యాచారులూ, సత్యతిరస్కారులూ (కాఫిర్‌లు), మిథ్యా దైవారాధకుల (ముష్రిక్‌ల) కోసం, సత్యధర్మపథంలో అవాంతరాలు సృష్టించే వారి కోసం ఉద్దేశింపబడ్డాయని, ఇంకా ఇస్లాం పట్ల సరైన పరిజ్ఞానం లేని కారణంగా ప్రజలు ఖుర్‌ఆన్‌లోని ఆదేశాలకు సరైన అర్థాన్ని గ్రహించలేకపోతున్నారనీ, ఖుర్‌ఆన్‌తోపాటు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్రను కూడా అధ్యయనం చేసి ఉంటే జనం ఇలా అపార్థం చేసుకొని ఉండేవారు కాదని" తెలిపారు ఇస్లాం విద్వాంసులు.

**ముస్లిం విద్వాంసుల సలహా మేరకు నేను మొదట హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి జీవిత చరిత్రను[2] చదివాను. ఆ తరువాత అదే దృష్టికోణంలో నిర్మల మనస్సుతో పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథాన్ని మొదటి నుండి చివరి వరకు అధ్యయనం చేశాను. అప్పుడు నాకు ఖుర్‌ఆన్‌లోని పవిత్ర వచనాలకు సరైన అర్థం, ఉద్దేశ్యం అర్థమవుతూ వచ్చింది.**

వాస్తవాన్ని గ్రహించిన తరువాత ఖుర్‌ఆన్ పట్ల మొదట నేను చేసిన తప్పిదం నాకు తెలిసిరావడంతో నాలోని అజ్ఞానం, అపార్థాల కారణంగా నేను క్రితం వ్రాసిన 'ఇస్లాం ఆతంక్‌వాద్ కా ఇతిహాస్" (ఇస్లాం ఉగ్రవాద చరిత్ర) అనే పస్తకంలో ఉగ్రవాదాన్ని పవిత్ర ఇస్లాంతో జోడించినందుకు నా హృదయం ఎంతో ఆవేదనకు గురైంది.

అందుకు నేను అల్లాహ్‌తో, దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)తో ఇంకా యావత్ ముస్లిం సమాజంతో నా హృదయాంతరాళంతో క్షమాపణలు చెప్పుకుంటున్నాను. ఇంకా అజ్ఞానంతో నేను వ్రాసిన వ్రాతలను, మాట్లాడిన మాటలను (ఉపన్యాసాలను) ఉపసంహరించుకుంటున్నాను. ప్రజలకు నా విన్నపం ఏమనగా నేను 'ఇస్లామిక్ ఆతంక్‌వాద్ కా ఇతిహాస్" (ఇస్లామీయ ఉగ్రవాద చరిత్ర) అనే పుస్తకంలో వ్రాసినవన్నీ ఇక శూన్యమైనవిగా భావించమంటూ వారితో విన్నవించుకుంటున్నాను.

బుధవారం
10-7-2008

**- స్వామీ లక్ష్మీశంకరాచార్య**
e-mail: laxmishankaracharya@yahoo.in
Mobile No. 09415594441- 09935037145

1. **సఅసం:** దీని విపుల రూపం 'సల్లల్లాహు అలైహి వ సల్లం.' దీని అర్థం ఆయనపై అల్లాహ్ తన కారుణ్య వర్షాన్ని, శ్రేయాన్ని కురిపించుగాక. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి నామధేయాన్ని ఉచ్చరించినప్పుడు గౌరవార్థంగా, వేడుకోలుగా ఇలా పలుకటం జరుగుతుంది.
2. **హజ్రత్ ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర :** రచయిత, ముహమ్మద్ ఇనాయతుల్లా సుబ్‌హానీ; అనువాదం, నసీం గాజీ ఫలాహీ; ప్రకాశకులు మర్కజీ మక్తబా ఇస్లామీ పబ్లిషర్స్, అబుల్ ఫజల్ ఎన్‌క్లేవ్, జామియా నగర్, న్యూఢిల్లీ-25.

# ఒక సునిశ్చిత ప్రయత్నం

భారత దేశం మొదలుకొని ప్రపంచంలో ఎక్కడ ప్రేలుళ్ళు జరిగినా, ఎవరు హత్య గావించబడినా ఆ సంఘటనలో యాదృచ్ఛికంగా ఎవరైనా ముస్లిం ఉంటే దానిని మొదట 'ఇస్లామీయ ఉగ్రవాదం'గా చెప్పబడేది.

అనతికాలంలోనే ప్రసార, ప్రచార సాధనాలతో సహా కొన్ని శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఓ పథకం ప్రకారం ఆ పదాన్ని క్రమంగా 'ఇస్లాం ఉగ్రవాదం' గా మార్చివేశాయి. దీనిని ఓ నిర్ణీత పద్ధతి ప్రకారం ప్రచారం చేయబడిన ఫలితంగానే ఈనాడు ఎక్కడ ప్రేలుళ్ళు జరిగినా దానిని వెంటనే 'ఇస్లాం ఉగ్రవాదం' ఘటనగా భావించడం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో ప్రసార మాధ్యమంతో పాశ్చాత్య దేశాలతో సహా ఇతర దేశాల్లో వివిధ భాషల్లో అసంఖ్యాక పుస్తకాలను వ్రాసి ప్రపంచంలో ఉగ్రవాదానికి మూలం 'ఇస్లాం' అంటూ ప్రజల్లో ప్రచారం చేయబడింది.

ఖుర్‌ఆన్‌లోని వచనాలు ఇతర ధర్మాలను అనుసరించే 'కాఫిర్' (అవిశ్వాసులు) లతో పోరాడి వారిని నిర్దాక్షిణ్యంగా చంపి, వారి పూజా మందిరాలను ధ్వంసం చేయమనీ, ఈ 'జిహాద్' చేసే వారికి అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడంటూ ముస్లింలను ఆదేశిస్తున్నాయి అనే దుష్ప్రచారం ప్రామాణికంగా చేయబడింది. ప్రణాళికాబద్ధంగా రచించుకున్న ఈ పద్ధతి ప్రకారం ఇస్లాం అమాయకులను పొట్టనబెట్టుకునే ఉగ్రవాదం అంటూ 'జిహాద్' అర్థాన్ని ఉగ్రవాదంగా మార్చివేశారు.

అసలు వాస్తవం ఏమిటి? ఇది తెలుసుకోవటానికి మనం అదే విధానాన్ని (అంటే ప్రచార ప్రసార సాధనాలను) అనుసరించాలి. వేటిమూలంగానైతే మనకు విషయాలను తెలుసుకునే జ్ఞానం కలిగిందో అదే మార్గాన్ని (మీడియాను ఉపయోగించటం) అనుసరించాలి. నిష్కల్మష హృదయంతో నేను చేస్తున్న ఈ ప్రయత్నంలో ఒకవేళ తెలియక నా వల్ల ఏవైనా తప్పులు జరిగి ఉంటే అందుకు పాఠక మహాశయులు నన్ను క్షమించాలి.

ఇస్లాంను గురించి దేన్నైనా ప్రామాణికం చేయటానికి మనం మూడు విషయాలను గ్రహించాలి.

1. ఖుర్‌ఆన్‌లోని అల్లాహ్ ఆదేశాలు.
2. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి జీవిత చరిత్ర.
3. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి కథనాలు, అంటే ప్రవచనాలు (హదీసులు).

★ వాస్తవంగా ఇస్లాం నిరపరాధులతో పోరాడటానికీ, వారిని చంపటానికి, హింసను వ్యాపింపజేయమనే ఆదేశాలిస్తుందా?

★ నిజానికి ఇస్లాం ఇతరుల పూజా మందిరాలను కూల్చివేయమంటూ ఆదేశిస్తుందా?

★ ఇస్లాం ప్రజలను బలవంతంగా ముస్లింలుగా మార్చమంటూ ఆదేశిస్తుందా?

★ వాస్తవంగా దాడులు జరపటం, నిర్దోషులను చంపివేయటం, ఉగ్రవాదాన్ని వ్యాపింపజేయటాన్నే 'జిహాద్' అంటారా?

★ నిజంగానే ఇస్లాం ఒక ఉగ్రవాద ధర్మమా?

మొట్టమొదటి మాటగా హజ్రత్ ముహమ్మద్ (సఅసం) చివరి దైవప్రవక్త అని తెలుసుకోవటం అత్యంత అవశ్యకం. అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌ను ఆకాశం నుండి ముహమ్మద్ (సఅసం)పై అవతరింపజేశాడు. దైవప్రవక్తగా అయిన తరువాత తన 23 ఏళ్ళ కాల పర్యంతం ఆయన (సఅసం) ఏం చేసినా ఖుర్‌ఆన్ ఆదేశ ప్రకారమే చేశారు.

మరో మాటగా చెప్పాలంటే, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి ఈ 23 ఏళ్ళ జీవిత కాలం ఖుర్‌ఆన్ గ్రంథానికి ఆచరణ రూపమే. ఖుర్‌ఆన్‌నూ, ఇస్లాంను అర్థం చేసుకోవటానికి అన్నిటికంటే సులువైన, ప్రధానమైన ఆధారంగా స్వయానా హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి పవిత్ర జీవితాన్నే తీసుకోవాలి. నా స్వీయ అనుభవం కూడా ఇదే. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి జీవిత చరిత్రను, ఖుర్‌ఆన్‌ను చదివితే ఇస్లాం ఉగ్రవాదమా? లేక ఆదర్శవాదమా? అనే విషయాన్ని స్వయాన పాఠకులే నిర్ణయించుకోగలుగుతారు.

# హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి సంక్షిప్త జీవిత చరిత్ర

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి పవిత్ర జీవిత చరిత్రను వ్రాసిన విద్వాంసుల ప్రకారం, ఆయన (సఅసం) క్రీ.శ. 570లో అరేబియాలోని మక్కా నగరంలోని ఖురైష్ తెగకు చెందిన సర్దారు అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు అబ్దుల్లాహ్ ఇంట జన్మించారు. ఆయన జన్మించక ముందే తండ్రి అబ్దుల్లాహ్ మరణించారు. 6 సంవత్సరాల బాల్యంలో తల్లి ఆమినా కూడా గతించారు. 8 సంవత్సరాల వయస్సులో తాత (తండ్రిగారి తండ్రి) అబ్దుల్ ముత్తలిబ్ కూడా దివంగతులయ్యారు. ఆ తరువాత ఆయన వారి బాబాయి అబూ తాలిబ్ సంరక్షణలో పెరిగారు. 25 ఏళ్ళ ప్రాయంలో ముహమ్మద్ (సఅసం) వివాహం బీబీ ఖతీజాతో జరిగింది. బీబీ ఖతీజా మక్కా నగరంలో గౌరవనీయమైన ఓ సంపన్న కుటుంబానికి చెందిన వితంతువు. ఆ కాలంలో మక్కావాసులు కాబా గృహంలోని 360 విగ్రహాలను ఆరాధించేవారు. మక్కాకు ఈ విగ్రహారాధన సిరియా నుండి వచ్చి చేరింది. అక్కడ తొలుత 'హుబుల్' అనే విగ్రహం స్థాపించబడింది. దాని తరువాత 'ఇసాఫ్', 'నాయిలా' అనే విగ్రహాలు మక్కాలోని జమ్‌జమ్ అనే బావిపై ప్రతిష్టించబడ్డాయి. ఇక ఆ తరువాత ప్రతి తెగవారు తమ తమ విగ్రహాలను స్థాపించుకున్నారు. అదే విధంగా ఖురైష్ తెగవారు 'ఉజ్జా', 'తాయిఫ్' తెగవారు 'లాత్', 'మదీనాలోని 'ఔస్' 'ఖజ్‌రజ్' తెగ వారు 'మూనత్' విగ్రహాలను ప్రతిష్టించుకున్నారు. వీటిలో 'వొద్దు', 'సువాఅ' 'నసర్' మొదలగు విగ్రహాలు కూడా ఉండేవి. ఇవే కాకుండా దైవప్రవక్తలైన హజ్రత్ ఇబ్రాహీం (అలై), హజ్రత్ ఇస్మాయిల్ (అలై), హజ్రత్ ఈసా (అలై) మొదలగు వారి చిత్రపటాలు, ప్రతిమలు కాబా మందిరంలో ఉండేవి.

ఈ పరిస్థితుల్లో ముహమ్మద్ (సఅసం) వారి 40 ఏళ్ళ ప్రాయంలో రమజాను మాసంలో మక్కా నగరానికి 6 మైళ్ళ దూరంలో 'హిరా' అనే పేరుగల ఒక గుహలో దైవదూత 'జిబ్రీల్ (అలై)' ద్వారా అల్లాహ్ నుండి ఆయన (సఅసం)పై తొలి సందేశం అవతరించింది. ఆ తరువాత దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)గారిపై వేరు వేరు సమయాల్లో అల్లాహ్ సందేశాలు అవతరించేవి. ఆ సందేశాల సంకలనమే 'దివ్య ఖుర్‌ఆన్'. ముహమ్మద్ (సఅసం) దేవుడు ఒక్కడే అనీ, ఆయనకు సమానులెవ్వరూ

లేరు, ఆయన మాత్రమే ఆరాధనకు అర్హుడు, అందరూ ఆయన్నే ఆరాధించాలనీ, అల్లాహ్ ఆయనను తన ప్రవక్తగా ప్రభవింపజేశాడనీ ప్రజలకు ఈ సత్యాన్ని తెలిపి, వారికి రుజుమార్గాన్ని చూపాలని అల్లాహ్ తన ఆదేశాలను అవతరింపజేశాడంటూ ప్రజలకు బోధించసాగారు. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి ఈ సందేశాన్ని విశ్వసించిన వారినే 'ముస్లింలు' అంటారు. 'ముస్లిం' అంటే ఆజ్ఞాపాలన చేసేవాడు, విశ్వాసపాత్రుడు, తనను తాను దైవానికి సమర్పించుకున్నవాడు అని అర్థం.

బీబీ ఖతీజా (రజి) దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను విశ్వసించిన (ముస్లిం) తొలి మహిళ అయ్యారు. ఆ తరువాత బాబాయి అబూ తాలిబ్ కుమారుడు అలీ (రజి), ఇంకా ప్రవక్త (సఅసం) పెంపుడు కుమారుడైన జైద్ (రజి), దైవప్రవక్తగారి ఆప్తమిత్రులు అబూబకర్ (రజి) ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారటానికి **"అష్హదు అల్లాహ్ ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదుర్రసూలుల్లాహ్"** (అల్లాహ్ తప్ప మరో పూజనీయుడు లేడు, ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను) అనే సద్వచనాన్ని పలికి ఇస్లాం స్వీకరించారు.

మక్కావాసులలో ఇంకా ఇతరులు కూడా ఇస్లాంను విశ్వసించి ముస్లింలుగా మారిపోసాగారు. ముహమ్మద్ (సఅసం) తన తాతముత్తాతల ధర్మమైన బహుదైవా రాధన, విగ్రహారాధన స్థానంలో ఏదో కొత్త ధర్మాన్ని బోధిస్తూ తమ పూర్వీకుల ధర్మాన్ని అంతమొందిస్తున్నాడనే విషయం మక్కాలో ఖురైష్ సర్దారులకు తెలిసి పోయింది. ఇది తెలుసుకున్న స్వయానా ఆయన తెగకు చెందిన ఖురైషులు ఆగ్రహంతో ఊగిపోయారు. మక్కాలోని బహుదైవారాధకులైన సర్దారులంతా కలిసి ఈ విషయంలో ముహమ్మద్ (సఅసం)గారి బాబాయి అబూ తాలిబ్‌కు ఫిర్యాదు చేశారు. బాబాయి అబూ తాలిబ్ ముహమ్మద్ (సఅసం)ను పిలిపించి, "ముహమ్మద్ (సఅసం)! వీరంతా మన ఖురైష్ తెగలో ఎంతో ప్రభావశీలురైన సర్దారులు. "దేవుడు ఒక్కడే. ఆయన వినా మరో దైవం లేడు" అంటూ నీవు చేస్తున్న ఏకదైవారాధనా సందేశ ప్రచారాన్ని మానుకొని మన తాతముత్తాతల ధర్మంపైనే ఉండాలంటూ వీరంతా కోరుతున్నారు" అని అన్నారు. అందుకు ముహమ్మద్ (సఅసం) తమ ఏకేశ్వర సందేశ ప్రచారాన్ని మానుకోవడానికి నిరాకరించారు. దాంతో ఖురైష్ సర్దారులు ఆగ్రహంతో అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఆ తరువాత ఖురైష్ సర్దారులు ఇక ముహమ్మద్ (సఅసం)ను

అన్ని విధాలా అణచివేయాలని తీర్మానించుకున్నారు. ముహమ్మద్ (సఅసం), ఆయన అనుచరులను రకరకాలుగా నిర్దాక్షిణ్యంగా వేధించేవారు, అవమానించేవారు. ఆయన(స)పై రాళ్ళ వర్షం కురిపించేవారు. ఇంతగా వేధిస్తున్నా ముహమ్మద్ (సఅసం) గారు వారి అఘాయిత్యాలకు, దౌర్జన్యాలకు సమాధానంగా సహృదయంతోనే వ్యవహరించారు.

ముహమ్మద్ (సఅసం)ను, వారి సహచరులైన ముస్లింలను విరోధించటానికి అరేబియాలోని ఇతర తెగలవారు కూడా ఏకమై ఇకపై ఏ తెగైనా ముస్లింలకు ఆశ్రయమివ్వకూడదని ఓ ఒప్పందం చేసుకున్నారు. ప్రతి తెగవారు ముస్లింలను ఎక్కడ కనపడితే అక్కడ పట్టుకొని కొట్టడం, వేధించడం ఇంకా అన్ని రకాలుగా అవమానించేవారు.

రోజురోజుకు వారి వేధింపులు పెరిగిపోయాయి. వారు నిర్దోషులు, నిస్సహాయులైన ముస్లింలను బంధించారు, హింసించారు. ఆకలదప్పులపాల్జేశారు. మండిపోతున్న మక్కా ఇసుక తిన్నెలపై వారిని నగ్నంగా చేసి దొర్లించారు. కాల్చిన ఇనుప కడ్డీలతో వాతలు పెట్టారు. ఇంకా రకరకాలుగా వేధించారు. మక్కాలోని నిరుపేద కుటుంబానికి చెందిన హజ్రత్ యాసిర్ (రజి), ఆయన భార్య హజ్రత్ సుమయ్య (రజి), వారి కుమారుడు అమ్మార్ (రజి) ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారిపోవటాన్ని జీర్ణించుకోలేని మక్కాలోని ఇస్లాం విరోధులు మిట్టమధ్యాహ్న సమయంలో వారిని వివస్త్రులుగా చేసి మండుటెండలో రగిలిపోతున్న ఇసుకపై పరుండబెట్టేవారు.

వారు పెట్టే యాతనలను భరిస్తూ హజ్రత్ యాసిర్ (రజి) గిలగిలా తన్నుకొని ప్రాణాలు వదిలారు. ముహమ్మద్ (సఅసం) గారికి, ముస్లింలకు బద్ధ విరోధి అయిన అబూ జహల్ హజ్రత్, సుమయ్యా (రజి)పై ఎంతో నిర్దాక్షిణ్యంగా దౌర్జన్యం చేస్తూ ఉండేవాడు. ఒకనాడు ఆమె అబూ జహల్‌కు శాపనార్థాలు పెట్టారు. దాంతో ఆగ్రహించిన అబూ జహల్, హజ్రత్ సుమయ్యా (రజి)పై బల్లెం విసిరి ఆమెను అత్యంత దారుణంగా చంపివేశాడు. **ఆ విధంగా హజ్రత్ సుమయ్య (రజి) ఇస్లాం చరిత్రలో సత్యధర్మ సంరక్షణకై అమరత్వం పొందిన తొలి మహిళ అయ్యారు.**

ఖురైషులు ప్రవక్త అనుచరుల్లో ఒకరైన అమ్మార్ (రజి)కు లోహపు కవచాన్ని తొడిగించి మండుటెండలో రగిలిపోతున్న ఇసుకపై పడుకోబెట్టి స్పృహ కోల్పోయే వరకు కొట్టేవారు. ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారిపోయిన హజ్రత్ బిలాల్

(రజి), ఉమయ్యా వారికి అన్నపానీయాలు అందకుండా చేశారు. మిట్టమధ్యాహ్న సమయంలో ఆకలిదప్పులతో అల్లాడిపోతున్న బిలాల్ (రజి)ని బండలపై పడుకోబెట్టి, గుండెలపై బరువులు పెట్టించి 'ముస్లిం అయినందుకు ఇప్పుడు ఫలితం అనుభవించు' అనేవారు.

ఆ సమయంలో ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారిపోయిన బానిసలందరినీ ఇలాగే వేధించేవారు. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) ప్రాణమిత్రులు హజ్రత్ అబూ బకర్ (రజి) అలాంటి వారినంతా కొని, వారికి బానిసత్వం నుండి విముక్తి కల్పించారు.

ఎవరైనా ఖుర్ఆన్ పఠిస్తూ ఉండగా వినటమో లేక నమాజ్ చేస్తూ ఉండగా చూడటమో జరిగినప్పుడు ఖురైషులు వారిని హేళన చేసేవారు. వారిని వేధించేవారు. ఇలాంటి భయం కారణంగా ముస్లింలు గోప్యంగా నమాజు ఆచరించేవారు. ఖుర్ఆన్ను చదివేవారు. ఒకరోజు ఖురైషులు కాబా గృహంలో కూర్చొని ఉండగా ప్రవక్త (సఅసం) అనుచరులలో ఒకరైన అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ నమాజ్ చదువుతూ ఉండగా అక్కడున్న అవిశ్వాసులైన ఖురైష్ సర్దారులు ఆయనపై విరుచుకుపడి ఆయనను అత్యంత దారుణంగా కొట్టి చంపివేశారు.

మక్కాలోని అవిశ్వాసుల దౌర్జన్యాల కారణంగా ముస్లింల బ్రతుకులు దుర్భరమైపోతుండటం చూసి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారిని పొరుగున ఉన్న అబిసీనియాకు వలస వెళ్ళమన్నారు.

అబిసీనియా రాజు నజ్జాషీ క్రైస్తవుడు. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆజ్ఞానుసారం చాలా మంది ముస్లింలు అబిసీనియాకు వెళ్ళిపోయారు. ఈ విషయం తెలిసిన ఖురైషులు అబిసీనియా రాజు వద్దకు ఇద్దరు దూతలను పంపారు. వారు ఆయనతో, "మహారాజా! మా దేశం నుండి కొందరు నేరగాళ్ళు పారిపోయి వచ్చి మీ వద్ద శరణు తీసుకున్నారు. వీరు మా ధర్మంపై తిరుగుబాటు చేయడమే కాకుండా మీ క్రైస్తవ ధర్మాన్ని కూడా స్వీకరించలేదు. అయినా మీ రాజ్యంలో ఉంటున్నారు. వీరు తమ పూర్వీకుల ధర్మంపై తిరుగుబాటు చేసి మీరుగానీ, మేముగానీ ఎవరూ ఎరుగని ఓ కొత్త ధర్మాన్ని అనుసరిస్తున్నారు. వీరు అపరాధులు. మేము వీరిని తీసుకెళ్ళడానికి వచ్చాం" అని అన్నారు.

అందుకు నజ్జాషీ రాజు ముస్లింలతో, "మీరు అనుసరిస్తున్న ఆ కొత్త ధర్మం

ఏమిటి?" అని అడిగారు. అందుకు ముస్లింల తరఫున హజ్రత్ జాఫర్ (రజి), "రాజా! ఇంతకు ముందు మేమంతా అల్లరి చిల్లరగా తిరుగుతూ అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతూ ఉండే వాళ్ళం. విగ్రహాలను పూజించేవాళ్ళం, అసహ్యాకరమైన పనులను చేసేవాళ్ళం. పొరుగు వారితోనే కాకుండా మాలో మేమే అనవసరంగా పోట్లాడుకునేవాళ్ళం. ఇలాంటి పరిస్థితుల్లో అల్లాహ్ మా జాతిలో నుండే ఒకరిని ప్రవక్తగా చేసి మా వద్దకు పంపాడు. ఆయన మమ్మల్ని సత్యధర్మమయిన ఇస్లాం వైపునకు పిలిచారు. ఆయన మాతో 'మనం కేవలం ఒకే దైవాన్ని ఆరాధించాలనీ, నిర్జీవమైన విగ్రహారాధనను మానండి, సత్యాన్నే పలకండి, పొరుగు వారితో మంచిగా వ్యవహరించండి. వ్యభిచారం, చెడు పనులను వదలివేయండి, అనాథలు, బలహీనుల సొమ్ము తినకండి. పవిత్రులైన స్త్రీలపై నిందలు వేయకండి, నమాజు ఆచరించండి, దానధర్మాలు చేయండి' అంటూ మాకు బోధించారు. మేము ఆయనను, ఆయన సందేశాన్ని సత్యమైనదిగా గ్రహించాము. ఆయనను విశ్వసించి ముస్లింలమైపోయాము" అని అన్నారు.

హజ్రత్ జాఫర్ (రజి) గారి సమాధానాన్ని విన్న రాజు నజ్జాషీ చాలా ప్రభావితుడై "వీరు ఇకపై ఇక్కడే ఉంటారని" చెప్పి ఆ ఇద్దరు దూతలను వెనక్కు పంపివేశాడు.

మక్కా నగరంలో ఖత్తాబ్ కుమారుడు ఉమర్ ఓ పెద్ద కోపిష్టి. పైగా మహా ధైర్యశాలి, సాహసవంతుడు. ఉమర్ గనక ఇస్లాం స్వీకరించి ముస్లింగా మారిపోతే ఇస్లాంకు చాలా బలం చేకూరుతుందని అతనికి విశ్వాస భాగ్యాన్ని ప్రసాదించమంటూ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అల్లాహ్‌ను వేడుకునేవారు. ఉమర్ ముస్లింల పట్ల చాలా నిర్దయగా ఉండేవాడు. నజ్జాషీ రాజు ముస్లింలకు శరణు ఇచ్చాడని తెలిసి ఉగ్రుడై పోయాడు. దీనికంతటికీ మూలకారకుడైన ముహమ్మద్ (సఅసం)ను చంపివేసి, ఈ సమస్యను శాశ్వతంగా అంతం చేయాలని నిర్ణయించుకుని కరవాలాన్ని చేతబట్టి బయలుదేరాడు. దారిలో ఆయనకు ను-ఐమ్-బిన్ అబ్దుల్లాహ్ తారసపడ్డాడు. ఆయన అంతకు ముందే ఇస్లాం స్వీకరించి ఉన్న విషయం ఉమర్‌కు తెలియదు. మాటల సందర్భంగా ఉమర్, దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను చంపివేయటానికి వెడుతున్నాడని తెలిసి ఆయన ఆలోచనను మళ్ళించటానికని ఉమర్‌తో, "మీ చెల్లెలు, బావ ముస్లిం అయిపోయారు. ముందు వారి కథ తేల్చుకోండి" అన్నాడు.

తన చెల్లెలు, బావ ఇస్లాం స్వీకరించి ముస్లింలైపోయారని విని ఆగ్రహంతో ఊగిపోతూ తన సోదరి ఇంటికి వెళ్ళాడు ఉమర్. లోపల ఏదో చదువుతున్న శబ్దం

వినిపించింది. ఆ సమయంలో ఖబ్బాబ్ (రజి) ఖుర్ఆన్ పఠిస్తూ ఉన్నారు. ఉమర్ స్వరం విన్నంతనే భయపడి ఆయన లోపలికి వెళ్ళి దాక్కున్నారు. అంతవరకు చదువుతున్న ఆ ఖుర్ఆన్ పుటలను ఉమర్ సోదరి దాచిపెట్టారు. బావ సయ్యిద్ (రజి) తలుపులు తెరుస్తూనే, "మీరు ముస్లిములైపోయిన విషయం నాకు తెలియదనుకుంటున్నారా?" అంటూ కోపంతో ఉమర్ తన చెల్లిని, బావను కొట్టసాగారు. ఎంతగా కొట్టారంటే ఆ దెబ్బలకు ఆమె తలకు బలమైన గాయమయింది. అన్ని దెబ్బలు తిన్న తరువాత కూడా ఆమె ఇస్లాంను వదలుకోవటానికి నిరాకరించింది.

ఇస్లాం పట్ల చెల్లెలి దృఢచిత్తం ఉమర్‌ను కదిలించివేసింది. ఆ ఖుర్ఆన్ పుటలు ఏమిటో కాస్త చూపమన్నాడు. వాటిని చదివిన తరువాత ఉమర్ మనసు ఉన్నపళంగా మారిపోయింది. తాను కూడా ముస్లిం అవ్వాలనే ఉద్దేశ్యంతో ముహమ్మద్ (సఅసం) గారిని కలవటానికి వెళ్ళారు.

ఉమర్, దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారితో, "నేను ఇస్లాం స్వీకరించాలని వచ్చాను. అల్లాహ్ తప్ప మరే ఇతర ఆరాధనీయులు లేరనీ, ముహమ్మద్ (సఅసం) దైవ సందేశహరులని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇప్పుడు నేను ముస్లిం అయ్యాను." అంటూ వినమ్రంగా సద్వచనాన్ని పలికారు.

ఈ విధంగా ముస్లింల సంఖ్య క్రమంగా పెరిగిపోసాగింది. దీన్ని ఆపటానికని ఖురైషులు పరస్పరం ఒక అంగీకారానికి వచ్చారు. దీని ప్రకారం ఖురైష్ సర్దారులు ముహమ్మద్ (సఅసం) గారి కుటుంబ పరివారంలో ప్రముఖుడైన అబూ తాలిబ్ (ముహమ్మద్ (సఅసం) గారి బాబాయి) వద్దకు వెళ్ళి, "మీరు ముహమ్మద్ (సఅసం)ను మా స్వాధీనం చెయ్యండి. మేము అతణ్ణి చంపేస్తాం. ఒకవేళ మీరు దీనికి అంగీకరించకపోతే మేము మిమ్మల్నందరినీ నిర్బంధిస్తాము, బహిష్కరిస్తాం, మీ నుండి ఏమీ కొనం, మీకు ఏమీ అమ్మము, మీతో ఎలాంటి లావాదేవీలు జరపం, మీరంతా ఆకలితో అలమటించి చస్తారు" అని అన్నారు.

అబూ తాలిబ్, ముహమ్మద్ (సఅసం)ను వారి స్వాధీనం చేయటానికి నిరాకరించారు. ఈ కారణంగా ముహమ్మద్ (సఅసం), ఆయన బాబాయి అబూ తాలిబ్ పరివారంతోపాటు ఒక లోయలో నిర్బంధించబడ్డారు. ఆకలితో వారు ఆకులు అలములు తినవలసి వచ్చింది. చాలా కాలం తరువాత ముస్లింలు వారి సానుభూతిపరుల ప్రయత్నాలతో ఆ నిర్బంధం తొలగిపోయింది.

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళ తరువాత ముహమ్మద్ (సఅసం) గారి బాబాయి అబూ తాలిబ్ మరణించారు. మరికొన్ని రోజుల తర్వాత భార్య ఖతీజా (రజి) కూడా ఈ లోకాన్ని వీడిపోయారు. ముహమ్మద్ (సఅసం) ప్రజల్లో చేస్తున్న దైవ సందేశ ప్రచారాన్ని వదిలివెయ్యాలని ఖురైష్ సర్దారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ప్రవక్త (స) బాబాయి అబూ తాలిబ్ మరణానంతరం వారిపై అవిశ్వాసుల దౌర్జన్యాలు మితిమీరిపోయాయి. ఒక రోజు ముహమ్మద్ (సఅసం) కాబా గృహం వద్ద నమాజ్ చేస్తూ ఉండగా ఆయనపై అమేధ్యాన్ని తెచ్చివేశారు. అయినా ఆయన ఎవరినీ నిందించలేదు, శాపనార్థాలు పెట్టలేదు.

అదే విధంగా మరొకసారి ముహమ్మద్ (సఅసం) అలా వెళుతూ ఉంటే ఆ దారిన పోతున్న ఒక వ్యక్తి వారి తలపై దుమ్ము వేశారు. వారు ఇంటికి తిరిగొచ్చారు. నిత్యం జరుగుతున్న అత్యాచారాలను, అఘాయిత్యాలను చూసి ఆయన ముద్దుల కూతురు ఫాతిమా (రజి) తమ నాన్న తల నిండా పడిన దుమ్మును నీళ్ళతో కడుగుతూ భోరున ఏడవసాగారు. ముహమ్మద్ (సఅసం) ఏడుస్తున్న కూతురుతో, "ఏడవకు బిడ్డా... ఏడవకు. అల్లాహ్ మీ నాన్నకు సహాయం చేస్తాడు" అంటూ ఓదార్చారు.

తనపై ఖురైషుల అఘాయిత్యాలు, దౌర్జన్యాలు, వేధింపులు భరించరానంతగా అయ్యాయని తెలిసి ముహమ్మద్ (సఅసం) మక్కాకు సమీపంలోని తాయిఫ్[1] కు వెళ్ళారు. కాని తాయిఫ్ వారు ఆయన అక్కడ ఉండటాన్ని కూడా ఒప్పుకోలేదు. అలాహ్ సందేశాలన్నీ పచ్చి అబద్ధాలనీ, ముహమ్మద్ (సఅసం)ను దైవప్రవక్తగా అంగీకరించటానికి తిరస్కరించారు సఖీఫ్ తెగకు చెందిన ఒక సర్దారు తాయిఫ్‌లోని అల్లరి మూకలను ముహమ్మద్ (సఅసం) వెంటపడమంటూ పురమాయించాడు. వారు ఆయనపై రాళ్ళ వర్షం కురిపించి తీవ్రంగా గాయపరిచారు. అలా గాయపడిన దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) అక్కడ దగ్గరలోని ఒక ద్రాక్ష తోటలో చేరి సేదతీరారు.

తాయిఫ్‌లో జరిగిన ఈ సంఘటన సమాచారం తెలుసుకున్న మక్కా సర్దారులు

---

1. *తాయిఫ్ ఒక శివారు గ్రామం. అక్కడ మక్కాలోని సంపన్నులైన ఖురైష్ సర్దారుల తోటలు, పంట పొలాలు, విశ్రాంతి గృహాలు ఉండేవి. అక్కడ సయీఫ్ తెగవారు వాటి రక్షణ చేస్తూ ఉండేవారు. ఎడారి మధ్య పంట పొలం గల భాగాన్ని 'నఖలిస్తాన్' అంటారు.*

తెగ సంబరపడిపోయి ముహమ్మద్ (సఅసం)ను ఎగతాళి చేశారు. ముహమ్మద్ (సఅసం) మక్కాకు తిరిగి వస్తూనే ఆయనను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఆయన (సఅసం) తాయిఫ్ నుండి మక్కాకు తిరిగి వస్తుండగా దారిలో హిరా అనే ప్రదేశంలో ఆయన సానుభూతిపరులైన కొందరు ఖురైషులు తారసపడ్డారు. వారి ద్వారా తనను హత్య చేయటానికై ఖురైషులు కుట్ర పన్నుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న ముహమ్మద్ (సఅసం) తమ భార్య బీబీ ఖదీజా (రజి) బంధువైన 'ఆది' కుమారుడు ముతయిమ్ సహాయంతో మక్కా చేరుకున్నారు. ముహమ్మద్ (సఅసం) గారికి ముతయిమ్ ఆశ్రయమివ్వటంతో ఆయనను ఎవరూ ఏమీ చేయలేకపోయారు. కాని ముహమ్మద్ (సఅసం) కాబా గృహం వద్దకు వెళ్ళినప్పుడు అబూ జహల్ ఆయనను ఎగతాళిగా మాట్లాడాడు.

ముహమ్మద్ (సఅసం) తమ ధర్మప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వారు అరబ్బులోని ఇతర తెగల వారిని కూడా ఇస్లాం వైపునకు ఆహ్వానించడం ప్రారంభించారు. ఫలితంగా మదీనాలో ఇస్లాం వ్యాప్తి ప్రారంభమైంది. మదీనావాసులు దైవ సందేశహరులు ముహమ్మద్ (సఅసం) సందేశాన్ని విశ్వసించడమే కాకుండా ఖురైషుల బారి నుండి వారిని రక్షించటానికి ప్రతినబూనారు. ఇంకా ఈసారి వారు హజ్ యాత్రకై మక్కాకు వెళ్ళేటప్పుడు తమ ప్రియప్రవక్త (సఅసం)ను మదీనాకు ఆహ్వానించాలని నిర్ణయించుకున్నారు. హజ్ సమయం రాగానే మదీనా నుండి ముస్లిమేతర యాత్రికుల ఒక పెద్ద సమూహం మక్కాకు బయలుదేరింది. మదీనా ముస్లింలు కాబా గృహం వద్ద ముహమ్మద్ (సఅసం)ను కలిశారు. వీరిలో ఇద్దరు మహిళలతో కలిపి 75 మంది. ఒక నిర్ణీత స్థలంలో రాత్రి సమయంలో ముహమ్మద్ (సఅసం)ను కలుసుకున్నారు. ఆ తరువాత వారు ఈ సత్యధర్మ మార్గంలో మార్గదర్శనం చేసే దైవప్రవక్త (సఅసం) రక్షణకై ప్రతినబూనారు. ఈ ప్రతిజ్ఞ తాలూకు ఆ రాత్రి జరిగిన విషయమంతా ఖురైషులకు తెలిసిపోయింది. మదీనా వారు తిరిగి వెళ్లి పోయారనే వార్తను ఉదయాన్నే తెలుసుకున్న ఖురైషులు వారిని వెంబడించారు. కాని వారు చిక్కలేదు. అయితే వారిలోని సఅద్ (రజి) పట్టుబడ్డారు. ఖురైషులు అతణ్ణి తీవ్రంగా కొడుతూ, జుట్టు పట్టుకుని ఈడ్చుకుంటూ మక్కాకు తీసుకెళ్ళారు.

మక్కాలో ముస్లింలపై ఖురైషుల వేధింపులు భరించరానంతగా పెరిగిపోవటంతో దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ముస్లింలను ఖురైషులు పసిగట్టలేని విధంగా

ఒక్కొక్కరుగా గాని ఇద్దరిద్దరుగా గాని రహస్యంగా మదీనాకు బయలుదేరి వెళ్ళ మన్నారు. అలాగే ముస్లింలు మదీనా వెడుతున్నారు. చాలా మంది వెళ్ళిపోగా కొందరు ఖురైషుల చేతికి చిక్కి నిర్బంధించబడ్డారు. అలా దొరికిపోయిన వారిని ముహమ్మద్ (సఅసం) బోధించిన ధర్మాన్ని వదలి తమ పూర్వీకుల ధర్మానికి తిరిగి రావాలంటూ అతి నిర్దాక్షిణ్యంగా వేధించారు.

ఇప్పుడు మక్కాలో అలా బంధించబడిన ముస్లింలు, దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం), అబూబకర్ (రజి), అలీ (రజి) మాత్రమే మిగిలిపోయారు. వారిపై ఖురైషులు గట్టి నిఘా పెట్టి ఉంచారు. మదీనాకు ముస్లింల వలస ఫలితంగా అక్కడ ఇస్లాం ధర్మ ప్రచారం మొదలయ్యింది. అక్కడి ప్రజలు ముస్లింలుగా మారటం వేగం పుంజుకుంది. అక్కడ ముస్లింల శక్తి పెరగడం ప్రారంభమయింది. మదీనాలో ముస్లింల బలం క్రమంగా పెరిగిపోతూ ఉండడం చూసి ఖురైషులు ఆందోళనపడసాగారు. చివరకు ఒకరోజు ఖురైషులందరూ కలిసి 'దారున్, నద్వా' అనే రహస్య మందిరంలో సమావేశమై, ఇస్లాం ప్రభావానికి అడ్డుకట్టవేయటం ఎలా అనే ఆలోచనలో మునిగిపోయారు. "మనలో ప్రతి తెగ నుండి ఒక్కొక్కరుగా కలిసి మూకుమ్మడిగా దాడిచేసి ముహమ్మద్ (సఅసం)ను హతమార్చివేస్తే ఆయన కుటుంబం వారు అలా ఏకమైన అన్ని తెగలతో ఒకేసారి ఎదిరించలేక గత్యంతరంలేని పరిస్థితుల్లో వారు రాజీకి దిగిరాక తప్పదు" అంటూ అబూ జహల్ చేసిన ప్రతిపాదనతో అందరూ ఏకీభవించారు.

అలా ముందుగా నిర్ణయించుకున్న ఒకనాటి రాత్రి అవిశ్వాసులు ముహమ్మద్ (సఅసం) ఇంటినుండి బయటికి రాగానే హత్య చేయాలని ఆయన ఇంటిని నలువైపులా చుట్టుముట్టారు. అల్లాహ్, ముహమ్మద్ (సఅసం)ను ఈ ప్రమాదం పట్ల జాగృతం చేశాడు. ముహమ్మద్ (సఅసం) తమ వెంట ఉన్న తమ బాబాయి కుమారుడైన హజ్రత్ అలీ (రజి) గారితో, "అలీ (రజి)! వలసపొమ్మంటూ నాకు అల్లాహ్ నుండి ఆదేశం వచ్చింది. ఈనాడు శత్రువులు నన్ను హత్య చేయటానికి మన ఇంటిని చుట్టుముట్టి ఉన్నారు. నేను మదీనా వెడుతున్నాను. నీవు నా పడకపై నా దుప్పటి కప్పుకొని పడుకో, అల్లాహ్ నిన్ను రక్షిస్తాడు. ఉదయమే లేచి వెళ్ళి ప్రజలు భద్రత కోసం నా వద్ద ఉంచిన సొమ్మును వారికి ఇచ్చివేసి నీవు కూడా మదీనా వచ్చెయ్" అన్నారు. ఖురైషులు ముహమ్మద్ (సఅసం) గారి బద్ధ శత్రువులయినా వారి సొమ్మును

ఆయన వద్దే దాచేవారు. ఆ సమయంలో చాలా మంది దాచుకున్న సొమ్ము ఆయన వద్ద ఉండింది. ఆ కారణంగానే ముహమ్మద్ (సఅసం), అలీ (రజి) గారిని తమ వెంట తీసుకెళ్ళలేదు. ప్రజల సొమ్మును వాపసు చేయటానికని ఆయనను మక్కాలోనే వదలిపెట్టిపోయారు.

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) తమ ప్రియమిత్రులు అబూ బకర్ (రజి)ను తీసుకుని మక్కా నుండి మదీనాకు బయలుదేరారు. మదీనా మక్కాకు ఉత్తర దిశలో ఉంది. తనను వెతుక్కుంటూ శత్రువులు ఉత్తర దిశగా వస్తారని తెలిసి వారి నుండి తప్పించుకోవటానికి ముహమ్మద్ (సఅసం) మక్కా నుండి దక్షిణ దిశగా పోయే దారిలోగల 'సౌర్' అనే గుహలోనికి వెళ్ళారు. మూడు రోజుల వరకు వారిద్దరూ ఆ గుహలోనే ఉండిపోయారు. వారిని వెతకటం ఆగిపోయింది. అప్పుడు ముహమ్మద్ (సఅసం), అబూ బకర్ (రజి) ఆ గుహ నుండి బయటపడి మదీనా వైపునకు బయలుదేరి వెళ్ళారు.

ఎన్నో రాత్రింబవళ్ళు అలా ప్రయాణం చేస్తూ క్రీ.శ. 622 సెప్టెంబర్ 24వ తేదీనాడు మదీనా సమీపంలోని 'కుబా' గ్రామం చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఎన్నో ముస్లిం కుటుంబాలు వెలిసి ఉన్నాయి. అక్కడ ముహమ్మద్ (సఅసం) ఒక మస్జిద్‌కు పునాది వేశారు. అదే ఈనాడు 'కుబా' మస్జిద్ పేరుతో ప్రసిద్ధి చెందింది. అక్కడే అలీ (రజి), ముహమ్మద్ (సఅసం) గారిని కలిశారు. అక్కడే కొన్నాళ్ళు గడిపిన తరువాత దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) మదీనా చేరుకున్నారు. మదీనా చేరుకోగానే వారికి అన్ని వైపుల నుండి హృద్యంతంగా ఘన స్వాగతం లభించింది. దైవ సందేశహరులు (సఅసం) మదీనా చేరిన తరువాత అక్కడ ఏకేశ్వరవాద సత్యధర్మమయిన ఇస్లాం చాలా వేగంగా వ్యాపించడం ప్రారంభమయింది. **'లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్'** అంటే "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడు, ముహమ్మద్ (సఅసం) దైవసందేశహరులు" అనే సద్వచనం నలువైపులా ప్రతిధ్వనించసాగింది.

ఖురైష్ అవిశ్వాసులు, మునాఫిక్‌ల[1] (కపట విశ్వాసులు) ద్వారా మదీనాలోని

1. మునాఫిక్ (Hypocrats) కపటాచారులు, కపటి, మోసం, ద్రోహం. పైకి ముస్లిం అని చెప్పుకుంటూనే ఇస్లాంతో నికార్సయిన సంబంధంలేనివారు. ముస్లింలకు నష్టం చేకూర్చటానికి పైకి ఇస్లాం స్వీకరించినవారు.

సమాచారాన్ని తెలుసుకుంటూ ఉండేవారు. సత్యధర్మమైన ఇస్లాం ప్రవాహాన్ని ఆపటానికి, మదీనాపై దాడి చేయటానికి ప్రణాళికలు రచించటం మొదలుపెట్టారు. ఖురైషులు నిరంతరం ఎంతో కాలంగా ముస్లింలపై పలు విధాలుగా దౌర్జన్యం, వేధింపులు జరిపిందే కాకుండా ఇప్పుడు వారిని సమూలంగా నాశనం చేయటానికి సిద్ధపడ్డారు. ఈ కారణంగానే ముహమ్మద్ (సఅసం) బోధించిన ధర్మాన్ని విశ్వసించిన ముస్లింలు తమ మాతృ దేశాన్ని, సంపదను, ఆస్తిపాస్తులను వదలుకోవలసి వచ్చింది. అయినా ముస్లింలు అన్నివిధాలా ఓర్పు వహించారు. అయినా ఖురైష్ దౌర్జన్యపరులు మదీనాలో కూడా వారిని వెంటాడటం మానుకోలేదు. ఒక పెద్ద సైన్యంతో ముస్లింలపై దాడి చేశారు.

**ఖురైషుల వేధింపులు పరాకాష్టనందుకుని నిండా మునిగిపోయే పరిస్థితులు దాపురించగా వారిని ఎదుర్కోవటానికి అల్లాహ్ ముస్లింలకు అనుమతినిచ్చాడు. అల్లాహ్ ఆదేశం వచ్చేసింది. "ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది; ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయినవారు. నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు."** ***(ఖుర్ఆన్: 22-39)***

అత్యాచారులతో యుద్ధం చేయటానికి అల్లాహ్ ఆదేశం లభించింది. సత్యధర్మమైన ఇస్లాం రక్షణ కోసం కరవాలమెత్తటానికి ముస్లింలకు అనుమతి లభించింది. అధర్మాన్ని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోటానికై 'జిహాద్' (ధర్మయుద్ధం) ప్రారంభమయింది. ఇస్లాం విరోధులు దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను, ఆయన అనుచరులను నామరూపాల్లేకుండా చేయటానికి ముస్లింల నగరం మదీనాపై ఎన్నోసార్లు దాడి చేశారు, కాని వారి కుత్సిత ప్రయత్నాల్లో సఫలం కాలేకపోయారు.

సత్యధర్మ సంస్థాపన కోసం అన్యాయం, అత్యాచారం, ఉగ్రవాదాన్ని అంత మొందించటం కోసం 'జిహాద్' (ధర్మ రక్షణతోపాటు ఆత్మరక్షణ కోసం చేసే యుద్ధం)లో దైవప్రవక్తకు అన్నీ విజయాలే ప్రాప్తమవుతూ ఉండేవి. మక్కా, ఆ చుట్టుపట్ల ఉన్న అవిశ్వాసులు, బహుదైవారాధకులు చిత్తయిపోయారు. ఆ తరువాత మక్కాలోని మిథ్యావాదాన్నీ, ఉగ్రవాదాన్ని సమూలంగా అంతమొందించటానికి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) పది వేల ముస్లిం సైన్యాన్ని తీసుకుని వెళ్ళారు. వారి అపార శక్తి సామర్థ్యాలను, విజయాలను చూసి మక్కాలోని అవిశ్వాసులు తమ ఆయుధాలను

దించి చేతులెత్తేశారు. ఆ విధంగా రక్తపాతరహితంగా మక్కా విజయం సిద్ధించింది. సత్యం, శాంతి విజయం చేశాయి. అసత్యం, ఉగ్రవాదం ఓటమి పాలైంది.

మక్కాలో ఎక్కడైతే వారికి మునుపు అవమానాలు ఎదురయ్యాయో ఇప్పుడు అక్కడ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు, ముస్లింలకు ఘనస్వాగతం లభించింది. దయామయులు, కారుణ్యమూర్తి, దైవసందేశహరులు (సఅసం) వారందరినీ క్షమించి వేశారు. ఎవరైతే ముహమ్మద్ (సఅసం)ను, ముస్లింలను ఇంతకాలం నిర్దాక్షిణ్యంగా వేధించి దేశం విడిచిపోయేలా చేశారో వారంతా దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ఆనందంతో గుంపులు గుంపులుగా **"లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూ లుల్లాహ్"** అంటూ సద్వచనాన్ని పలుకుతూ విశ్వాస ప్రతిజ్ఞ చేస్తున్నారు. **"అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్ న ముహమ్మ దుర్రుసూలుల్లాహ్"** "అల్లాహ్ తప్ప మరో దైవం లేడనీ, ముహమ్మద్ (సఅసం) దైవసందేశహరులని నేను సాక్ష్యమిస్తున్నాను."

**హజ్రత్ ముహమ్మద్** (సఅసం) పవిత్ర జీవిత చరిత్రను చదివిన తరువాత ఏకేశ్వరవాదం, సత్యసంస్థాపన కోసం ముహమ్మద్ (సఅసం) అనేక కష్టాలను సహించారని గ్రహించగలిగాను. మక్కాలోని అవిశ్వాసులు సత్యధర్మమార్గంలో ఎన్నో అవరోధాలు కల్పించటానికి ముహమ్మద్ (సఅసం)ను పదమూడు సంవత్సరాల పాటు నిరంతరం ఎన్నో విధాలుగా వేధిస్తూ, అవమానపరుస్తూ ఉండేవారు. అంతటి ఘోరమైన అత్యాచారాల తరువాత కూడా ముహమ్మద్ (సఅసం) ధైర్యాన్ని వీడలేదు. చివరకు ఆయన తన మాతృదేశమైన మక్కాను వదలి మదీనాకు వలస పోవలసి వచ్చింది. అయినా మక్కా విగ్రహారాధకులైన ఖురైషులు, ముహమ్మద్ (సఅసం)ను, ముస్లింలను అక్కడ కూడా వదల్లేదు. ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లో సత్యధర్మ రక్షణ కోసం ముహమ్మద్ (సఅసం)కు యుద్ధం చేయటం తప్పనిసరి అయింది. ఈ విధంగా ముహమ్మద్ (సఅసం) వారి అనుచర సమాజమైన ముస్లింలపై యుద్ధాన్ని బలవంతంగా రుద్దబడింది.

ఈ పరిస్థితుల్లో అన్యాయం, అత్యాచారాలు చేసే అవిశ్వాసులనూ, బహుదైవా రాధకులను శిక్షించటానికి, సత్యధర్మ రక్షణ కోసం అల్లాహ్ ఆకాశం నుండి 'జిహాద్' (ఆత్మరక్షణ కోసం, ధర్మ రక్షణ కోసం సలిపే ధర్మయుద్ధం) చేయమనే ఆదేశాలను

ముహమ్మద్ (సఅసం)పై అవతరింపజేశాడు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సఅసం) జరిపిన యుద్ధాలు ఆక్రమణల కోసం కాదు. దురాక్రమణదారులు, ఉగ్రవాదుల నుండి రక్షించుకోవటం కోసం జరిగినవి. ఎందుకంటే అత్యాచారుల పట్ల ఇలా చేయకపోతే శాంతి శ్రేయాలు నెలకొనజాలవు.

దైవసందేశహరులు ముహమ్మద్ (సఅసం) సత్యం కోసం, శాంతి కోసం చివరి వరకూ సహనం వహించారు. సహన స్థయిర్యాల చివరి హద్దులే యుద్ధాలకు ఆద్యం పలుకుతాయి. ఇలాంటి యుద్ధాలనే 'ధర్మయుద్ధం' (జిహాద్) అనబడుతుంది.

ఇక్కడ ప్రధానంగా గమనించవలసిన విషయమేమిటంటే, ముహమ్మద్ (సఅసం) ఇంకా వారి అనుచరులైన ముస్లింలపై భయంకరంగా అత్యాచారాలు జరిపిన ఖురైషులు మక్కా విజయం నాడు తమకు ఏమి జరుగనున్నదో అనే భయంతో గజగజ వణికి పోయారు. కాని ముహమ్మద్ (సఅసం) వారందరినీ క్షమించి అప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. హజ్రత్ ముహమ్మద్ (సఅసం)ను అల్లాహ్ ఏ ఒక్క దేశం కోసమో, జాతి కోసమో మాత్రమే ప్రవక్తగా చేసి పంపలేదు. ఆయనను యావత్తు మానవ జాతి కోసం ప్రవక్తగా చేసి పంపాడు.

ఈ విషయం ఖుర్ఆన్‌లోని **7**వ అధ్యాయం **158**వ వచనంలో ఇలా ఉంది: ముహమ్మద్ (సఅసం)! ఇలా ప్రకటించు: "మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి, అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్ష రాస్యుడైన ప్రవక్తను – అతను అల్లాహ్‌ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు, అతనిని అనుసరించండి, మీరు సరైన మార్గం పొందుతారేమో."

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి జీవిత చరిత్ర అధ్యయనం ద్వారా సత్యం, శాంతి స్థాపన, ఉగ్రవాదాన్ని నిలువరించటమే ఇస్లాం ముఖ్యోద్దేశ్యం అనే విషయం విదితమవుతుంది. ఇస్లాంపై హింస, ఉగ్రవాదాన్ని ఆపాదించటం అన్నిటి కంటే పెద్ద అబద్ధం. ఏ సంఘటన జరిగినా దానిని ఇస్లాంతోనో లేక ముస్లిం సముదాయానికో అంటగట్టటం ఎంతమాత్రం తగదు.

# ఇస్లాం మరియు ఉగ్రవాదం

ఇక ఇస్లాంను గురించి విస్తృతంగా తెలుసుకోవటానికి ఖుర్ఆన్‌ను పరిశీలిద్దాం.

ఇస్లాం ఉగ్రవాదమా? ఆదర్శవాదమా? ఇది తెలుసుకోవటానికి ఖుర్ఆన్‌లోని కొన్ని వచనాలను మీ ముందు ఉంచుతాను. వీటిని నేను మౌలానా ఫతహ్ ముహమ్మద్ ఖాన్ జలంధరీచే అనువదించబడి "ముహమ్మద్ అండ్ కంపెనీ, మరోల్, పైప్‌లైన్, ముంబయి-59" వారు ప్రచురించిన దాని నుండి సేకరించాను.

ఖుర్ఆన్ గ్రంథ అనువాదంలో బ్రాకెట్ ( )లోని విషయాలు వివరణ కోసం రచయిత వ్రాసుకున్నవి అనే విషయాన్ని పాఠకులు గుర్తుంచుకోవాలి.

ఖుర్ఆన్ గ్రంథాన్ని అనువదించేటప్పుడు అందులోని ఏ వచన భావార్థం కూడా రవ్వంతయినా మార్పుకు గురికాకూడదనే విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే అది ఎటువంటి పరిస్థితుల్లోనూ మార్చగరానిది. అందుకే వివిధ భాషల్లోని వేరు వేరు అనువాదాల భావం ఒకేలా ఉంటుంది. ముస్లిమేతర సోదరులు ఒకవేళ ఈ అనువాదంలోని కఠిన పదాలను అర్థం చేసుకోలేకపోయినట్లయితే వారు "మధుర్ సందేశ్ సంఘం, ఇ-20, అబుల్ ఫజల్ ఎన్‌క్లేవ్, జామియా నగర్, న్యూఢిల్లీ-25" వారి ద్వారా ప్రచురింపబడిన మౌలానా ఫారూఖ్ ఖాన్ గారి అనువాదాన్ని కూడా ఆధారంగా తీసుకోగలరు.

**ఖుర్ఆన్ 'బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం'తో ప్రారంభమవుతుంది. దీని అర్థం 'అనంత కరుణామయుడు, పరమ దయాళువు అయిన అల్లాహ్ పేరుతో.'**

ఆలోచించండి, అల్లాహ్ అనంత కరుణామయుడు, పరమ దయాళువు అయినప్పుడు ఆయన ఎవరికైనా కష్టం కలిగించే, హింస, ఉగ్రవాదాన్ని వ్యాపింపజేసే ఆదేశాలను ఇవ్వగలడా? అల్లాహ్ కారుణ్యం, దయాశీలత దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) జీవితంలో కనపడుతుంది. ఖుర్ఆన్ వచనాలు, ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర ద్వారా తెలిసేదేమిటంటే, ఏ అవిశ్వాసులతోనైతే పోరాడమంటూ ముస్లిములకు ఆదేశాలివ్వడం జరిగిందో వారు దౌర్జన్యపరులు, అత్యాచారులు. ఆ పోరాటం కూడా ఆత్మరక్షణ కోసమైనదిగానే ఉండింది. ఖుర్ఆన్‌లోని అల్లాహ్ ఆదేశాలను ఒకసారి చూద్దాం.

"(ఓ ముహమ్మద్ (సఅసం) ఆ సమయం కూడా జ్ఞాపకం తెచ్చుకోతగ్గదే; అప్పుడు సత్య తిరస్కారులు నీకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ ఉన్నారు, నిన్ను నిర్బంధించాలని లేదా నిన్ను హత్య చేయాలని లేదా నిన్ను దేశం నుండి బహిష్కరించాలని వారు తమ ఎత్తులు తాము వేస్తున్నారు. (అటు వైపు) అల్లాహ్ తన ఎత్తు తానూ వేస్తున్నాడు. అల్లాహ్ అందరికంటే బాగా ఎత్తులు వేస్తాడు." *(ఖుర్ఆన్- 8వ అధ్యాయం : 30వ వచనం)*

"వారు అన్యాయంగా తమ ఇళ్ల నుండి తరిమివేయబడినవారు (వారు ఏ నేరమూ చేయలేదు). వారి తప్పు కేవలం "అల్లాహ్ మా ప్రభువు" అని అనటమే. అల్లాహ్ గనక ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే ఆశ్రమాలు, (క్రైస్తవుల) చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు, (ముస్లిముల) మసీదులు - వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడుతుందో- అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. అల్లాహ్ తనకు సహాయం చేసే వారికి తప్పకుండా సహాయపడతాడు. అల్లాహ్ మహాశక్తిమంతుడు, మహా బలవంతుడూను." *(ఖుర్ఆన్- 22వ అధ్యాయం 40వ వచనం)*

ప్రవక్తయే స్వయంగా ఈ గ్రంథాన్ని కల్పించాడని వారు అంటున్నారా? ఇలా అను: "సరే విషయం గనక ఇదే అయితే ఇటువంటి కల్పించబడిన పది సూరాలను మీరు రచించి తీసుకురండి. అల్లాహ్ తప్ప ఎవరినైనా సరే సహాయం కొరకు పిలువగలిగితే పిలుచుకోండి."

*(ఖుర్ఆన్ : 11వ అధ్యాయం, 13వ వచనం)*

"ప్రవక్తా! ప్రపంచ దేశాలలో ఉన్నటువంటి అవిశ్వాసులు దర్జాగా తిరుగాడటం నిన్ను మోసంలో పడవేయరాదు" (ఖుర్ఆన్ 3వ అధ్యాయం, 196వ వచనం)

"ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది; ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయిన వారు. నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు."

*(ఖుర్ఆన్- 22వ అధ్యాయం, 39వ వచనం)*

"మీకు వారు (అంటే అవిశ్వాసులైన ఖురైషులు) ఎక్కడ ఎదురైనా, మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడ నుండి (మక్కా నుండి)

పారద్రోలారో, అక్కడి నుండి మీరూ వారిని పారద్రోలండి.

*(ఖుర్ఆన్- 2వ అధ్యాయం, 191వ వచనం)*

"అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో పోరాడే వారికీ, ధరణిలో కల్లోలాన్ని సృష్టిస్తూ తిరిగే వారికి శిక్ష ఏమిటంటే, వారిని చంపటం లేదా శిలువపైకి ఎక్కించటం లేదా చేతులను కాళ్లను అభిముఖ దిశలో ఖండించటం లేదా దేశం నుండి బహిష్కరించటం. ఇవి వారికి ఇహలోకంలో జరిగే అగౌరవం, అవమానం. పరలోకంలో వారికి అంతకంటే ఘోరమైన శిక్ష ఉంటుంది. మీరు వారిని స్వాధీనపరచుకోకముందు పశ్చాత్తాపపడే వారికి తప్ప, అల్లాహ్ క్షమించే వాడు, కరణించేవాడు అనే విషయం మీరు తెలుసుకోవాలి.

*(ఖుర్ఆన్- 5వ అధ్యాయం, 33, 34వ వచనాలు)*

**ఖుర్ఆన్‌లోని అల్లాహ్ ఆదేశాల కారణంగానే ముస్లింలు, ముస్లిమేతరుల జీవితాలను దుర్భరం చేస్తున్నారంటూ అసత్య ప్రచారం జరుగుతూ ఉంది. కాని వారు అవిశ్వాసులు, మిథ్యా దైవారాధకులే కాదు, చివరకు శత్రువులైనా సరే ఖుర్ఆన్‌లో ఎక్కడ కూడా నిర్దోషులపై యుద్ధం చేయటానికి అనుమతి ఇవ్వబడలేదు.**

"ఎవరైతే ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి వెళ్ళగొట్టలేదో, వారిపట్లమీరు మంచితనంతో, న్యాయంతో వ్యవహ రించటాన్ని అల్లాహ్ నిరోధించడు-అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు."

*(ఖుర్ఆన్ : 60వ అధ్యాయం, 8వ వచనం)*

"ఎవరు మీతో ధర్మం విషయంలో యుద్ధం చేశారో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి బహిష్కరించారో, మిమ్మల్ని బహిష్కరించటంలో పరస్పరం సహకరించు కున్నారో, వారితో మీరు స్నేహం చేయటాన్ని మాత్రం అల్లాహ్ వారిస్తున్నాడు. అటువంటి వారితో స్నేహం చేసే వారే దుర్మార్గులు."

*(ఖుర్ఆన్- 60వ అధ్యాయం, 9వ వచనం)*

**ఇస్లాంలో శత్రువుల పట్ల సయితం అతిగా ప్రవర్తించటం వారించబడింది. ఈ ఆదేశాన్ని చూడండి.**

"మీతో పోరాడే వారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి (అత్యాచారం చేయకండి). అతిక్రమించేవారిని అల్లాహ్ ప్రేమించడు." *(ఖుర్ఆన్- 2వ అధ్యాయం, 190వ వచనం)*

"ఇవి అల్లాహ్ సూక్తులు. వాటిని మేము మీకు యథాతథంగా వినిపిస్తున్నాము. ఎందుకంటే ప్రపంచ ప్రజలకు అన్యాయం చేయాలనే ఉద్దేశ్యం అల్లాహ్‌కు ఏ మాత్రం లేదు." *(ఖుర్ఆన్- 3వ అధ్యాయం, 108వ వచనం)*

**ప్రపంచంలో శాంతిని స్థాపించటం ఇస్లాం ముఖ్యోద్దేశం. పోరాటమైతే చివరి అంశం. ఆదర్శ ధర్మం కూడా ఇదే. ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తిలో కూడా అదే ద్యోతకమవుతూ ఉంది.**

"ప్రవక్తా! ఈ అవిశ్వాసులకు ఇలా చెప్పు: ఇప్పుడైనా మానుకుంటే, గతంలో జరిగినదంతా మన్నించడం జరుగుతుంది. కాని వారు పూర్వ వైఖరినే మళ్ళీ అవలంబిస్తే పూర్వపు జాతులకు ఏమి జరిగిందో, అది అందరికీ తెలుసు (వారి పట్ల కూడా అలాగే జరుగుతుంది)."

*(ఖుర్ఆన్- 8వ అధ్యాయం, 38వ వచనం)*

**ఇస్లాంలో శత్రువుల పట్ల కూడా సరైన న్యాయం చేయాలని అదేశింపబడి న్యాయపు మహోన్నత ఆదర్శాన్ని ప్రదర్శించబడింది. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తిని కాస్త చూడండి.**

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు."

*(ఖుర్ఆన్- 5వ అధ్యాయం, 8వ వచనం)*

**ఇస్లాంలో నిరపరాధిని హత్య చేసే అనుమతి ఎంతమాత్రం లేదు. అలా చేసేవారికి శిక్ష రక్తానికి బదులు రక్తం. కాని హంతకుడిని మాత్రమే అలా శిక్షించాలి. ఇందులో అతి కూడదు. ఇదే సరైన న్యాయం అనబడుతుంది. ఈ క్రింద కనబరచిన అల్లాహ్ ఆదేశం చూడండి:**

"ఏ ప్రాణాన్నీ హతమార్చకండి, న్యాయంగా తప్ప (ధర్మశాస్త్రంలోని ఆదేశం ప్రకారం). దానిని హతమార్చడాన్ని అల్లాహ్ నిషేధించాడు. అన్యాయంగా హత్య చేయబడిన మనిషి వారసునికి మేము 'ఖిసాస్'ను కోరే హక్కును

ప్రసాదించాము, (హంతకునిపై బదులు తీర్చుకోవడం). కాని ఆ వారసుడు హత్యలో హద్దులు మీరకుండా ఉండాలి (పరివారంలో)."

*(ఖుర్ఆన్- 17వ అధ్యాయం, 33వ వచనం)*

**ఇస్లాం దేశంలో హింస (కల్లోలం)ను అనుమతించదు. ఈ ఆదేశాన్ని చూడండి:**

"ప్రజలకు వారి వస్తువులను తక్కువ చేసి ఇవ్వకండి. భూమిపై కల్లోలాన్ని వ్యాపింపజేస్తూ తిరగకండి." *(ఖుర్ఆన్- 26వ అధ్యాయం, 183వ వచనం)*

**దౌర్జన్యపరులకు అల్లాహ్ హెచ్చరిక :**

"అల్లాహ్ ఆదేశాలనూ, బోధనలనూ శిరసావహించటానికి తిరస్కరించే వారికీ, ఆయన ప్రవక్తలను అన్యాయంగా చంపే వారికీ, సత్యాన్నీ న్యాయాన్నీ శాసించ టానికి ప్రజలలో నుండి లేచే వారి ప్రాణాల వెంట పడేవారికీ బాధాకరమైన శిక్షను గురించిన శుభవార్తను వినిపించు."

*(ఖుర్ఆన్- 3వ అధ్యాయం, 21వ వచనం)*

**సత్యధర్మం కోసం శ్రమించేవారూ, పోరాడి అసువులు బాసేవారు, దైవకృపకు పాత్రులవుతారు, ఆయనకు ప్రియులవుతారు :**

"సమాధానంగా వారి ప్రభువు ఇలా అన్నాడు: మీలోని ఎవరి శ్రమనూ నేను వృధా పోనివ్వను. పురుషుడైనా, స్త్రీ అయినా మీరంతా ఒకే రాశికి చెందినవారు. కనుక నా కొరకు తమ దేశాన్ని విడిచిపెట్టిన వారు, నా మార్గంలో తమ గృహాల నుండి గెంటివేయబడినవారు, హింసింపబడినవారు, నా కొరకు పోరాడి చంపబడినవారు - అటువంటి వారి తప్పులన్నీ నేను క్షమిస్తాను. క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాను." ఇది అల్లాహ్ వద్ద వారికి లభించే ప్రతిఫలం -ఉత్తమమైన ప్రతిఫలం అల్లాహ్ వద్దనే ఉంది. *(ఖుర్ఆన్- 3వ అధ్యాయం, 195వ వచనం)*

**ఇస్లాంను అప్రతిష్టపాలు చేయటానికి అది కరవాల బలంతో, ప్రచార ప్రసార బలంతో వ్యాపించిన మతమని రాతలు వ్రాశారు, ప్రచారం చేశారు. మక్కాతోపాటు యావత్తు అరేబియానే కాకుండా ప్రపంచంలోని ముస్లింలందరూ, కరవాల బలంతోనే ముస్లిములయ్యారా? ఇస్లాం ప్రచార బలంతో దౌర్జన్యంతో జరిగిందా? వాస్తవానికి ఎవరినైనా బలవంతంగా ముస్లింలుగా చేయటం ఇస్లాంలో నిషిద్ధం. ఖుర్ఆన్‌లోని**

**ఈ అల్లాహ్ ఆదేశాలు చూడండి :**

"నీ ప్రభువు అభీష్టం గనక ఇదే అయితే (అంటే భూమిపై ఉండే వారంతా, విశ్వాసులూ, విధేయులూ అవ్వాలి అనేది) సమస్త భూవాసులూ విశ్వసించి ఉండేవారే. అలాంటప్పుడు నీవు ప్రజలను విశ్వాసులుగా (ముస్లింలుగా) మారండి అని బలవంతం చేస్తావా?"

*(ఖుర్ఆన్- 10వ అధ్యాయం, 99వ వచనం)*

"(ఓ ప్రవక్తా! ఈ ఇస్లాం తిరస్కారులతో) ఇలా ప్రకటించు, ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించే వాటిని (విగ్రహాలను) నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. (నేను మళ్లీ చెబుతున్నాను) మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు (అనిపిస్తోంది). మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే." *(ఖుర్ఆన్- 109వ అధ్యాయం, 1-6వ వచనాలు)*

"ప్రవక్తా! ఇక వీరు నీతో ఘర్షణకు తలపడితే, ఇలా చెప్పు : "నేనూ నా అనుచరులూ అల్లాహ్‌కు పరిపూర్ణంగా విధేయులమయ్యాము." గ్రంథం కలవారినీ, గ్రంథంలేనివారినీ ఉభయులనూ ఇలా అడుగు: "మీరు కూడా ఆయన (అల్లాహ్) పట్ల విధేయతకూ, దాస్యానికీ అంగీకరించారా? అలా చేస్తే (ఇస్లాం స్వీకరిస్తే) వారు సరిఅయిన మార్గాన్ని పొందినట్లే. కాని ఒకవేళ దానికి విముఖులైతే, నీ బాధ్యత కేవలం సందేశాన్ని అందజేయడమే. తరువాత అల్లాహ్ తన దాసుల విషయాలను తానే స్వయంగా చూసుకుంటాడు."

*(ఖుర్ఆన్- 3వ అధ్యాయం, 20వ వచనం)*

"ప్రవక్తా! ఇలా చెప్పు: గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చేయరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది." ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు (ఈ మాటకు) వైముఖ్యం కనపరిస్తే వారితో స్పష్టంగా ఇలా అను: "మేము ముస్లిములము (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారు, విధేయత చూపేవారు) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి." *(ఖుర్ఆన్- 3వ అధ్యాయం, 64వ వచనం)*

ఇస్లాంలో బలవంత మత మార్పిడి నిషిద్ధంతోపాటు ఇంకా ఎలాంటి ఇతరత్రా నిర్బంధానికీ, బలాత్కారానికీ అనుమతి లేదు. ఈ దైవాదేశాన్ని చూడండి.

"(ఇస్లాం) ధర్మం విషయంలో నిర్బంధం కానీ, బలాత్కారం కానీ లేవు."
*(ఖుర్ఆన్- 2వ అధ్యాయం, 256వ వచనం)*

**ఎవడైతే పాపకార్యాలు చేస్తాడో, అసత్య నీతిని అవలంబిస్తాడో వాడు తన మరణానంతర జీవితంలో దాని ఫలితాన్ని అనుభవిస్తాడు.**

"పాపం సంపాదించి (అన్ని వైపుల నుండి) పాపజాలంలోనే ఇరుక్కోపోయేవారు నరకవాసులు. వారు నరంకలోనే శాశ్వతంగా ఉంటారు."
*(ఖుర్ఆన్- 2వ అధ్యాయం, 81వ వచనం)*

**దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర, ఖుర్ఆన్‌లోని వచనాలను చూసిన తరువాత హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి సాంప్రదాయం, ఖుర్ఆన్ కథనంలో ఉగ్రవాదం అనేది ఎక్కడా కానరాదు.**

**దీంతో ఇస్లాం పట్ల అరకొర పరిజ్ఞానం కలవాళ్ళే అజ్ఞానం కారణంగా ఇస్లాంను ఉగ్రవాదంతో ముడిపెడుతున్నారు.**

## ఖుర్ఆన్‌లోని ఆ 24 వచనాలు

ఖుర్ఆన్‌లోని 24 వచనాల ఒక కరపత్రాన్ని ఎంతో కాలంగా కొందరు దేశ ప్రజల్లో పంచుతున్నారు. ఈ కరపత్రం దాదాపు అన్ని ప్రాంతీయ భాషల్లో ముద్రించ బడింది. ఈ కరపత్రం శీర్షిక "అన్య ధర్మావలంబీకులతో పోరాడమంటూ ముస్లింలను ఆదేశిస్తున్న ఖుర్ఆన్‌లోని కొన్ని వచనాలు" అని ఉంది. ఈ పుస్తక ప్రారంభంలో "నాకు సత్యజ్ఞానం కలిగిన వేళ" అనే శీర్షికలో ఈ కరపత్రాన్ని చూసిన తరువాతే నేను భ్రమలో పడిపోయానని వ్రాశాను. ఈ కరపత్రంలో ముద్రించిన విషయం ఉన్నది ఉన్నట్టుగా ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

**"అన్య ధర్మావలంబీకులతో పోరాడమంటూ ముస్లింలను ఆదేశిస్తున్న ఖుర్ఆన్‌లోని కొన్ని వచనాలు"**

1. నిషిద్ధ మాసాలు తొలగిపోయిన తరువాత 'బహుదైవారాధకులను' కనబడిన చోటల్లా చంపి వేయండి, వారిని పట్టుకోండి, చుట్టుముట్టండి, ప్రతి చోట

వారి కోసం పొంచి ఉండండి. ఒకవేళ వారు పశ్చాత్తాప పడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ చెల్లిస్తే వారిని వదలిపెట్టండి. నిస్సందేహంగా అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, పరమ దయాళువు. (10, 9, 5)

2. ఓ విశ్వాసులారా! బహుదైవారాధకులు (విగ్రహారాధకులు) అపవిత్రులు. (10,9, 28)

3. నిస్సందేహంగా 'అవిశ్వాసులు' మీ బహిరంగ శత్రువులు. (5,4,101)

4. "ఓ విశ్వసించిన ప్రజలారా! (ముస్లిములారా!) మీ చుట్టుప్రక్కల ఉన్న ఆ అవిశ్వాసులతో పోరాడండి. వారు మీలో కాఠిన్యాన్ని చూడాలి. (11, 9, 123)

5. ఎవరైతే మా వచనాలను తిరస్కరించారో, వారిని అతి త్వరలోనే అగ్నిలోనికి విసిరేస్తాము. వారి చర్మం మాడిపోతే దాన్ని మరో చర్మంగా మార్చివేస్తాము. వారు యాతనలను చవిచూడాలని. నిస్సందేహంగా అల్లాహ్. (ప్రభుత్వశాలి, తత్వదర్శి). (5,4,56)

6. ఓ విశ్వసించిన ప్రజలారా! (ముస్లింలారా!) మీ తండ్రులను గాని, మీ సోదరులనుగానీ, వారు విశ్వాసం కంటే అవిశ్వాసానికి మక్కువ చూపితే వారిని మీ మిత్రులుగా చేసుకోకండి. ఇంకా మీలో వారితో స్నేహబంధం ఏర్పరుచుకున్నవారే దౌర్జన్యపరులు. (10,9,23)

7. 'అల్లాహ్' అవిశ్వాసులకు మార్గం చూపడు. (10,9,37)

8. 'విశ్వసించిన వారలారా!..... అవిశ్వాసులను మీ మిత్రులుగా చేసుకోకండి. మీరు విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి." (6,5,57)

9. ఛీత్కరింపబడిన (ముస్లిమేతరులు) ఎక్కడైనా కనబడితే పట్టుబడితే, వారు దారుణంగా హతమార్చబడాలి. (22, 33, 61)

10. "(ఇలా అనండి) నిశ్చయంగా మీరు, ఇంకా మీరు అల్లాహ్‌కు సమానంగా నిలబెట్టి పూజించేవారు నరకాగ్నికి ఇంధనమవుతారు. మీరు తప్పకుండా ఆ అగాధంలో పడిపోతారు." (17, 21, 98)

11. తన ప్రభువు వచనాలను తిరస్కరించేవాడు, వాటి పట్ల ముఖం తిప్పుకునేవాడి

కంటే పరమ దుర్మార్గుడెవడై ఉంటాడు, ఇలాంటి అపరాధులతో మేము తప్పకుండా బదులు తీర్చుకుంటాము. (21, 32, 22)

12. "మీరు చేజిక్కించుకుబోయే ఎన్నో వరాలను గూర్చి అల్లాహ్ మీతో వాగ్దానం చేశాడు." (26, 48, 20)

13. "మీరు స్వాధీనం చేసుకున్న సమర సొత్తును ధర్మబద్ధమైనదిగా, స్వచ్ఛమైనదిగా భావించి తినండి." (10, 8, 69)

14. ఓ ప్రవక్తా! తిరస్కారులు, కపటులతో పవిత్ర యుద్ధం చెయ్యి, వారితో కటువుగా వ్యవహరించు, నరకమే వారి నివాసం, అది బహు చెడ్డ స్థలం. (28, 66, 9)

15. అవిశ్వాసులకు మేము తప్పకుండా యాతనల రుచిని చూపిస్తాము, ఇంకా వారు చేస్తూ ఉండిన కర్మలకు నిశ్చయంగా వారికి అన్నిటికంటే చెడ్డగా ప్రతీకారం తీర్చుకుంటాము. (24, 41, 27)

16. ఇది (నరకాగ్ని) అల్లాహ్ శత్రువుల పట్ల ప్రతీకారం. ఇందులోనే వారి శాశ్వత నివాసం. మా వచనాలను తిరస్కరించినందుకు ఫలితంగా. (24, 41, 28)

17. నిస్సందేహంగా అల్లాహ్ విశ్వాసుల (ముస్లింల) ధన, ప్రాణాలను స్వర్గానికి బదులుగా కొన్నాడు. వారు అల్లాహ్ మార్గంలో సలిపే సమరంలో (శత్రువులను) చంపుతారు, చస్తారు కూడా. (11, 9, 111)

18. అల్లాహ్ కపట (అర్ధ ముస్లిం) పురుషులనూ, కపట స్త్రీలు, అవిశ్వాసులతో నరకాగ్ని వాగ్దానం చేశాడు. వారు సదా అందులోనే ఉంటారు. వారికి ఇది చాలు. వారిని అల్లాహ్ శపించాడు. ఇంకా వారి కోసం ఘోర యాతనలున్నాయి. (10, 9, 68)

19. ప్రవక్తా! విశ్వాసులను (ముస్లింలను) యుద్ధానికి పురిగొల్పు, ఒకవేళ మీలో 20 మంది స్థిరంగా నిలబడేవాళ్లు ఉంటే వారికి 200 (శత్రువులపై) ఆధిక్యం ప్రాప్తమవుతుంది. ఒకవేళ మీరు 100 మంది ఉంటే 1000 మంది అవిశ్వాసులపై ఆధిక్యం వహిస్తారు, ఎందుకంటే వారు తెలివితేటలు కలవారు కాదు. (10, 8, 65)

20. విశ్వసించినవారలారా! (ముస్లింలారా!) మీరు యూదులను, క్రైస్తవులను

మిత్రులుగా చేసుకోకండి. వారు పరస్పరం మిత్రులు. మీలో ఎవరైతే వారిని మిత్రులుగా చేసుకుంటాడో, వాడు వారిలోని వాడుగానే ఉండిపోతాడు. నిస్సందేహంగా అల్లాహ్ దౌర్జన్యపరులకు మార్గం చూపదు. (6, 5, 51)

21. అల్లాహ్‌పై, అంతిమ దినంపై విశ్వసించని, అల్లాహ్, ఆయన సందేశహరుడు నిషేధించిన వాటికి దూరంగా ఉండని, సత్య ధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోని గ్రంథ ప్రజలతో వారు అప్రతిష్ఠ (అవమానాలపాలు) పాలై జిజియా చెల్లించేవారుగా అయ్యే వరకూ పోరాడండి. (10, 9, 29)

22. .... తిరిగి మేము ప్రళయ దినం వరకు వారి మధ్య వైమనస్యం, విద్వేషాల అగ్నిని ప్రజ్వలింపజేశాము. త్వరలోనే అల్లాహ్ వారు చేస్తూ ఉన్నదేమిటో వారికి తెలుపుతాడు. (6,5,14)

23. వారు ఏ విధంగా అవిశ్వాసులైపోయారో మీరు కూడా అదే విధంగా అవిశ్వాసులై పోవాలని వారు కోరుకుంటున్నారు. ఇంకా మీరంతా ఏకమై పోండి. అల్లాహ్ మార్గంలో 'జిహాద్' (ధర్మయుద్ధం) చేయనంత వరకూ వారిలో ఎవ్వరినీ మీ మిత్రులుగా చేసుకోకండి. ఒకవేళ వారు దీని నుండి తిరిగిపోతే వారిని ఎక్కడ దొరికితే అక్కడ పట్టుకుని చంపివేయండి. వారిలో నుండి ఎవరినీ మిత్రులు, సహాయకులుగా చేసుకోకండి. (5,4,89)

24. వారితో (అవిశ్వాసులతో) పోరాడండి. అల్లాహ్ మీ చేతుల మీదుగా వారికి యాతనలు కలుగజేస్తాడు. వారిని అవమానాలపాలు చేస్తాడు, వారికి ప్రతిగా మీకు సహాయం చేస్తాడు, ఇంకా విశ్వాసుల హృదయాలకు స్వాంతన చేకూరుస్తాడు. (10, 9, 14)

పై వచనాలలో ఈర్ష్య, ద్వేషం, తిరస్కారం, కాపట్యం, పోరాటాలు, దోపిళు ళ్ళ, హత్యలు చేయమనే స్పష్టమైన ఆదేశాలు కనబడుతున్నాయి. దేశ విదేశాల్లో ముస్లిం, ముస్లిమేతరుల మధ్య పోరాటాలు ఈ కారణాల మూలంగానే జరుగుతున్నాయి.

**పై కరపత్రాన్ని ముద్రించారనే ఆరోపణతో ఢిల్లీ ప్రభుత్వం సర్వశ్రీ ఇంద్రసేన్ శర్మ, రాజ్‌కుమార్ ఆర్యలపై 1985వ సంవత్సరంలో ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో వ్యాజ్యం నమోదు చేసింది. 1986వ సంవత్సరం జులై 31వ తేదీన ఆ న్యాయస్థానం......**

**"పవిత్ర ఖుర్ఆన్ గ్రంథం పట్ల గౌరవభావంతో పైన ఉదాహరించిన వచనాలను సూక్ష్మదృష్టితో అధ్యయనం ద్వారా ఈ వచనాలు చాలా హానికరంగా ఉన్నాయనీ, ఇంకా ఇవి ద్వేషాన్ని బోధిస్తున్నాయనీ, వీటివల్ల ముస్లింలూ, దేశంలోని ఇతర వర్గాలలో భేదభావాలకు బలం చేకూరే అవకాశం ఉందనీ స్పష్టమవుతూ ఉంది" అంటూ తీర్పు చెబుతూ ఆ ఇద్దరు మహానుభావులను విడుదల చేసింది.**

**హిందూ రైటర్స్ ఫోరం, న్యూ ఢిల్లీ -27 ద్వారా పునర్ముద్రితమైన ప్రచురణ.**

అంతకంటే ముందు పైన కనబరచిన ఈ కరపత్రం వాల్‌పోస్టర్ రూపంలో ముద్రించబడింది. దీన్ని శ్రీ ఇంద్రసేన్ శర్మ (హిందూ మహాసభ తాత్కాలిక ఉపాధ్యక్షుడు, ఢిల్లీ), శ్రీ రాజ్‌కుమార్ ఆర్య ముద్రించారు. ఈ పోస్టర్‌లోని ఖుర్ఆన్ వచనాలు ముహమ్మద్ ఫారూఖ్ ఖాన్‌చే హిందీలో అనువదించబడి 1966లో రాంపూర్‌లోని 'అల్ హసనాత్ బుక్‌డిపో' వారిచే ప్రచురించబడిన ఖుర్ఆన్ నుండి సేకరించబడ్డాయి. ఈ పోస్టర్‌ను ప్రచురించినందుకు ఆ ఇద్దరిపై భారత శిక్షాస్మృతి 153 ఎ, 165ఎ అధికరణల క్రింద నేరం నమోదు చేయబడింది. (ఎఫ్ఐఆర్ 237/83, సెక్షన్ 235 ఎ క్రింద హౌజ్ ఖాజీ పోలీస్ స్టేషన్, కొత్త ఢిల్లీ)పై తీర్పు ఇచ్చింది ఈ కేసులోనే.

ఈ కరపత్రంలోని ఆ వచనాలు నిజంగానే విభిన్న వర్గాల మధ్య ద్వేషాన్ని వ్యాపింపజేసి కలహాలు జరిపించేవిలా ఉన్నాయా? ఒకసారి చూద్దాం.

## ఆ కరపత్రంలో వ్రాయబడిన క్రమంలో మొదటి వచనం ఇలా ఉంది

> "కనుక నిషిద్ధ మాసాలు గడిచిపోయిన తరువాత ముష్రిక్కులను చంపండి. ఎక్కడ కనిపిస్తే అక్కడ, ఇంకా వారిని పట్టుకోండి, చుట్టుముట్టండి, ప్రతి మాటు వద్ద వారి కొరకు పొంచి కూర్చోండి. తరువాత ఒకవేళ వారు పశ్చాత్తాపపడితే, నమాజు స్థాపిస్తే, జకాత్ ఇస్తే వారిని విడిచిపెట్టండి. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించేవాడూను. *(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 5వ వచనం)*

ఈ వచనం సందర్భంలో హజ్రత్ ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర ద్వారా స్పష్టమవుతున్నదేమిటంటే, మక్కాలోనూ, మదీనా వెళ్ళిన తరువాత కూడా అవిశ్వాసులు, తిరస్కారులైన ఖురైషులు దైవసందేశహరులు (సఅసం)ను

వెంటాడుతూనే ఉన్నారు. వారు ముహమ్మద్ (సఅసం)ను, సత్య ధర్మమైన ఇస్లాంనూ అంతం చేయటానికై విశ్వ ప్రయత్నాలు చేస్తూ ఉండేవారు. ఖురైష్ అవిశ్వాసులు దైవ సందేశహరులు (సఅసం)ను ఎక్కడా ప్రశాంతంగా కూర్చోనివ్వలేదు. వారు ఆయన్ని సతతం వేధిస్తూ ఉండేవారు. ఇందుకోసం ఆయనపై పోరాడటానికి నిత్యం కుట్రలు పన్నుతూ ఉండేవారు.

మదీనాకు వలసపోయిన ఆరవ ఏట జీఖాద మాసంలో దైవ సందేశహరులు (సఅసం) వందల సంఖ్యలో ముస్లింల వెంట హజ్ కోసం మదీనా నుండి మక్కాకు బయలుదేరారు. ఈ విషయాన్ని కపటులు (పైకి ముస్లింలుగా నటిస్తున్నవారు) ఖురైషులకు చేరవేశారు. ఖురైషులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను చుట్టుముట్టే ఎలాంటి అవకాశాన్నీ చేజారనిచ్చేవారు కాదు ఈసారి కూడా వారు ఆ మార్గంలో మాటువేసి కూర్చున్నారు. ముహమ్మద్ (సఅసం)కు ఈ వార్త తెలిసిపోయింది. తమ దారిని మార్చి మక్కా సమీపంలోని హుదైబియా పేరుగల బావి వద్ద మకాం వేశారు. ఆ బావి పేరుతోనే ఆ స్థలం వ్యవహరించబడింది.

ముహమ్మద్ (సఅసం) తమ అనుయాయులైన ముస్లింలతో మక్కా సమీపంలోని హుదైబియా బావి వద్ద మకాం వేశారనే విషయం ఖురైషులకు తెలిసిపోగానే అవిశ్వాసులు ఆయన (సఅసం)ను హత్య చేయటానికి కొంతమందిని అక్కడికి పంపారు. కాని దాడికి ముందే ముస్లింలు వారిని పట్టుకుని దైవప్రవక్త (సఅసం) సమక్షానికి తెచ్చారు. అయితే ఆయన (సఅసం) వారి అపరాధాన్ని మన్నించి వారిని క్షమించివేశారు.

దీని తరువాత ఎలాంటి కొట్లాటలూ, పోట్లాటలూ, రక్తపాతాలూ జరుగకుండా ఉండటానికై ఖురైషులతో సంప్రతింపులు జరుపటానికై హజ్రత్ ఉస్మాన్ (రజి)ను పంపారు. ఖురైషులు హజ్రత్ ఉస్మాన్ (రజి)ను బంధించారు. ఇక్కడ హుదైబియాలో బస చేసి ఉన్న దైవసందేశహరులకు, ఉస్మాన్ (రజి) హత్య చేయబడ్డారనే వార్త అందింది. ఇది వింటూనే ముస్లింలు హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవటానికి ఉద్యుక్తులయ్యారు.

ఇప్పుడు ముస్లింలు చంపటానికైనా, చావటానికైనా సిద్ధపడ్డారనీ ఇక యుద్ధం జరగడం ఖాయమని తెలుసుకున్న ఖురైషులు సుహైల్ బిన్ అమ్రను హజ్రత్ ముహమ్మద్ (సఅసం) తో సంప్రతింపుల కోసం హుదైబియాకు పంపారు. నిజానికి

ఉస్మాన్ (రజి) హత్య కాబడలేదనీ, ఆయన ఖురైషుల వద్ద బందీగా ఉన్నారని సుహైల్ ద్వారా తెలిసింది. ఉస్మాన్ (రజి)ను ఖైదు నుండి విడుదల చేయటానికి, యుద్ధాన్ని నివారించటానికీ సుహైల్ కొన్ని షరతులు పెట్టాడు.

**మొదటి షరతు:** ఈ సంవత్సరం మీరంతా 'ఉమరా' (కాబా దర్శనం) చేసుకోకుండా వెనుతిరిగి వెళ్ళిపోవాలి. మరుసటి సంవత్సరం రావాలి, కాని మూడు రోజుల తరువాత వెళ్ళిపోవాలి.

**రెండవ షరతు:** ఒకవేళ మా ఖురైషుల వ్యక్తి ఎవరైనా ముస్లింగా మారిపోయి మదీనాకు వస్తే అతణ్ణి మాకు వాపసు పంపాలి. కాని ఒకవేళ ఎవరైనా ముస్లిం మదీనా వదలి మక్కాకు వస్తే అతణ్ణి మేము వాపసు పంపము.

**మూడవ షరతు :** ఏ తెగ అయినా తమ ఇష్టపూర్వకంగా ఖురైషుల వెంటగాని, ముస్లింలతోగాని కలిసిపోవచ్చు.

**ఒప్పందంలో నాలుగవ షరతు :** ఈ షరతులను అంగీకరించిన తరువాత ఖురైషులు, ముస్లింలు ఒకరిపై మరొకరు పరస్పర దాడులు జరుపుకోరాదు, ఒకరి మిత్ర తెగలపై మరొకరు దాడులు జరుపకూడదు. ఈ ఒప్పందం పదేళ్ళు అమలులో ఉంటుంది.

నిజానికి ఈ షరతులు ఏక పక్షంగా, పూర్తి అన్యాయంతో కూడుకున్నవిగా ఉన్నాయి. అయినప్పటికీ శాంతి స్థాపన కోసం, శాంతి సహనాల ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వాటిని అంగీకరించారు.

కాని ఒప్పందం జరిగిన రెండేళ్ళ తరువాత బనూ బక్ర్ అనే ఖురైషుల మిత్ర తెగ, ముస్లింల మిత్ర తెగ అయిన 'ఖుజాఅ'పై దాడి చేసింది. ఈ దాడిలో ఖురైషులు బనూ బక్ర్ తెగకు సహాయంగా నిలిచారు. 'ఖుజాఅ' తెగవారు పారిపోయి ముహమ్మద్ (సఅసం) వద్దకు చేరి ఈ దాడిని గూర్చి చెప్పారు. **ముహమ్మద్ (సఅసం) ఇంతగా తలొగ్గి శాంతి ఒప్పందం చేసుకున్న తరువాత కూడా ఖురైషులు మోసపూరితంగా ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించారు.**

ఇప్పుడు యుద్ధం అవశ్యమైపోయింది. శాంతి స్థాపన కోసం ద్రోహం చేసిన వారిని శిక్షించవలసిన అవసరం ఏర్పడింది. ఈ అవసరం కోసం అల్లాహ్ (ఖుర్ఆన్ లోని) నుండి 9వ అధ్యాయంలోని ఈ వచనాలు అవతరించాయి. ఇవి అవతరించిన

తరువాత ప్రవక్త (సఅసం) ఈ వచనాలను వినిపించటానికి హజ్రత్ అలీ (రజి) గారిని ఖురైషుల వద్దకు పంపించారు. హజ్రత్ అలీ (రజి) ఆ బహుదైవారాధకులతో ముస్లింలకు అల్లాహ్ తరఫు నుండి ఆదేశాలు వచ్చేశాయి అని చెబుతూ వారికి 9వ అధ్యాయంలోని ఈ వచనాలను వినిపించారు.

> "(ఓ ముస్లిములారా! ఇపుడు) "అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరఫు నుండి మీరు ఒడంబడికలు చేసుకున్న ముష్రిక్కుల నుండి మీకు విముక్తి ప్రకటించబడుతోంది. కనుక (అవిశ్వాసులారా మీరు) దేశంలో యథేచ్ఛగా ఇంకా నాలుగు నెలలు తిరగండి. మీరు అల్లాహ్‌ను అశక్తుడుగా చెయ్యలేరని తెలుసుకోండి. అల్లాహ్ సత్య తిరస్కారులను పరాభవంపాలు చేస్తాడు. పెద్ద హజ్ రోజున సమస్త ప్రజలకు అల్లాహ్ తరఫు నుండి చెయ్యబడే బహిరంగ ప్రకటన ఏమిటంటే, అల్లాహ్ ముష్రిక్కులకు ఏ విధంగానూ బాధ్యుడు కాడు. అలాగే ఆయన ప్రవక్త కూడా. ఇప్పుడు మీరు గనక పశ్చాత్తాప పడితే అది మీకే మేలు. ఒకవేళ విముఖులైతే మీరు అల్లాహ్‌ను అశక్తుడుగా చెయ్యలేరు అని బాగా అర్థం చేసుకోండి. తిరస్కరించే వారికి కఠిన శిక్షను గురించిన శుభవార్తను వినిపించు." *(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 1 నుండి 3 వచనాలు)*

అలీ (రజి) బహుదైవారాధకులతో, "ఇది అల్లాహ్ ఆదేశం, ఇప్పుడు ఒడంబడిక రద్దయిపోయింది. ఇది మీ ద్వారానే ఉల్లంఘించబడింది. కాబట్టి ఇక ఈ నాలుగు నిషిద్ధ మాసాలు గడిచిపోయిన తరువాత మీతో యుద్ధమే" అన్నారు.

చేసుకున్న ఒడంబడికను ఉల్లంఘించి ముస్లింలపై నిరంతరంగా అత్యాచారాలకు పాల్పడుతున్న దురాక్రమణదారులైన మక్కా బహుదైవారాధకులకు ప్రతిగా దాడులు చేసి వారిని అణచివేయటం ముస్లింలకు విధిగా మారిపోయింది. అందు కోసమే సర్వోన్నత న్యాయకర్త అయిన అల్లాహ్ అయిదవ వచనంలోని ఈ ఆదేశాన్నిచ్చాడు.

> ఈ అయిదవ వచనం కంటే ముందటి నాలుగవ వచనం ఇలా ఉంది: "ఎందుకంటే వారు (బహుదైవారాధకులు) తమ ఒడంబడికలు నెరవేర్చటంలో మీ పట్ల ఏ లోపమూ చేయలేదు. మీకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయం చేయలేదు. అటువంటి వారితోపాటు మీరు కూడా ఒడంబడికను గడువు

వరకు పాటించండి. ఎందుకంటే, అల్లాహ్ భయభక్తులు కలవారంటేనే ఇష్టపడతాడు." *(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 4వ వచనం)*

ఎవరయితే యుద్ధానికై ప్రేరేపించి, విధిలేని పరిస్థితులను సృష్టించారో అలాంటి బహుదైవారాధకులపై యుద్ధానికై ఈ ప్రకటన వెలువడిందని దీని ద్వారా స్పష్టమవుతూ ఉంది. కాని అలా చేయని వారితో కాదు, ఈ యుద్ధ ప్రకటన కూడా ఆత్మరక్షణ, ధర్మరక్షణ కోసం మాత్రమే చేయబడింది.

అన్యాయపరులు, అత్యాచారుల ద్వారా బలవంతంగా రుద్దబడిన యుద్ధం నుండి ఆత్మరక్షణ కోసం చేసుకునే ఎలాంటి ప్రయత్నాలైనా యుద్ధం కోసం చేసినవి అని అనిపించుకోవు. అత్యాచారులు, అన్యాయపరులతో తమనూ, తమ ధర్మాన్ని రక్షించుకోవటానికై యుద్ధం కోసం సైనికులను సమాయత్తం చేసుకోవటం ధర్మసమ్మతమే.

అత్యాచారులను, అన్యాయపరులను నాశనం చేయటాని కోసమే యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు అర్జునునికి గీతోపదేశం చేసిన విషయం ఆ కరపత్రాన్ని ముద్రించిన వారికి, దానిని పంచిన వారికీ తెలియదా? ఆ ఉపదేశాలు పోట్లాటలూ, పోరాటాలు, ద్వేషాలు వ్యాపింపజేసేవిగా ఉన్నాయా? అలా కానప్పుడు ఖుర్ఆన్ విషయంలో మాత్రం ఇలా ఎందుకు చెప్పబడుతోంది?

పైగా ఈ పూర్తి అధ్యాయం స్వయానా దైవసందేశహరులు (సఅసం) గారి సోదర బంధువులైన ఆనాటి మక్కా అత్యాచారులు, బహుదైవారాధకులకు విరుద్ధంగా అవతరించబడింది. మరైతే దీన్ని ఈ సందర్భంలో హిందువుల కోసం ఎందుకు అన్వయించబడుతూ ఉంది? ఇలా చెయ్యటం హిందువులు, ముస్లిమేతరుల హృదయాల్లో, ముస్లింల పట్ల, ఇస్లాం పట్ల ద్వేషాన్ని రగిల్చి ఇస్లాంను అప్రతిష్టపాలు చేసే ద్వేషపూరిత కుట్ర కాదా?

## కరపత్రంలో వ్రాయబడిన క్రమంలోని రెండవ వచనం

విశ్వసించిన ప్రజలారా! ముష్రిక్కులు (విగ్రహారాధకులు) అపరిశుద్ధులు."
*(ఖుర్ఆన్ - 9వ అధ్యాయం, 28వ వచనం)*

నిరంతరం తగవులు, పోట్లాటలు, అన్యాయం, అత్యాచారాలు చేసేవారు అపవిత్రులు కాక మరేమవుతారు?

## కరపత్రంలో వ్రాయబడిన క్రమంలోని మూడవ వచనం

"నిస్సందేహంగా అవిశ్వాసులు (కాఫిర్‌లు) మీ బహిరంగ శత్రువులు."

*(ఖుర్‌ఆన్- 4వ అధ్యాయం, 101వ వచనం)*

వాస్తవానికి తెలిసి, కావాలని ఈ వచనంలోని ఒక అంశాన్నే ఇవ్వడం జరిగింది. పూర్తి వచనాన్ని కాస్త శ్రద్ధగా చదవండి.

"మీరు ప్రయాణానికి బయలుదేరినప్పుడు నమాజును సంక్షిప్తం చేస్తే అది తప్పుకాదు. (ముఖ్యంగా) అవిశ్వాసులు మిమ్మల్ని వేధిస్తారనే భయం మీకు కలిగినప్పుడు. ఎందుకంటే వారు మీతో బహిరంగ వైరానికి పూనుకున్నారు."

*(ఖుర్‌ఆన్- 4వ అధ్యాయం, 101వ వచనం)*

మక్కా, ఇంకా ఆ పరిసరాల్లోని ముస్లింలకు సదా నష్టం కలిగించాలనుకునే (హజ్రత్ ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్రను చదవండి) అవిశ్వాసులైన శత్రువుల పట్ల జాగృతం చేయడం కోసమే ఈ 101వ వచనంలో. "నిస్సందేహంగా అవిశ్వాసులు (కాఫిర్లు) మీ బహిరంగ శత్రువులు" అని చెప్పడం జరిగింది అని ఈ పూర్తి వచనం ద్వారా స్పష్టమవుతోంది.

ఈ విషయంలో ఇంకా సావధానంగా ఉండటానికై అల్లాహ్ ఇచ్చిన ఆదేశాలు దీని తరువాతి 102వ వచనంలో ఇంతకన్నా స్పష్టంగా ఉన్నాయి.

"ప్రవక్తా! నీవు ముస్లింల మధ్య ఉండి (పోరాటం జరుగుతూ ఉండగా) నమాజ్ చేయించటానికి వారితో నిలబడితే, వారిలోని ఒక వర్గం నీతోపాటు నిలబడాలి. వారు అస్త్రధారులై ఉండాలి. వారు తమ సజ్దాను పూర్తి చేసుకొని వెనక్కు వెళ్లిపోవాలి. అప్పుడు ఇంకా నమాజ్ చేయని రెండో వర్గం వచ్చి నీతోపాటు నమాజ్ చేయాలి. వారు కూడా జాగరూకులై ఉండాలి. తమ ఆయుధాలను ధరించి ఉండాలి. ఎందుకంటే మీరు మీ ఆయుధాల పట్ల, మీ సామనుల పట్ల ఏ కొద్దిపాటి అజాగ్రత్త చూపినా మీపై ఒక్కసారిగా విరుచుకుపడాలని అవిశ్వాసులు కాచుకొని ఉన్నారు."

*(ఖుర్‌ఆన్- 4వ అధ్యాయం, 102వ వచనం)*

పై వచనం, ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర ద్వారా, అవిశ్వాసుల బారి నుండి తమను, తమ ధర్మాన్ని రక్షించుకోవటానికై ఇలా చెయ్యటం ముస్లింలకు

తప్పనిసరి అనే విషయం స్పష్టమవుతూ ఉంది. కరపత్రంలో వ్రాయబడినట్టు పోట్లాడటానికి, ద్వేషాన్ని వ్యాపింపజేయటానికి లేక కాపట్యం కలుగజేసే ఎలాంటి మాటా ఈ వచనంలో లేదు. తెలిసి, కావాలని కాపట్య రీతిలో ఈ వచనంలోని అర్థాన్ని మార్చటం కోసం దానిలోని కేవలం ఒక అంశాన్ని మాత్రమే తీసుకుని మిగతా దాన్ని దాచి ప్రజలను రెచ్చగొట్టి వారిలో ద్వేషాన్ని వ్యాపింపజేసే, కలహాలు రేపే పనైతే ఈ కరపత్రాన్ని మొత్తం దేశంలో పంచిపెట్టే వారిది. ఇలాంటి వారి పట్ల ప్రజలు జాగరూకులై ఉండాలి.

## కరపత్రంలోని క్రమసంఖ్యలో వ్రాయబడిన నాలుగవ వచనం :

> "విశ్వసించిన ప్రజలారా! మీ చెంతనున్న సత్య తిరస్కారులతో పోరాడండి. వారు మీలో కాఠిన్యాన్ని చూడాలి." *(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 123వ వచనం).*

ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర, పైన ఉదాహరించబడిన వచనంతో వారి రక్షణ కోసం, ఇంకా వారి ధర్మరక్షణకై అవిశ్వాసులతో ఇలా చేయడం ముస్లింలకు తప్పనిసరి అనే విషయం స్పష్టమవుతోంది. కాబట్టి ఆత్మరక్షణ కోసమైన ఈ వచనాలు పోరాడటం కోసం అనబడవు.

## కరపత్రంలో వ్రాయబడిన క్రమంలో అయిదవ వచనం :

> "మా ఆయత్‌లను నిరాకరించిన వారిని మేము నిశ్చయంగా అగ్నిలో పడ వేస్తాము. ఇంకా వారి శరీర చర్మం కాలి కరిగిపోయినప్పుడల్లా దాని స్థానంలో మరొక చర్మాన్ని సృష్టిస్తాము. వారు శిక్షను బాగా రుచి చూడాలని. అల్లాహ్ సర్వశక్తిమంతుడు." *(ఖుర్ఆన్- 4వ అధ్యాయం, 56వ వచనం)*

ఇదైతే ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించే వారికి ఇవ్వబడే నరక శిక్ష. అన్ని ధర్మాలలో ఆయా ధర్మాల అనుసారం నడుచుకునే వారికి అనంత స్వర్గ సుఖాలూ, తద్ విరుద్ధంగా నడుచుకునే వారికి భయానక నరక శిక్ష అని ఉండనే ఉంది. మరయితే ఖుర్ఆన్‌లో చెప్పబడిన నరక శిక్షపై మాత్రమే అభ్యంతరం దేనికి? ఈ కరపత్రాన్ని ముద్రించి పంచిపెట్టే వారికి ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారమేముంది? లేక వీరికి నరకంలోని మానవాధికారాల భయం వేధిస్తోందా?

## కరపత్రంలోని క్రమసంఖ్యలో ఆరవ వచనం:

"విశ్వసించిన ప్రజలారా! మీ తల్లిదండ్రులను, మీ సోదరులను కూడా మీ సహచరులుగా చేసుకోకండి. ఒకవేళ వారు విశ్వాసం కంటే అవిశ్వాసానికి ప్రాధాన్యం ఇస్తే. మీలో వారిని సహచరులుగా చేసుకునేవారే దుర్మార్గులు."

*(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 23వ వచనం)*

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఏక దైవ సందేశం ఇస్తున్నప్పుడు ఎవరైనా ఆయన (సఅసం) సందేశంపై ఆ ఏక దైవ సందేశాన్ని స్వీకరించి ముస్లింగా మారిపోయి అతని తల్లిదండ్రి, సోదర సోదరీల వద్దకు పోతే వారు అతణ్ణి ఆ ఏక దైవవాదాన్ని వీడి మళ్ళీ బహుదైవారాధకునిగా చేసేవారు. అందుకని వారి ఏక దైవ వాదాన్ని కాపాడుకోవటానికి అల్లాహ్ ఈ వచనాలను అవతరింపజేశాడు. అంటే, సత్య రక్షణ కోసం వచ్చిన ఈ వచనాలు పోరాడమనేవిగా, ద్వేషాన్ని వ్యాపింపజేసేవిగా ఉన్నాయని ఎలా చెప్పగలం. అలా అనేవాడు అజ్ఞాని.

## కరపత్రంలోని క్రమసంఖ్యలో ఏడవ వచనం

"అల్లాహ్ సత్య తిరస్కారులకు సన్మార్గం చూపడు."

*(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 37వ వచనం)*

ఈ వచనం అర్థాన్ని మార్చడానికి దీనిని కూడా కావాలని పూర్తిగా ఇవ్వలేదు. కాబట్టి దీని నిజమైన ప్రయోజనం అర్థంకాదు. దీన్ని అర్థం చేసుకోవటానికి పూర్తి వచనాన్ని వ్రాస్తున్నాను.

'నసీ' అవిశ్వాసంలో ఒక అదనమైన అవిశ్వాసపు చేష్ట. దాని ద్వారా ఈ అవిశ్వాసులు, మార్గభ్రష్టతకు గురి చేయబడతారు. ఒక సంవత్సరం ఒక మాసాన్ని ధర్మసమ్మతం చేసుకుంటారు, మరొక సంవత్సరం దానినే నిషిద్ధం చేసేస్తారు. అల్లాహ్ నిషిద్ధం చేసిన మాసాల సంఖ్యను పూర్తి చేయాలనీ, అల్లాహ్ నిషిద్ధం చేసిన దానిని ధర్మసమ్మతం చేసుకోవాలని కూడా- వారి దుష్కార్యాలు వారికి మనోహరమైనవిగా చెయ్యబడ్డాయి; అల్లాహ్ సత్య తిరస్కారులకు సన్మార్గం చూపడు." *(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 37వ వచనం)*

శాంతి మాసాలు నాలుగు, అవి: 'జీకాదా, జిల్ హిజ్జా, ముహర్రమ్, రజబ్. ఈ నాలుగు మాసాలలో పోట్లాటలు, పోరాటాలు చెయ్యరు. సత్యతిరస్కారులైన

ఖురైషులు వారి అవసరార్థం ఈ మాసాలలోని ఏదైనా మాసాన్ని తెలిసి కావాలని వాటిని ముందూ వెనక చేసుకుని పోరాటాలు చేయటానికి నియమాలను ఉల్లంఘించేవారు. ఏమీ తెలియని స్థితిలో భ్రమించేవారికి మార్గం చూపించవచ్చు కాని తెలిసి ఉండి కూడా భ్రమించేవారికి దేవుడు కూడా మార్గం చూపడు. ఈ సందర్భంలోనే ఈ వచనం అవతరించింది. పోరాటాలు, పోట్లాటలూ చేయటం, ద్వేషాన్ని వ్యాపింపజేయటంలో ఈ వచనానికి ఎలాంటి సంబంధమూ లేదు.

## కరపత్రంలోని క్రమసంఖ్యలో ఎనిమిదవ వచనం :

"విశ్వాసులారా! ...... అవిశ్వాసులను మీ మిత్రులుగా, సహచరులుగా చేసుకోకండి. మీరు గనక విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడండి."

*(ఖుర్‌ఆన్- 5 : 57)*

ఈ వచనం కూడా అసంపూర్తిగానే ఇవ్వబడింది. వచనంలోని మధ్య అంశాన్ని తెలిసి కావాలని మరుగున పెట్టే కుతంత్రం జరిగింది. పూర్తి వచనం ఇలా ఉంది.

"విశ్వాసులారా! మీకు పూర్వపు గ్రంథ ప్రజలలో మీ ధర్మాన్ని ఒక పరిహాసంగా, ఒక వినోద వస్తువుగా పరిగణించినన వారినీ, ఇతర అవిశ్వాసులనూ మీ మిత్రులుగా, సహచరులుగా చేసుకోకండి. మీరు గనక విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి." *(ఖుర్‌ఆన్- 5వ అధ్యాయం, 57వ వచనం)*

ఈ వచనాన్ని పూర్తిగా చదివితే ముస్లింల ధర్మాన్ని అపహాస్యం చేస్తున్న అవిశ్వాసులైన ఖురైషులను, వారి మిత్రులైన క్రైస్తవులను మిత్రులుగా చేసుకోకుండా ఉండటానికై ఇది అవతరించింది అని స్పష్టమవుతోంది. ఇది పోట్లాటలూ, పోరాటాలను ప్రేరేపించటానికీ, ద్వేషాన్ని వ్యాపింపజేసేదని ఎక్కడ ఉంది? పైగా కరపత్రంలో తెలిసి, కావాలని, "మీ ధర్మాన్ని ఒక పరిహాసంగా, ఒక వినోద క్రీడగా చేసుకున్న వారిని" అనే మాటలను కావాలని దాచిపెట్టి దాని అర్థాన్ని మార్చివేసే ప్రయత్నం చేసేవారు అసలేం కోరుతున్నారో స్వయంగా పాఠకులే గమనించాలి.

## కరపత్రంలోని క్రమసంఖ్యలో తొమ్మిదవ వచనం :

"వారు (ముస్లిమేతరులు) ఎక్కడ కనబడితే అక్కడ పట్టుకోబడతారు. దారుణంగా చంపబడతారు." *(ఖుర్‌ఆన్- 33వ అధ్యాయం, 61వ వచనం)*

దీనిని దీనికంటే ముందున్న 60వ వచనంతో కలిపినప్పుడే ఈ వచనానికి సరైన అర్థం తెలిసివస్తుంది ఇలా.....

"ఒకవేళ కపటులూ, కలుషిత హృదయులూ మదీనా నగరంలో సంచలనం కలిగించే వదంతులను వ్యాపింపజేసేవారూ తమ దుశ్చేష్టలను మానుకోకపోతే, వారికి వ్యతిరేకంగా చర్య తీసుకోవటానికి మిమ్మల్ని నిలబెడతాము. తరువాత వారు ఈ నగరంలో మీతో కలిసి ఉండటం అనేది కష్టసాధ్యమవుతుంది. అన్ని వైపుల నుండి వారిపై శాపాలు విరుచుకుపడతాయి. వారు ఎక్కడ కనబడితే అక్కడ పట్టుకోబడతారు. దారుణంగా చంపబడతారు."

*(ఖుర్ఆన్- 33వ అధ్యాయం, 60, 61 వచనాలు)*

ఆ సమయంలో దైవసందేశహరుల (సఅసం) నివాసమైన మదీనా పట్టణంలో ఖురైషులు దాడి చేసే అనుమానం సదా పొంచి ఉండేది. కొందరు కపటులూ, యూదులూ, క్రైస్తవులు ముస్లింల వద్దకూ వచ్చేవారు. అవిశ్వాసులైన ఖురైషులతోనూ కలిసివుంటూ పుకార్లు వ్యాపింపజేసేవారు. నిత్యం దాడులు జరిగే ప్రమాదమున్న యుద్ధ పరిస్థితుల్లో పుకార్లను వ్యాపింపజేసే గూఢచారులు ఎంతటి ప్రమాదకారులవుతారో ఊహించుకోవచ్చు. ఈనాటి చట్టంలో కూడా ఇలాంటి వారికి మరణ శిక్ష విధించవచ్చు అని ఉంది. నిజానికి శాంతి స్థాపన కోసం వారికి ఇదే సరైన శిక్ష, న్యాయ సమ్మతమైంది కూడా. ఈ వచనం పోరాటం చేయమనేదిగా ఉందనటం దౌర్భాగ్య పూరితంగా ఉంది.

## కరపత్రంలోని క్రమసంఖ్యలో పదవ వచనం :

"నిశ్చయంగా మీరూ, అల్లాహ్‌ను కాదని మీరు పూజించే మీ దైవాలూ నరకానికి ఇంధనం అవుతారు. అక్కడికే మీరు పోవలసి ఉంది."

*(ఖుర్ఆన్- 21వ అధ్యాయం, 98వ వచనం)*

ఒకే దైవం అయిన అల్లాహ్‌ను తప్ప ఇతరులను ఆరాధించటం అన్నింటికన్నా ఘోర పాపకార్యం అనే ఏక దైవవాద మతం ఇస్లాం. ఈ వచనంలో ఈ పాపానికే మరణానంతరం అల్లాహ్ ఈ (నరక) శిక్ష వేస్తాడు అని ఉంది.

కరపత్రంలో వ్రాయబడిన అయిదవ వచన వివరణలో మేము ప్రత్యేకంగా దీన్ని గూర్చి వ్రాసి ఉన్నాము. ఈ వచనాన్ని కూడా పోరాటం సలుపమంటున్న వచనం అనటం న్యాయసమ్మతం కాదు.

**కరపత్రంలో వ్రాయబడిన క్రమసంఖ్యలో పదకొండవ వచనం :**

"తన ప్రభువు వాక్యాల ద్వారా హితబోధ చేయబడినప్పుడు, వాటి పట్ల విముఖుడయ్యే వానికంటే పరమ దుర్మార్గుడెవరు? అటువంటి అపరాధులకు మేము తప్పనిసరిగా ప్రతీకారం చేసి తీరుతాము." (ఖుర్ఆన్- 32వ అధ్యాయం, 22వ వచనం)

ఈ వచనంలో కూడా ఇంతకు ముందు వ్రాయబడిన వచనం మాదిరిగానే అల్లాహ్ తన వచనాలను తిరస్కరించిన వారికి నరక శిక్షను విధిస్తాడు. ఇది పరలోక సంబంధమైనది. చివరకు ఈ వాక్యాన్ని ఇహలోకానికి సంబంధించినదిగా, వివాదాస్పద వచనంగా చేయటం, దీనిని విద్వేష వ్యాప్తితో జోడించటం మూర్ఖత్వపు చర్య.

**కరపత్రంలోని క్రమసంఖ్యలో పన్నెండవ వచనం :**

"ఇదే కాకుండా, ఇతర విజయ ధనాలను గురించి కూడా ఆయన మీకు వాగ్దానం చేస్తున్నాడు. వాటిపై మీరు ఇంకా అదుపు సాధించలేదు."

*(ఖుర్ఆన్- 48వ అధ్యాయం, 20వ వచనం)*

మొదటగా విజయధనం (సమర సొత్తు) అంటే దోపిడి అనే అర్థం కాదు, శత్రువుల నుండి స్వాధీనం చేసుకున్న సంపద అని అర్థం. ఆ సమయంలో ముస్లింల అస్తిత్వాన్ని తుడిచివేయటానికని దాడులు జరిగేవి. అందుకు సమాయత్తాలు జరుగుతుండేవి. బహుదైవారాధకులు, వారి మిత్రులైన యూదులు, క్రైస్తవులు శక్తి సంపన్నులుగా ఉన్నారు. అలాంటి బలవంతులైన శత్రువుల నుండి రక్షించుకోవటానికై వారిలో స్థయిరాన్ని పెంచటం కోసం అల్లాహ్ తరఫు నుండి వాగ్దానం చేయబడింది.

యుద్ధ నియమాల అనుసారం ఇది విహితమైనదే. నేడు కూడా యుద్ధ సమయంలో శత్రువుల నుండి స్వాధీనం చేసుకున్న సంపద విజేతదే అవుతుంది.

దీనిని కలహాలను చేయించే వచనం అనటం దౌర్భాగ్యపూరితం.

**కరపత్రంలోని క్రమసంఖ్యలో పదమూడవ వచనం**

"కనుక మీరు పొందిన సొమ్మును తినండి. అది ధర్మసమ్మతమైనదీ, పవిత్రమైనదీను." *(ఖుర్ఆన్- 8వ అధ్యాయం, 69వ వచనం)*

పన్నెండవ క్రమంలోని వచనంలో ఇవ్వబడిన తర్కం ప్రకారం ఈ వచనం కూడా ఆత్మరక్షణ కోసం చేయబడిన యుద్ధంలో లభించిన సమర సొత్తుకు సంబంధించినది. ఇది యుద్ధంలో స్థయిర్యాన్ని కలిగించటం కోసమైనదిగా ఉంటుంది. దీన్ని కూడా పోరాటాలు చేయించే వచనం అనడం దౌర్భాగ్యపూరితం.

**పధ్నాలుగవ వచనం :**

"ఓ ప్రవక్తా! అవిశ్వాసులతో కపటులతో పోరాడు - వారి పట్ల కఠినంగా వ్యవహరించు. వారి నివాసం నరకమవుతుంది. అది అతి చెడ్డ నివాసం."

*(ఖుర్ఆన్- 66 : 9)*

మేము పైన చెప్పినట్టు అవిశ్వాసులైన ఖురైషులు అత్యాచారులు, అన్యాయ పరులు. వారు కపట ముస్లింల సానుభూతిపరులుగా వచ్చి వారిపై గూఢచర్యం చేస్తూ అవిశ్వాసులైన ఖురైషులకు సమాచారమంతా చేరవేస్తూ అవిశ్వాసులతో కలిసి దైవ సందేశహరులు (సఅసం) గారిని ఎగతాళి చేస్తూ ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నేవారు. ఇలాంటి అధర్మపరాయణులకు వ్యతిరేకంగా పోరాడడం, అధర్మాన్ని అంతమొందించి ధర్మసంస్థాపన చేయవలసి ఉంటుంది. ఆనాడు ఇలాంటి అత్యాచారులైన కౌరవుల గురించి యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు:

**"అథ చేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి**
**తత స్స్వధర్మం కీర్తించ హత్వా పాప మనాప్స్యసి."**

*(గీత- 2వ అధ్యాయం, 33వ శ్లోకం)*

"ఓ అర్జునా! నీవు స్వధర్మమైన యుద్ధమును చేయక కుల ధర్మం నుండి తప్పినచో పాపమునంది శత్రు జయుడవను నీ ప్రఖ్యాతిని కూడా పోగొట్టుకుందువు."

పోస్టర్లను, కరపత్రాలను ముద్రించి పంచిపట్టేవారు శ్రీమద్భవద్గీతలోని ఈ ఆదేశాన్ని పోరాటాలూ, జగడాలు చేయించేవి అని అనగలరా? లేకపోతే ఈ పరిస్థితుల్లో ఆత్మరక్షణ, ధర్మరక్షణ కోసం అత్యాచారులకు విరుద్ధంగా 'జిహాద్' (అంటే ఆత్మరక్షణ, ధర్మరక్షణ కోసం చేసే యుద్ధం) చేసే ఆదేశాన్నిచ్చే వచనాన్ని పోరాటం చేయించేదని ఎలా అనగలరు? ఇది అన్యాయపూరిత నీతి కాదా? ఇదంతా వీరు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నట్టు?

### కరపత్రంలో వ్రాయబడిన పదిహేనవ వచనం :

"మేము ఈ అవిశ్వాసులకు కఠినమైన శిక్షను తప్పకుండా రుచి చూపిస్తాము. వారు చేసిన పరమ దుష్కార్యాలకు పూర్తి ప్రతిఫలం వారికి ఇస్తాము."
*(ఖుర్ఆన్- 41వ అధ్యాయం, 27వ వచనం)*

అల్లాహ్ అవిశ్వాసులను శిక్షిస్తాడు అనే వచనాన్నయితే వ్రాశారు. కాని ఈ శిక్ష ఎందుకు వేయబడుతుంది? దీనికి కారణం దీని ప్రారంభ వచనంలో ఉంది, దాన్ని దాచారు. ఇప్పుడు ఈ రెండు వచనాలను ఇక్కడ నేను వరుసగా వ్రాస్తున్నాను. ఇస్లాంను అప్రతిష్టపాలు చేయటానికి పథక రచన ఎలా చేయబడిందో స్వయానా పాఠకులే గమనించగలరు.

సత్య తిరస్కారులు ఇలా అంటారు: "ఈ ఖుర్ఆన్‌ను అసలు వినకండి. అది వినిపించబడేటప్పుడు వినబడకుండా విఘ్నం కలిగించండి. బహుశా ఇలాగైనా మీరు ప్రాబల్యం వహించవచ్చు." "మేము ఈ కాఫిర్లకు కఠినమైన శిక్షను తప్పకుండా రుచి చూపిస్తాము." *(ఖుర్ఆన్- 41వ అధ్యాయం, 26, 27 వచనాలు)*

ఒకవేళ ఎవరైనా తమ మత గ్రంథాన్ని పారాయణం చేస్తూ లేక ప్రార్థన (నమాజ్) చదువుతూ ఉన్న సమయంలో ఆటంకపరచటానికై అల్లరి చేయటం దుష్టకార్యం కాదా? ఈ దుష్కర్మకుగాను దేవుడు శిక్షంచమని చెబుతున్నాడంటే అది పోరాడమని అర్థమా?

పాప కార్యాలకు శిక్షించమంటూ చెప్పే ఈ వచనంలో పోరాడమనడం ఎలా కనపడిందో నాకర్థం కావటంలేదు.

### కరపత్రంలోని క్రమంలో పదహారవ వచనం :

"అది నరకం; అల్లాహ్ శత్రువులకు ప్రతిఫలంగా దొరికేది. అందులోనే వారు శాశ్వతంగా నివసిస్తారు- వారు మా వాక్యాలను తిరస్కరిస్తూ వచ్చిన నేరానికి ఇది శిక్ష." *(ఖుర్ఆన్- 41వ అధ్యాయం, 28వ వచనం)*

ఈ వచనం మరణానంతరం అవిశ్వాసులకు నరక శిక్ష విధించబడుతుంది అని చెప్పబడిన పైన ఉదాహరింపబడిన పదిహేనవ వచనానికి పూర్వపు వచనం.

ఇది పరలోకానికి సంబంధించినది, ఈ లోకంలో పోరాటాలూ, పోట్లాటలు చేయించడం, ద్వేషాలు వ్యాపింపజేయటంతో దీనికి ఎలాంటి సంబంధమూ లేదు.

**కరపత్రంలోని పదిహేడవ క్రమసంఖ్యలోని వచనం :**

"యదార్థమేమిటంటే, విశ్వాసుల నుండి అల్లాహ్ వారి ప్రాణాలనూ, వారి సంపదలనూ స్వర్గానికి బదులుగా కొన్నాడు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు, చంపుతారు, చస్తారు కూడా." *(ఖుర్‌ఆన్- 9వ అధ్యాయం, 111వ వచనం)*

'గీత'లో ఇలా ఉంది:

**"హతోవా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహిమ్**
**తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృత నిశ్చయః**

*(గీత- 2వ అధ్యాయం, 37వ శ్లోకం)*

**అర్థం:** "ఓ కుంతి కుమారా! నీవు శత్రువులచే యుద్ధభూమియందు చంప బడినచో నీకు స్వర్గలోక సౌఖ్యం కలుగును లేక నీవే వారిని జయించి విజయం నందుచో యావన్మహీమండలమునేలు సౌఖ్యమునందగలవు. కావున లెమ్ము. యుద్ధము చేయ నిశ్చయమునందుము."

భగవద్గీతలోని ఈ ఆదేశం పోరాటాలూ, పోట్లాటలూ రగిలించేది కాదు. ఇది అధర్మాన్ని పెంచేది కూడా కాదు. ఎందుకంటే ఇదైతే అన్యాయాలూ, అత్యాచారాలను అంతమొందించి ధర్మసంస్థాపనం కోసం యుద్ధం చేయమనేది.

ఈ పరిస్థితుల్లో అన్యాయులూ అత్యాచారులను, అవిశ్వాసులు సత్య తిరస్కారులను సమాప్తం చెయ్యటాని కోసం సరిగ్గా అదే విధంగా అల్లాహ్ (విశ్వప్రభువు) ఆదేశం కూడా సత్యధర్మ సంస్థాపన కోసం, ఆత్మరక్షణ కోసమే. మరి దీనిని మాత్రమే పోరాటాలు చేయించేదని ఎందుకు చెప్పబడింది? ఇలా అనేవారిది అన్యాయ పూరితమైన విధానం కాదా? ఇలాంటి వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

**కరపత్రంలోని క్రమంలో పద్దెనిమిదవ వచనం :**

"నిశ్చయంగా ఈ కపటులే ద్రోహులు. కపటులైన ఈ పురుషులకూ, స్త్రీలకూ, అవిశ్వాసులకూ అల్లాహ్ నరకాగ్నిని వాగ్దానం చేశాడు. అందులో వారు

కలకాలం ఉంటారు. అదే వారికి యోగ్యమైనది. వారిపై అల్లాహ్ శాపం పడింది. వారి కొరకు శాశ్వతమైన శిక్ష ఉంది." *(ఖుర్‌ఆన్- 9వ అధ్యాయం, 68వ వచనం)*

9వ అధ్యాయంలోని ఈ 68వ వచనం కంటే ముందున్న 67వ వచనాన్ని చదివిన తరువాత ఈ వచనాన్ని చదవండి. ముందున్న 67వ వచనం ఇదీ:

"కపటులైన పురుషులూ, కపటులైన స్త్రీలూ అందరూ ఒకే కోవకు చెందినవారు; వారు చెడును చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. మంచిని చెయ్యవద్దు అని వారిస్తారు. ఇంకా తమ చేతులను మేలు చేయకుండా ఆపుతారు. వారు అల్లాహ్‌ను మరచిపోయారు. కనుక అల్లాహ్ కూడా వారిని మరచిపోయాడు. నిశ్చయంగా ఈ కపటులే ద్రోహులు." *(ఖుర్‌ఆన్- 9వ అధ్యాయం, 67వ వచనం)*

కపటులైన పురుషులూ, స్త్రీలూ ప్రజలను మంచి పనుల నుండి వారించి చెడు పనులు చేయమని చెబుతారని స్పష్టమవుతుంది. మంచి పనుల కోసం ఓ చెల్లని రూకను కూడా ఇవ్వరు. దైవాన్ని కూడా తలచరు. దైవాన్ని విస్మరించి వారు ఉపాధి సముపార్జనలోనే ఉండిపోతారు. ఇలాంటి పాపిష్టులను మరణానంతరం తీర్పుదినం నాడు నరక శిక్షను గురించి హెచ్చరిక చేసే ఈ దైవ వచనం 'చెడు'పై 'మంచి' విజయం చేయటాని కోసం అవతరించింది. పోరాటాలకూ, పోట్లాటల కోసం కాదు.

## కరపత్రంలోని క్రమసంఖ్యలోని పందొమ్మిదవ వచనం :

"ప్రవక్తా! ముస్లిములను యుద్ధానికి పురికొలుపు. మీలోగనక ఇరవై మంది స్థయిర్యం కలవారు ఉంటే, వారు రెండు వందల మందిని జయిస్తారు. ఇంకా అటువంటి వారు వంద మంది గనక ఉంటే, వేయి మంది సత్యతిరస్కారులను జయిస్తారు. ఎందుకంటే, వారు బుద్ధిహీనులైన ప్రజలు." *(ఖుర్‌ఆన్- 8వ అధ్యాయం, 65వ వచనం)*

మక్కా అత్యాచారులైన ఖురైషులు, దైవసందేశహరులు (సఅసం) వారి మధ్య జరిగే యుద్ధంలో ఖురైషుల సంఖ్య అధికంగానూ, సత్యధర్మ రక్షకులైన ముస్లిముల సంఖ్య తక్కువగానే ఉండేది. ఈ పరిస్థితుల్లో ముస్లింల స్థయిర్యాన్ని పెంచటానికీ, వారిని యుద్ధంలో స్థిరచిత్తంతో ఉంచటానికి అల్లాహ్ నుండి

ఈ వచనం అవతరించింది. ఈ యుద్ధం అత్యాచారులూ, దురాక్రమణ దారులైన అవిశ్వాసుల మధ్య ఉండిందే కాని అవిశ్వాసులందరితో, ముస్లిమేతరులతో కాదు. ఈ వచనం ఇతర ధర్మావలంబీకులతో పోరాటం చేయమనే ఆదేశమివ్వదు. దీనిని ధృవీకరించటానికి మేము ఈ క్రింది వచనాన్ని ఇస్తున్నాము:

"ఎవరైతే ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో, మిమ్మల్ని మీ ఇళ్ల నుండి వెళ్లగొట్టలేదో, వారిపట్ల మీరు మంచితనంతో వ్యవహరించటాన్ని అల్లాహ్ నిరోధించడు. అల్లాహ్, న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు."

*(ఖుర్ఆన్ -60వ అధ్యాయం, 8వ వచనం)*

## కరపత్రంలోని క్రమసంఖ్యలో ఇరవయ్యో వచనం :

"విశ్వాసులారా! యూదులనూ, క్రైస్తవులనూ మీ మిత్రులుగా చేసుకోకండి. వారు తమలో తామే ఒకరికొకరు మిత్రులు. మీలో ఎవడైనా వారిని తన మిత్రులుగా స్వీకరిస్తే అతడు కూడా వారిలో ఒకడుగా పరిగణింపబడతాడు. నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులను తన మార్గదర్శకత్వానికి దూరం చేస్తాడు."

*(ఖుర్ఆన్- 5వ అధ్యాయం, 51వ వచనం)*

యూదులు, క్రైస్తవులు పైకి మాత్రం ముస్లింలతో స్నేహపూర్వకంగా మాట్లాడేవారు. కాని వెనుకచాటుగా ఖురైషులకు సహాయంగా ఉంటూ ముహమ్మద్ (సఅసం)తో పోరాడండి, మేము మీ వెంట ఉన్నాం అనేవారు. వారి ఈ వ్యూహాన్ని నిరర్థకం చేస్తూ ముస్లింలను జాగృతం చేయటమే ఈ వచనం ఉద్దేశ్యం కాని పోరాడమనటం కాదు. ఖుర్ఆన్‌లో దీనిని ధృవీకరించే ఈ వచనాన్ని చూడండి:

"ఎవరు మీతో ధర్మం విషయంలో యుద్ధం చేశారో, మిమ్మల్ని మీ ఇళ్ల నుండి బహిష్కరించారో, మిమ్మల్ని బహిష్కరించటంలో పరస్పరం సహకరించుకున్నారో, వారితో మీరు స్నేహం చేయటాన్ని మాత్రం అల్లాహ్ వారిస్తున్నాడు. అటువంటి వారితో స్నేహం చేసేవారే దుర్మార్గులు."

*(ఖుర్ఆన్- 60వ అధ్యాయం, 9వ వచనం)*

## కరపత్రంలోని క్రమసంఖ్యలో ఇరవై ఒకటవ వచనం :

"గ్రంథ ప్రజలలో అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసించనివారునూ,

అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించినదానిని నిషిద్ధంగా భావించని వారునూ, ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోనివారునూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు స్వయంగా తమ చేతులతో జిజియా ఇచ్చే వరకూ.." *(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 29వ వచనం)*

ఇస్లాం ప్రకారం తౌరాత్, జుబూర్ (Old Testment), ఇంజీల్ (New Testment) ఖుర్ఆన్ అల్లాహ్‌చే పంపబడిన గ్రంథాలు, కాబట్టి ఈ గ్రంథాలపై వేర్వేరుగా విశ్వసించినవారు క్రమంగా యూదులు, క్రైస్తవులు, ముస్లింలు గ్రంథ ప్రజలు, గ్రంథం కలవారు అనబడతారు. ఇక్కడ ఈ వచనంలో గ్రంథ ప్రజలు అంటే యూదులు, క్రైస్తవులు అని అర్థం.

దైవగ్రంథాలు నిగూఢమైనవిగా ఉంటాయి. కాబట్టి ఈ వచనాన్ని చదివిన తరువాత ఇందులో యూదులనూ, క్రైస్తవులనూ బలవంతంగా ముస్లింలుగా చేయడం కోసం పోరాడమనే ఆదేశాలున్నాయనిపిస్తుంది. కాని వాస్తవంగా అలా లేదు. ఎందుకంటే ఇస్లాంలో ఎలాంటి బలవంతానికీ అనుమతి లేదు.

ఖుర్ఆన్‌లో ఎవరిని కూడా ముస్లింగా మారమంటూ బలవంతం చేయటాన్ని అల్లాహ్ నిషేధిస్తున్నాడు. చూడండి:

"ప్రవక్తా! ఒకవేళ వీరు నీతో ఘర్షణకు తలపడితే, ఇలా చెప్పు : "నేనూ, నా అనుచరులూ అల్లాహ్‌కు సంపూర్ణంగా విధేయులమయ్యాము." గ్రంథం గలవారినీ, గ్రంథం లేనివారినీ ఉభయులనూ ఇలా అడుగు : "మీరు కూడా ఆయన పట్ల విధేయతకూ, దాస్యానికీ అంగీకరించారా?" అలా చేస్తే వారు సరియైన మార్గాన్ని పొందినట్లే. కాని ఒకవేళ వారు దానికి విముఖులైతే, నీ బాధ్యత కేవలం సందేశాన్ని అందజెయ్యడమే. తరువాత అల్లాహ్ తన దాసుల విషయాలను తానే స్వయంగా చూసుకుంటాడు."

*(ఖుర్ఆన్- 3వ అధ్యాయం, 20వ వచనం)*

"నీ ప్రభువు అభీష్టం గనక ఇదే అయితే (అంటే భూమిపై ఉండేవారంతా విశ్వాసులూ, విధేయులూ అవ్వాలి అనేది) సమస్త భూవాసులూ విశ్వసించి ఉండేవారే. అలాంటప్పుడు నీవు ప్రజలను విశ్వాసులుగా మారండి అని బలవంతం చేస్తావా?" *(ఖుర్ఆన్- 10వ అధ్యాయం, 99వ వచనం)*

ఇస్లాం ప్రచార ప్రసారంలో ఎలాంటి బలవంతం చేయరాదనే ఈ వచనాలున్నప్పటికీ ఈ వచనంలో గ్రంథంగలవారితో పోరాడమనే ఆదేశం రావడానికి కారణం స్వయానా ఆ కరపత్రంలో వ్రాయబడిన 8,9,20వ క్రమసంఖ్యలోని వచనాల కోసం నేను ఇచ్చి ఉన్నవే. ఈ వచనంలోని జిజియా పేరుతో ముస్లిమేతరులపై వేసే పన్ను వారి ధన, ప్రాణ రక్షణ కోసమే తీసుకోబడేది. ఇది తప్ప వారికి ఎలాంటి పన్ను విధించబడేది కాదు. ముస్లింలకు కూడా జకాత్ చెల్లించడం విధిగా ఉండింది. ఈనాడైతే ప్రభుత్వాలు మాటిమాటికీ పన్నులు విధిస్తూనే ఉన్నాయి.

## కరపత్రంలో వ్రాయబడిన క్రమసంఖ్యలోని ఇరవై రెండవ వచనం :

"చివరకు మేము వారిమధ్య పరస్పర విరోధ, విద్వేష బీజాలను ప్రళయం వరకు ఉండే విధంగా నాటాము. వారు ప్రపంచంలో ఏమేమి చేస్తూ ఉండే వారో, దానిని అల్లాహ్ వారికి చూపే ఒక సమయం అవశ్యం వస్తుంది."

*(ఖుర్ఆన్- 5వ అధ్యాయం, 14వ వచనం)*

కపటపూరిత ఉద్దేశ్యంతోనే కరపత్రంలో ఈ వచనం తెలిసి తెలిసి కావాలని అసంపూర్ణంగా ఇవ్వబడింది. పూర్తి వచనం ఇలా ఉంది:

"ఇదే విధంగా, 'మేము క్రైస్తవులం' అని చెప్పుకున్నవారి నుండి కూడా మేము దృఢమైన ప్రమాణం తీసుకున్నాము. కాని వారు తమకు బోధించబడిన విషయంలో ఒక పెద్ద భాగాన్ని విస్మరించారు. చివరకు మేము వారిమధ్య పరస్పర విరోధ, విద్వేష బీజాలను ప్రళయం వరకూ ఉండే విధంగా నాటాము. వారు ప్రపంచంలో ఏమేమి చేస్తూ ఉండేవారో, దానిని అల్లాహ్ వారికి చూపే ఒక సమయం అవశ్యం వస్తుంది."

*(ఖుర్ఆన్- 5వ అధ్యాయం, 14వ వచనం)*

ఈ వచనాన్ని పూర్తిగా చదివితే ఇది వాగ్దాన భంగానికి, చమత్కారానికి, దురుద్దేశానికి విరుద్ధంగా అవతరించిందే కాని ఘర్షణలు చేయించటానికి కాదని స్పష్టమవుతోంది.

## కరపత్రంలో వ్రాయబడిన క్రమంలోని ఇరవై మూడవ వచనం :

"స్వయంగా వారు అవిశ్వాసులుగా ఉన్నట్లుగానే మీరు కూడా అవిశ్వాసులుగా

మారి, మీరూ వారూ సమానులైపోవాలని వారు కోరుతున్నారు. కనుక అల్లాహ్ మార్గంలో వారు హిజ్రత్ (వలస) చెయ్యనంత వరకు, వారిలో ఎవ్వరినీ మీరు మీ మిత్రులుగా చేసుకోకండి. ఒకవేళ వారు హిజ్రత్ చెయ్యకపోతే, ఎక్కడ దొరికినా వారిని పట్టుకోండి, చంపండి. వారిలో ఎవ్వరినీ మీ మిత్రులుగా, సహాయకులుగా చేసుకోకండి."

*(ఖుర్ఆన్-4వ అధ్యాయం, 89వ వచనం)*

ఈ వచనాన్ని ఈ క్రింద కనబరచిన దీని ముందటి 88వ వచనంతో కలిపి చదవండి.

"మీకు ఏమయింది, మీ మధ్య కపటులను గురించి రెండు అభిప్రాయాలు ఉన్నాయి? వాస్తవంగా వారు సంపాదించుకున్న దుష్కకర్మల ఫలితంగానే అల్లాహ్ వారిని వెనక్కు (పూర్వపు స్థితికి) మరల్చాడు. అల్లాహ్ మార్గం చూపనివారికి మీరు మార్గం చూపదలిచారా?"

*(ఖుర్ఆన్- 4వ అధ్యాయం, 88వ వచనం)*

కరపత్రంలో ఇవ్వబడిన ఇంతకు ముందటి 89వ వచనం కపట ముస్లింల కోసం ఉందని స్పష్టమవుతోంది. వారు ముస్లింల వద్దకు వచ్చి మేము విశ్వసించి ముస్లింలమైపోయాము అని అంటారు, మక్కాలోని అవిశ్వాసుల వద్దకు వెళ్ళి అదేమీ లేదు. మేము మా తాతముత్తాతల ధర్మంపైనే ఉన్నాము. విగ్రహాలను ఆరాధించేవాళ్ళం, మేమైతే మీకు తెలుపటానికని ముస్లింల వద్ద రహస్యాలను సేకరించటానికి వెళుతున్నాము అనేవారు. వారు ముస్లింల మధ్య కూర్చొని, వారి తాతముత్తాతల ధర్మమైన విగ్రహారాధన వైపునకు మరలి రమ్మని కూడా చెప్పేవారు.

అందుకని ఈ కపటాచారులను మీ మిత్రులుగా చేసుకోకండి అనే వచనం అవతరించింది. ఎందుకంటే, వీరు మిత్రులే కాదు, ఇంకా వీరి నిజాయితీని పరీక్షించటానికి సత్యవంతులే అయితే మీరు కూడా నా మాదిరి దేశాన్ని వదలి వలస (హిజ్రత్) పోండి అని అనండి. ఒకవేళ అలా చేయకపోతే వీరు అవిశ్వాసులైన శత్రువుల కంటే ఎక్కువ నష్టం కలిగించే కపటాచారులైన గూఢచారులని తెలుసుకోండి. ఆ సమయంలో యుద్ధ పరిస్థితులున్నాయి. యుద్ధ దినాల్లో భద్రతా దృష్ట్యా ఇలాంటి గూఢచారులు చాలా ప్రమాదకారులవుతారు. వీరికి శిక్ష, మరణమే. వారి సందిగ్ధ గతి విధాల కారణంగానే వారిని మిత్రులుగా గాని సహాయకారులుగా గాని

చేసుకోకూడదని వారించబడింది. ఎందుకంటే, ఇలా చేయటం వల్ల ద్రోహమే జరుగుతుంది.

ఈ వచనం ముస్లింల ఆత్మరక్షణ కోసం అవతరించిందే కాని పోరాటాలు చేయించటానికీ, ద్వేషాలు వ్యాపింపజేయటానికి కాదు.

## కరపత్రంలో వ్రాయబడిన క్రమంలో ఇరవై నాలుగవ వచనం :

"కనుక వారితో యుద్ధం చెయ్యండి; అల్లాహ్ మీ చేతుల ద్వారా వారిని శిక్షిస్తాడు. వారిని హీనులుగా, నీచులుగా చేసి అవమానంపాలు చేస్తాడు. ఇంకా వారికి ప్రతికూలంగా మీకు సహాయం చేస్తాడు. చాలా మంది విశ్వాసుల హృదయాలను చల్లబరుస్తాడు." *(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 14వ వచనం)*

శాంతి ఒడంబడికను భగ్నం చేసి దాడికి పాల్పడే వారికి విరుద్ధంగా 9వ అధ్యాయంలోని ఈ వచనం అవతరించిన విషయాన్ని కరపత్రం మొదటి క్రమంలోని వచనంలో మేము వివరంగా తెలిపాము. కరపత్రంలోని 24వ క్రమంలో వ్రాయబడిన వచనం ఇదే అధ్యాయంలోనిది. ఇందులో ఒప్పందాన్ని భగ్నం చేసి, దాడి చేసే అత్యాచారాలతో పోరాడి, వారిని శిక్షించమనే అల్లాహ్ ఆదేశం ఉంది. ఆ విధంగా ఘర్షణ, అల్లర్లు చేసే వారి స్థయిర్యం కోల్పోయి శాంతి స్థాపితం కావాలని.

దీనిని మరింత స్పష్టం చేయటాని కోసం ఖుర్ఆన్‌లోని 9వ అధ్యాయంలోని ఈ 14వ వచనంలోని తొలి రెండు వచనాలను చూడండి.

"ఒకవేళ ఒడంబడిక కుదుర్చుకున్న తరువాత, వారు మళ్ళీ తమ ప్రమాణాలను భగ్నంచేస్తే, మీ ధర్మంపై దాడులు చెయ్యటం ప్రారంభిస్తే, అవిశ్వాస పతాక ధారులతో యుద్ధం చెయ్యండి; ఎందుకంటే, వారి ప్రమాణాలు ఏమాత్రం నమ్మదగ్గవి కావు. బహుశా (కరవాల శక్తి వల్లనే) వారు మానుకోవచ్చు."
*(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 12వ వచనం)*

"తమ వాగ్దానాలను భంగంచేస్తూ ఉన్నవారితో, సందేశహరుణ్ణి దేశం నుండి బహిష్కరించాలని నిర్ణయించుకున్నవారితో మీరు యుద్ధం చెయ్యరా? అతిక్ర మణను ప్రారంభించింది వారే. మీరు వారికి భయపడుతున్నారా? మీరు గనక విశ్వాసులే అయితే మీరు భయపడటానికి అల్లాహ్‌యే ఎక్కువ అర్హుడు."
*(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 13వ వచనం)*

శాంతి స్థాపన ఉద్దేశ్యంతో అవతరించిన 9వ అధ్యాయంలోని ఈ వచనాలను శాంతిని భంగం చేసి ఘర్షణలు అల్లర్లు చేయించేవి అనేవాళ్ళు ధూర్తులు, అజ్ఞానులు అయి ఉంటారు.

40 సంవత్సరాల వయస్సులో హజ్రత్ ముహమ్మద్ (సఅసం)కు అల్లాహ్ నుండి సందేశం లభించిన తరువాత నుండి అతిమ సమయం (23 సంవత్సరాలు) వరకు  అవిశ్వాసులు ముహమ్మద్ (సఅసం) ను ఒకచోట ప్రశాంతంగా కూర్చోనివ్వలేదు.  ఈ మధ్యకాలంలో నిరంతరం యుద్ధాలు, కుట్రలు, ఘర్షణలతో కూడిన వాతావరణం ఉండింది.

ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం శత్రువులతో జాగ్రత్తగా ఉండాలి. పరిస్థితులను కలుషితం చేసే కపటాచారులు, అత్యాచారులను అణచివేయటం, వారిపై ఒత్తిడి కలిగించటం, వారిని శిక్షించటం ఒక ఆవశ్యకత మాత్రమే కాదు, కర్తవ్యంగా ఉండింది.

ఇలాంటి దుష్టులు, అత్యాచారులు, కపటాచార్యుల కోసం రుగ్వేదంలో దేవుని ఆదేశం ఇలా ఉంది:

"మాయాభిరింద్ర మాయినం త్వం శుష్ణ మావాతిర్ణః
విదుష్టేతస్య మేధిరస్తేషం షవం స్త్యుత్తిర"

*(రుగ్వేదం : మండలం-1, సూక్తి -11, మంత్రం -7)*

**భావార్థం:** సామ, దాన, దండ, భేదోపాయంతో దుష్టులు, శతృవులను నిర్మూలించి యధావిధిగా రాజ్యాన్ని అభివృద్ధి చేయాలని బుద్ధిమంతులకు దైవం ఆజ్ఞాపిస్తున్నాడు.  ఆ విధంగా ఈ లోకంలో కపటులు, మోసకారులు, దుష్టుల వృద్ధి కాకూడదు. నిరంతరం అలాంటి ఉపాయాన్ని అనుసరించాలి. (మహర్షి దయానంద గారి హిందీ భాష్యం)

కరపత్రంలో ఇవ్వబడిన 24 వచనాలు ముస్లింలు వారి ఏకదైవ సత్యధర్మమైన ఇస్లాంను రక్షించుకోగలందుకై అల్లాహ్ ఇచ్చిన ఆదేశాలు. వాస్తవానికి ఈ ఆదేశాలు వ్యవహారిక సత్యాలు. కాని వారి రాజకీయ ప్రయోజనాల కోసం ఖుర్ఆన్‌లోని ఈ వచనాలకు వక్రభాష్యాలు చేసి వాటిని ప్రజలకు పంచి కొందరు స్వార్థపరులు ముస్లింలకు, విభిన్న మతావలంబీకుల మధ్య ఘర్షణలు, పోరాటాలు చేయించి

విద్వేషాలను వ్యాప్తి చేసే బీజాలను నాటడం లేదా? ఇది ఓ పథకం ప్రకారం ప్రజలను రెచ్చగొట్టడం, తప్పుదోవ పట్టించడం కాదా?

కోర్టు తీర్పును అడ్డుపెట్టుకుని 1986లో ముద్రించబడిన ఈ కరపత్రాన్ని ఏ ప్రయోజనం కోసం ముద్రించి పంచిపెట్టబడుతోంది?

వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఇలాంటి పనులతో దేశంలో అశాంతి, అలజడులు వ్యాపింపజేయగోరే ఇలాంటి వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

ఎదుటివారితో గౌరవింపబడాలని ఆశించేవారు, మొదట వారు ఎదుటివారిని గౌరవించాలని వారికి తెలియదా? ఇలాంటి వారు ముందు నిష్కల్మష మనసుతో ఖుర్‌ఆన్‌ను బాగా చదవాలి, ఇస్లాంను అర్థం చేసుకోవాలి. ఆ తరువాతనే ఇస్లాంపై వ్యాఖ్యానించాలి. కాని ఇతరత్రా కాదు.

**ఈ కరపత్రాన్ని ముద్రించి, పంచిపెట్టేవారు కూడా నాలాగే తెలియకుండా అపార్థంలో పడిపోయి ఉండవచ్చు. ఒకవేళ అలా ఉన్నట్లయితే ఇప్పుడు వాస్తవం తెలిసిన తరువాత ఇంకా ఎన్నో భాషల్లో ఈ పత్రాన్ని ముద్రించడం, పంచడం ఆపివేసి చేసినదానికి పశ్చాత్తాపం చెంది బహిరంగ క్షమాపణలు కోరాలి.**

ఇక్కడ ఒక సంఘటనను గూర్చి చెప్పటం అవసరం. కొన్నాళ్ళ క్రితం "వైదిక ధర్మం- ఇస్లాం" విషయంపై కాన్పూర్‌లో జరిగిన ఒక సెమినార్‌లో నా వ్యాఖ్యానం తరువాత ఆర్యసమాజానికి చెందిన ఒక మహాశయుడు నాతో "స్వామీజీ ఇప్పుడే తమరు ఇస్లాంను గురించి తెలుపుతూ ఇస్లాం, వేదాలలోని విషయాలలో ఆశ్చర్యజనక రూపంలో సమానత ఉందని అన్నారు. తమరు వివరించిన తర్కంలో అలాగే అనిపిస్తోంది. మరైతే స్వామి దయానంద సరస్వతి గారు వ్రాసిన సత్యార్థ ప్రకాశ్[1]లోని 14వ అధ్యాయం ఏమంటుందో చెప్పండి" అన్నారు. ఇది సత్యప్రకాశ్ చదివిన వారి మనసుల్లో స్వాభావికంగానే ఉదయించే ప్రశ్న.

దీని సమాధానం నేను నా విషయంలో ముందే వ్రాసి ఉన్నట్టు ఖుర్‌ఆన్ వచనాల అర్థాన్ని సరిగ్గా తెలుసుకోవటానికి, ఆ వచనం ఎందుకు అవతరించింది,

---

*1. స్వామి దయానంద సరస్వతిగారు వ్రాసిన 'సత్యార్థప్రకాష్' అనే పుస్తకంలో ప్రధాన ధర్మాలు, మతాల సమీక్ష చేశారు. ఈ పుస్తకంలోని 14వ అధ్యాయంలో ఇస్లాంను గురించి తప్పుడు సమాచారం ఇవ్వబడింది.*

ఏ పరిస్థితుల్లో అవతరించింది? అని తెలుసుకోవడం అవసరం. ఇంకా ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవడానికి అతని మనసులో ఇస్లాం పట్ల సకారాత్మక (Positive) దృష్టి కోణం కూడా ఉండాలి. అంటే, మనస్సు నిర్మలంగా ఉండాలి. ఎందుకంటే, దైవ గ్రంథాలు చాలా నిగూఢంగా ఉంటాయి. వాటిని అర్థం చేసుకోవటం అంత సులభం కాదు. వేదాలనే తీసుకోండి, వైదిక మంత్రాల సరైన అర్థం చేసుకోవడం చాలా కఠినమైన పని.. మంత్రాలను అర్థం చేసుకునే సమయంలో ప్రజల మానసిక స్థితి ఎలా ఉంటుందో, మంత్రాలను అర్థం చేసుకునేటప్పుడు కూడా అదే ప్రభావితం చేస్తుంది.

స్వామీ దయానంద సరస్వతిగారు మహా విద్వాంసులు. కాని స్వామీజీ అరబీ భాషను ఎరుగరు. స్వామీజీ కూడా నాలాగే ఇస్లాం పట్ల నకారాత్మక దృష్టికోణాన్ని కలిగి ఉండి, ఖుర్ఆన్ శబ్దానువాదాన్ని చూశారు. దాన్ని విన్నారు. కాని ఆ వచనం ఎందుకు అవతరించిందీ, ఏ పరిస్థితుల్లో అవతరించిందీ ఇంకా ఆ వచనపు లక్ష్యం ఏమిటి? ఏ సందర్భంలోనిది, అనేది చూడలేదు. కాబట్టి నాలాగే ఖుర్ఆన్‌ను అపార్థం చేసుకుని దాని పట్ల తప్పుడు అభిప్రాయాన్ని మలుచుకున్నారు. స్వామీజీ మహా విద్వాంసులు, తప్పు వారితో జరుగలేదు. ఖుర్ఆన్‌ను, ఖుర్ఆన్‌లోని వచనాలను గ్రహించగల తీరును స్వామీజీకి సరిగ్గా చెప్పలేకపోయిన వారిది ఆ తప్పు. ఒకవేళ స్వామీజీ గారు హజ్రత్ ముహమ్మద్ (సఅసం) జీవిత చరిత్ర, వారి ప్రవచనాలను అంటే, హదీసులను చదివి ఉంటే నేను ఈనాడు చెబుతున్నట్టు, వ్రాస్తున్నట్టే వారు కూడా నిశ్చయంగా ఇలాగే మాట్లాడేవారు, ఇలాగే వ్రాసేవారు.

## ఖుర్ఆన్ ఆదర్శాలు

దైవిక జ్ఞానపు రహస్యమయ పుస్తకాలను చదవటానికీ, అర్థం చేసుకోవటాని కోసం శారీరకంతోపాటు మానసిక శుద్ధత కూడా అవసరం అని, అప్పుడే వాటి రహస్యం అర్థమవుతుందని నేను అనుభవపూర్వకంగా గ్రహించాను.

ఈ పరిశుద్ధతతో నేను దైవగ్రంథమైన ఖుర్ఆన్‌ను చదివినప్పుడు అల్లాహ్ రహస్యమయ వచనాల నిజమైన అర్థం తెలిసొచ్చింది. అల్లాహ్ తరఫు నుండి పంపబడిన ఖుర్ఆన్ గ్రంథం మానవ కళ్యాణం కోసం ఆకాశం నుండి అవతరించింది. అందులో మానవత కోసం ఆదర్శమే ఆదర్శం ఉంది.

ఖుర్‌ఆన్‌లోని మొదటి అధ్యాయం 'ఫాతిహా' దైవస్తోత్రం. దానిని చదివిన తరువాత మనస్సు దానంతటఅదే దేవుని ఏకత్వపు సర్వోన్నతను స్వీకరిస్తుంది. అల్లాహ్ పట్ల విశ్వాసం భక్తి ప్రపత్తులతో నిండిపోతుంది. కావాలనుకుంటే స్వయంగా పాఠకులు మనో నైర్మల్యం ఆస్తిక భావంతో చదివి చూడగలరు:

*అనంత కరుణామయుడు, పరమ దయాళువు అయిన అల్లాహ్ పేరుతో*

"అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, ప్రతిఫలదినానికి స్వామి. మేము నిన్నే ఆరాధిస్తాము, సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము. మాకు రుజుమార్గం చూపించు – నీవు అనుగ్రహించినవారూ, నీ ఆగ్రహానికి గురికాని వారూ, మార్గభ్రష్టులు కానివారూ అనుసరించిన మార్గము."

*(ఖుర్‌ఆన్– 1వ అధ్యాయం, 1–7వ వచనాలు)*

## ఖుర్‌ఆన్‌లోని ఆధ్యాత్మిక ఆదర్శాలు

"తెలుసుకో! ఆకాశాలలో ఉండేవారైనా, భూమిలో ఉండేవారైనా సర్వులూ అల్లాహ్ పాలితులే. అల్లాహ్‌ను కాదని (తాము కల్పించిన) కొందరు భాగస్వాములను వేడుకుంటున్న వారు కేవలం భ్రమనూ, అనుమానాన్నీ అనుసరిస్తున్నారు." *(ఖుర్‌ఆన్– 10వ అధ్యాయం, 66వ వచనం)*

ప్రవక్తా ఇలా అను: "మానవులారా! మీరు గనక ఇంకా నా ధర్మం గురించి ఏదైనా సంశయం కలిగివుంటే, వినండి, మీరు అల్లాహ్‌ను కాదని ఆరాధించే వారిని నేను ఆరాధించను. ఏ దేవుని అధీనంలో మీ మరణం ఉన్నదో ఆ దేవుడినే నేను ఆరాధిస్తాను. నేను విశ్వాసులలో ఒకడిగా ఉండాలని నాకు ఆదేశం ఇవ్వబడింది." *(ఖుర్‌ఆన్– 10వ అధ్యాయం, 104వ వచనం)*

"అల్లాహ్‌ను వదలి నీకు నష్టాన్నిగాని లాభాన్నిగాని కలిగించలేని ఏ శక్తినీ వేడుకోకు. ఒకవేళ అలా చేస్తే నీవూ దుర్మార్గుడవై పోతావు."

*(ఖుర్‌ఆన్– 10వ అధ్యాయం, 106వ వచనం)*

"ఇలా అను : భూమ్యాకాశాల సృష్టికర్త, ఉపాధి ప్రదాతేగాని ఉపాధి గ్రహీత కానివాడు అయిన అల్లాహ్‌ను కాదని నేను మరెవరినయినా నా సంరక్షకుడిగా చేసుకోవాలా?" ఇలా చెప్పు : అందరికంటే ముందు నేను ఆయనకు విధేయుణ్ణి

కావాలని నన్ను ఆదేశించటం జరిగింది. (ఇంకా ఇలా తాకీదు ఇవ్వబడింది– ఎవరైనా షిర్క్ చేస్తే చెయ్యనీ) "నీవు మాత్రం ముష్రిక్కులలో కలసిపోవద్దు."

*(ఖుర్ఆన్– 6వ అధ్యాయం, 14వ వచనం)*

"మీరు అల్లాహ్‌ను వదలి వేడుకునేవారు మీకూ సహాయం చెయ్యలేరు, స్వయంగా తమకూ సహాయం చేసుకోలేరు."

*(ఖుర్ఆన్– 7వ అధ్యాయం, 197వ వచనం)*

"ఇంకా మీరు గనక వారిని రుజుమార్గం వైపునకు రమ్మని పిలిస్తే, వారు మీ మాటను విననైనా లేరు. పైకి వారు మీవైపు చూస్తూ ఉన్నట్లు కనిపిస్తుంది. కాని వాస్తవానికి వారు దేనినీ చూడలేరు."

*(ఖుర్ఆన్– 7వ అధ్యాయం, 198వ వచనం)*

వారిని అడుగు: ఆకాశం నుండీ, భూమి నుండీ మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు? వినే శక్తీ, చూసే శక్తీ ఎవడి అధీనంలో ఉన్నాయి? ప్రాణములేని దానినుండి ప్రాణమున్నదానినీ, ప్రాణమున్న దాని నుండి ప్రాణము లేని దానినీ వెలికితీసేవాడు ఎవడు? ఈ విశ్వవ్యవస్థను నడుపుతున్నవాడు ఎవడు? వారు 'అల్లాహ్' అని తప్పకుండా అంటారు. ఇలా అను: "అలాంటప్పుడు మీరు (సత్యానికి వ్యతిరేకంగా నడవటం) మానుకోరేమిటి? ఆ అల్లాహ్‌యే మీ నిజమైన ప్రభువు. కనుక సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేమిటి? అసలు మీరు ఎటు మరలింపబడుతున్నారు?"

*(ఖుర్ఆన్– 10వ అధ్యాయం, 31, 32 వచనాలు)*

వారిని అడుగు : "మీరు దేవునికి భాగస్వాములుగా నిలబెట్టిన వారిలో సృష్టిని ప్రారంభించేవాడూ, దానిని తిరిగి సృష్టించేవాడూ ఎవడైనా ఉన్నాడా? అని. ఇలా అను : సృష్టిని ప్రారంభించేవాడూ, దానిని తిరిగి సృష్టించేవాడూ కేవలం అల్లాహ్ మాత్రమే. అయినా, మీరు ఎలా త్రోవ తప్పించబడుతున్నారు?

వారిని ఇలా అడుగు : మీరు అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టిన వారిలో సత్యం వైపునకు మార్గం చూపేవాడు కూడా ఎవడైనా ఉన్నాడా? ఇలా అను: కేవలం అల్లాహ్‌యే సత్యం వైపునకు మార్గం చూపుతాడు. అలాంటప్పుడు మీరే చెప్పండి, సత్యం వైపునకు మార్గం చూపేవాడా విధేయతకు ఎక్కువ

అర్హుడు? లేక తనకు ఎవడైనా మార్గం చూపితే తప్ప స్వయంగా మార్గాన్ని పొందలేనివాడా? అసలు మీకేమయింది, ఇటువంటి తలకిందులు నిర్ణయాలు చేస్తున్నారు?" *(ఖుర్ఆన్- 10వ అధ్యాయం,34, 35 వచనాలు)*

ఈ ముష్రిక్కులు ఇలా అంటారు: "అల్లాహ్ కోరి ఉన్నట్లయితే మేముగానీ మా తాత ముత్తాతలుగానీ ఆయనను తప్ప మరెవ్వరినీ ఆరాధించి ఉండేవారము కాదు. ఆయన ఆజ్ఞ లేకుండా ఏ వస్తువునూ నిషేధించి ఉండేవారము కూడా కాదు." ఇటువంటి సాకులనే వారికి పూర్వం వారు కూడా చెప్పేవారు. అయితే విషయాన్ని స్పష్టంగా అందజేసే బాధ్యత తప్ప మరొక బాధ్యత కూడా ప్రవక్తలపై ఏదైనా ఉందా? మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము: "అల్లాహ్‌ను ఆరాధించండి. మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి." దాని తరువాత అల్లాహ్ వారిలో కొందరికి సన్మార్గాన్ని ప్రసాదించాడు. మరికొందరిని అపమార్గం లోగొన్నది. కొంచెం భువిలో సంచారం చేసి చూడండి, తిరస్కారులకు ఏ గతి పట్టిందో." *(ఖుర్ఆన్- 16వ అధ్యాయం,35, 36 వచనాలు)*

"సత్య విషయాన్ని మేము వారి ముందుకు తీసుకువచ్చాము. వారు అబద్ధం చెప్పేవారు అనటంలో ఏమాత్రం సందేహం లేదు. అల్లాహ్ ఎవరినీ తన సంతానంగా చేసుకోలేదు మరియు మరొక దేవుడెవ్వడూ ఆయనతో పాటు లేదు." *(ఖుర్ఆన్- 23వ అధ్యాయం, 90, 91 వచనాలు)*

ఓ ప్రవక్తా! ఇలా చెప్పు, "నేనైతే నా ప్రభువునే ప్రార్థిస్తాను, ఆయనకు భాగస్వాములుగా మరెవ్వరినీ నిలబెట్టను." ఇంకా ఇలా నొక్కి చెప్పు, "మీకు కష్టం కలిగించటం లేదా మీకు మేలు చెయ్యటం అనేది నా వశంలో లేదు." ఇలా చెప్పు, "నన్ను అల్లాహ్ పట్టు నుండి ఎవ్వరూ కాపాడలేరు. నాకు ఆయన తప్ప మరొక ఆశ్రయం కూడా లేదు. అయితే అల్లాహ్ మాటలను, ఆయన సందేశాలను అందజెయ్యటమే నా పని." ఇక ఎవరైనా సరే, అల్లాహ్, ఆయన ప్రవక్తల మాటలను విశ్వసించకపోతే, వారు నరకాగ్నికి గురి అవుతారు. అటువంటి వారు అందులోనే శాశ్వతంగా ఉంటారు."

*(ఖుర్ఆన్- 72వ అధ్యాయం, 20-23 వచనాలు)*

(ప్రవక్తా! ఇస్లాం తిరస్కారులతో) ఇలా చెప్పు : ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించేవాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే." *(ఖుర్ఆన్- 109వ అధ్యాయం, 1-6 వచనాలు)*

"ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు, అందరూ ఆయనపై ఆధారపడే వారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు."

*(ఖుర్ఆన్- 112వ అధ్యాయం, 1-4 వచనాలు)*

"మా సూచనలను తిరస్కరిస్తూ ఉన్నవారు చెవిటివారు, మూగవారు, చీకట్లో పడివున్నవారు. అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు. తాను కోరిన వారిని రుజుమార్గవర్తనులుగా చేస్తాడు. వారితో ఇలా అను: "కొంచెం ఆలోచించి చెప్పండి: ఎప్పుడైనా అల్లాహ్ తరఫు నుండి ఏదైనా పెద్ద ఆపద మీపై వచ్చిపడినప్పుడు లేదా చివరి ఘడియయే దాపురించినప్పుడు, మీరు అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినయినా పిలుస్తారా? చెప్పండి, మీరు సత్యవంతులే అయితే. అప్పుడు మీరు అల్లాహ్‌నే పిలుస్తారు. ఆయన గనక కోరితే ఆ ఆపదను మీపై నుండి తొలగిస్తాడు. అటువంటి సందర్భాలలో మీరు నిలబెట్టిన దైవత్వపు భాగస్వాములను మీరు మరచి పోతారు." మీకు పూర్వం అనేక జాతుల వద్దకు మేము ప్రవక్తలను పంపాము. ఆ జాతులను మేము కష్టాలకు, కడగండ్లకు గురిచేశాము, వారు మా ముందు వినయంతో తలవంచాలని. *(ఖుర్ఆన్- 6వ అధ్యాయం, 39-42 వచనాలు)*

ప్రవక్తా! వారితో ఇలా అను: "అల్లాహ్‌ను కాక మీరు వేడుకునే ఇతరులకు దాస్యం చెయ్యటం నాకు నిషేధించబడింది." ఇలా అను : "నేను మీ కోరికలను అనుసరించను. అలా చేసినట్లయితే, నేను మార్గభ్రష్టుడనయిపోతాను. సన్మార్గం పొందిన వారిలో ఉండను." *(ఖుర్ఆన్- 6వ అధ్యాయం, 56వ వచనం)*

"ప్రవక్తా! వారిని ఇలా అడుగు : అల్లాహ్‌ను వదలిపెట్టి, మాకు లాభంకానీ, నష్టంకానీ కలిగించలేని వారిని మేము వేడుకోవాలా? అల్లాహ్ మాకు రుజుమార్గం చూపిన తరువాత మేము ముందుకు వేసిన అడుగును వెనక్కి తిప్పుకోవాలా? షైతానులు ఎడారిలో దారి తప్పించగా సహచరులు 'ఇటు రా, సరైన మార్గం ఇక్కడుంది' అని పిలుస్తూ ఉన్నప్పటికీ గాభరాపడి కలవర పాటుతో తిరుగాడేవాని స్థితి మాదిరిగానే మేము మా స్థితిని కూడా చేసు కోవాలా? వారితో ఇలా అను : "వాస్తవానికి, నిజమైన మార్గదర్శకత్వం కేవలం అల్లాహ్ మార్గదర్శకత్వమే. ఆయన నుండి మాకు ఈ ఆజ్ఞ అందజేయబడింది." *(ఖుర్‌ఆన్- 6వ అధ్యాయం, 71వ వచనం)*

"ప్రవక్తా! వారితో ఇలా అను: "అల్లాహ్‌ను కాదని మీరు వేడుకుంటున్న వారి ఆరాధన చేయకూడదని నన్ను వారించటం జరిగింది. నా ప్రభువు వైపు నుండి నా వద్దకు స్పష్టమైన సూచనలు వచ్చాయి (నేను ఈ పనిని ఎలా చేయగలను). సకల లోకాల ప్రభువుకు విధేయత చూపాలని నేను ఆజ్ఞాపించబడ్డాను." *(ఖుర్‌ఆన్- 40 అధ్యాయం, 66వ వచనం)*

"ఆయన మిమ్మల్ని మట్టితో సృజించాడు, ఆపై రేతస్సుతో, తరువాత నెత్తుటి ముద్దతో- ఆ పిదప ఆయన మిమ్మల్ని శిశువు రూపంలో బయటికి తీస్తాడు. తదనంతరం మీరు పూర్తి బలం పుంజుకునే వరకు మిమ్మల్ని పోషిస్తాడు. ఆ పిమ్మట మీరు ముదిమికి చేరుకునేవరకు, మిమ్మల్ని పెంచుతాడు. మీలో కొందరు ముందే పిలువబడతారు. మీరు మీ నిర్ణీత వ్యవధికి చేరి యధార్థం ఏమిటో అర్థం చేసుకోవాలని ఇదంతా చేయబడుతోంది."

*(ఖుర్‌ఆన్- 40 అధ్యాయం, 67వ వచనం)*

"ముహమ్మద్! ఇలా ప్రకటించు: "మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను – అతను అల్లాహ్‌ను, ఆయన సూక్తులను

విశ్వసిస్తాడు – అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారేమో." *(ఖుర్ఆన్– 7 అధ్యాయం, 158వ వచనం)*

"ప్రవక్తా! నీవు, నీ వద్దకు వహీ ద్వారా పంపబడుతూ వున్న హితబోధను అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తీర్పు చేసే వరకు ఓర్పు వహించు. ఆయన మాత్రమే ఉత్తమంగా తీర్పు చేసేవాడు."

*(ఖుర్ఆన్– 10 అధ్యాయం, 109వ వచనం)*

"ప్రవక్తా! ఇలా ప్రకటించు: అల్లాహ్‌కు అబద్ధాలను అంటగట్టేవారు ఎన్నటికీ సాఫల్యాన్ని పొందలేరు. కొన్ని రోజులు ఇహలోక జీవితంలో సుఖాలను అనుభవించవచ్చుకానీ తరువాత మా వైపునకే వారు మరలి రావాలి. అప్పుడు మేము వారి అవిశ్వాసానికి ప్రతిఫలంగా వారికి కఠిన బాధను రుచి చూపిస్తాము." *(ఖుర్ఆన్– 10 అధ్యాయం, 69, 70వ వచనాలు)*

"...చూడు! అల్లాహ్‌తో పాటు మరొకరిని ఆరాధ్యుడుగా చేసుకోకు. అలా చేస్తే నిందలపాలవుతావు. ప్రతి మేలుకు దూరమవుతావు. నరకంలో పడవెయ్యబడతావు." *(ఖుర్ఆన్– 10వ అధ్యాయం, 39వ వచనం)*

"స్పష్టంగా ఇలా ప్రకటించు : "ఇది సత్యం మీ ప్రభువు నుండి వచ్చింది. ఇష్టమైన వారు దానిని స్వీకరించనూవచ్చు, ఇష్టంకాని వారు దానిని తిరస్కరించనూవచ్చు." మేము (సత్యాన్ని తిరస్కరించే) దుర్మార్గుల కొరకు ఒక అగ్నిని సిద్ధపరచి ఉంచాము, దాని జ్వాలలు వారిని చుట్టుముట్టుతాయి. అక్కడ వారు గనుక మంచినీళ్లు అడిగితే, నూనె, మడ్డిలాంటి నీటితో వారిని సత్కరించటం జరుగుతుంది. అది వారి ముఖాలను మాడుస్తుంది. అది ఎంత జుగుప్సాకరమైన పానీయం! అది ఎంత నికృష్టమైన విశ్రాంతి స్థలం! ఇక విశ్వసించి సత్కార్యాలు చేసేవారి విషయం – మేము నిశ్చయంగా వారి ప్రతిఫలాన్ని వృధాచేయము. వారికై నిత్య హరితవనాలు ఉన్నాయి; వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి; అక్కడ వారు బంగారు కంకణాలను ధరిస్తారు; ఆకు పచ్చని సన్నని జలతారు పట్టువస్త్రాలను ధరిస్తారు; ఎత్తయిన

ఆసనాలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. అది ఎంత శ్రేష్ఠమైన ప్రతిఫలం! అది ఎంత మహోన్నతమైన నివాస స్థలం!

*(ఖుర్ఆన్- 18వ అధ్యాయం, 29-31 వచనాలు)*

వారిలో ఎవరైనా, "అల్లాహ్‌తో పాటు, నేను కూడా ఒక దేవుడినే" అని అంటే, అతనికి మేము నరక శిక్ష విధిస్తాము. దుర్మార్గులకు మా వద్ద లభించే ప్రతిఫలం ఇదే." *(ఖుర్ఆన్- 21వ అధ్యాయం, 29వ వచనం)*

ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము. వారితో ఇలా అను, "నా వద్దకు వచ్చే వహీ ఏమిటంటే, మీ దేవుడు కేవలం ఒక్కడే. ఇకనైనా మీరు విధేయులవుతారా?"

*(ఖుర్ఆన్ -21వ అధ్యాయం, 107, 108 వచనాలు)*

వారు అల్లాహ్‌ను ఇలా వేడుకుంటారు: "ప్రభూ! మేము విశ్వసించాము. మా తప్పులను మన్నించు. మమ్మల్ని నరక జ్వాలల నుండి కాపాడు." వారు సహనశీలురు, సత్యసంధులు, విధేయులు, దానపరులు, క్షమించు అని రాత్రి చివరి ఘడియలలో అల్లాహ్‌ను వేడుకుంటారు. తాను తప్ప మరొక దైవం లేడు అనే సత్యానికి స్వయంగా అల్లాహ్‌యే సాక్ష్యమిస్తాడు. దైవదూతలు, సమస్త జ్ఞానులు కూడా ఆ మహాశక్తిమంతుడూ, ఆ మహాజ్ఞానీ తప్ప వాస్తవానికి మరొక దైవం లేడు అని నిజాయితీగానూ, న్యాయంగానూ సాక్ష్యమిస్తారు."

*(ఖుర్ఆన్- 3వ అధ్యాయం, 16-18 వచనాలు)*

ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: "రండి! మీకు వినిపిస్తాను, మీ ప్రభువు మీపై విధించిన కట్టుబాట్లు ఏమిటో - ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చెయ్యరాదు. తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి. పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము. వారికీ ఇస్తాము. అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి, బహిరంగమైనవైనా సరే లేక గోప్యమైనవైనా సరే. సత్యంతో తప్ప అల్లాహ్ పవిత్రంగా నిర్ణయించిన ఏ ప్రాణాన్నీ హతమార్చకండి, ఈ విషయాలనే పాటించమని ఆయన మీకు ఉపదేశించాడు, బహుశా మీరు ఆలోచించి పని చేస్తారని."

*(ఖుర్ఆన్- 6వ అధ్యాయం, 151వ వచనం)*

ఎడతెగకుండా అకృత్యాలు చేస్తూవుండి, "ఇప్పుడు నేను పశ్చాత్తాప పడు తున్నాను" అని అనేవారి పశ్చాత్తాపం ఎంతమాత్రం స్వీకరించబడదు. ఇదే విధంగా, మరణించేవరకు అవిశ్వాసులుగానే ఉండేవారి పశ్చాత్తాపం కూడా స్వీకరించబడదు. అటువంటి వారి కొరకు మేము అత్యంత బాధాకరమైన శిక్షను సిద్ధంచేసి ఉంచాము. *(ఖుర్‌ఆన్- 4వ అధ్యాయం, 18వ వచనం)*

## ఇస్లాంలో మానవ శ్రేయస్సుకై అనుసరించవలసిన సదాచారాలు

"ఈ కారణం వల్లనే మేము ఇస్రాయీలు సంతతికి ఈ ఫర్మానాను వ్రాసి ఇచ్చాము: "హత్యకు బదులుగాగాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." కాని వారి పరిస్థితి ఎలా ఉందంటే, మా ప్రవక్తలు ఒకరి తరువాత ఒకరు స్పష్టమైన ఉపదేశాలు తీసుకుని వారి వద్దకు వచ్చినప్పటికీ, వారిలోని ఎక్కువ మంది భూమిపై అత్యాచారాలు చేసేవారే."
*(ఖుర్‌ఆన్- 5వ అధ్యాయం, 32వ వచనం)*

"విశ్వసించిన ప్రజలారా! మీ ఇళ్ళల్లోకి తప్ప ఇతరుల ఇళ్లల్లోకి ప్రవేశించకండి, ఇంటి వారి అంగీకారం పొందనంత వరకు, ఇంటి వారికి సలామ్ చేయనంత వరకు. ఈ పద్ధతి మీకు ఎంతో ఉత్తమమైనది. దీనిని మీరు పాటిస్తారని ఆశించబడుతోంది." *(ఖుర్‌ఆన్- 24వ అధ్యాయం, 27వ వచనం)*

"మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో మీ స్త్రీ పురుష బానిసలలో ఎవరు గుణవంతులో, వారి వివాహాలు చేసివేయండి. వారు గనక పేదవారయితే, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేస్తాడు. అల్లాహ్ అంతులేని వనరులు కలవాడు. సర్వమూ తెలిసినవాడు."
*(ఖుర్‌ఆన్ -24వ అధ్యాయం, 32వ వచనం)*

"ఒకవేళ విశ్వాసులలోని రెండు వర్గాలవారు పరస్పరం పోట్లాడుకుంటే, వారి మధ్య రాజీ కుదిరించండి. తరువాత, వారిలో ఒక వర్గం వారు రెండో వర్గం

వారిపై దౌర్జన్యం చేస్తే, దౌర్జన్యం చేసినవారు అల్లాహ్ ఆజ్ఞ వైపునకు మరలే వరకు వారికి వ్యతిరేకంగా పోరాడండి. తరువాత వారు గనక మరలివస్తే, వారి మధ్య రాజీ కుదర్చండి. న్యాయం చేయండి. ఎందుకంటే, అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు. విశ్వాసులు పరస్పరం అన్నదమ్ములు. కనుక మీ మధ్య సంబంధాలను సంస్కరించండి. అల్లాహ్‌కు భయపడండి, మీపై దయ చూపటం జరగవచ్చు.

*(ఖుర్‌ఆన్- 49వ అధ్యాయం, 9-10వ వచనం)*

విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠురాండ్రయి ఉండవచ్చు. ఒకరినొకరు ఎత్తిపొడుచుకోకండి, ఒకరినొకరు చెడ్డ పేర్లతో పిలుచుకోకండి. విశ్వసించిన తరువాత చెడ్డతనంలో పేరు సంపాదించడం చాలా నీచమైన విషయం. ఈ వైఖరిని మానుకోనివారే దుర్మార్గులు. *(ఖుర్‌ఆన్- 49వ అధ్యాయం, 11వ వచనం)*

"విశ్వాసులారా! అతిగా అనుమానించడం మానివేయండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి. గూఢచారులుగా వ్యవహరించకండి. మీలో ఎవరూ ఎవరినీ పరోక్షంగా నిందించరాదు. మీలో ఎవరైనా మీ మృత సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా? చూడండి, మీరే స్వయంగా దీనిని అసహ్యించుకుంటారు. అల్లాహ్‌కు భయపడండి, అల్లాహ్ అత్యధికంగా పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడూను."

*(ఖుర్‌ఆన్- 49వ అధ్యాయం, 9- 12 వచనాలు)*

"విశ్వాసులారా! శుక్రవారంనాడు నమాజుకై పిలిచినప్పుడు, అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి క్రయవిక్రయాలను వదలిపెట్టండి. మీరు గ్రహించ గలిగితే, ఇదే మీకు అత్యంత శ్రేయస్కరమైనది."

*(ఖుర్‌ఆన్- 62వ అధ్యాయం, 9వ వచనం)*

"విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది - ఏ విధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడా విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది."

*(ఖుర్‌ఆన్- 2వ అధ్యాయం, 183వ వచనం)*

"చెడ్డ పని చేసినవాడు లేదా తన ఆత్మకు అన్యాయం చేసుకున్నవాడు తరువాత క్షమాభిక్ష పెట్టు అని అల్లాహ్‌ను అర్థిస్తే, అతడు అల్లాహ్‌ను క్షమించేవాడుగా, కరుణామయుడుగా తెలుసుకుంటాడు." *(ఖుర్ఆన్- 4వ అధ్యాయం, 110వ వచనం)*

"వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేసేవారు, కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు - ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం."

*(ఖుర్ఆన్- 3వ అధ్యాయం,134వ వచనం)*

"అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. పరస్పరం కలహించు కోకండి. అలా జరిగితే మీలో బలహీనత ప్రవేశిస్తుంది, మీ శక్తి సన్నగిల్లి పోతుంది. సహనంతో మెలగండి. నిశ్చయంగా అల్లాహ్ సహనం చూపేవారితో ఉంటాడు." *(ఖుర్ఆన్- 8వ అధ్యాయం, 46వ వచనం)*

## ఇస్లాంలో ఆదర్శవంతమైన న్యాయం

ఇస్లాంలో న్యాయవ్యవస్థ సర్వోన్నతంగా ఉంది. ఇస్లాంలో శత్రువుల పట్ల సయితం ఖచ్చితమైన న్యాయం చెయ్యమనే ఆదేశం ఉంది, అది సర్వోన్నత న్యాయాన్ని ప్రతిపాదిస్తుంది. దీనిని ఈ క్రింద పొందుపరచిన వచనాల్లో చూడండి.

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సమానమైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు."

*(ఖుర్ఆన్- 5వ అధ్యాయం, 8వ వచనం)*

"విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలవండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రు లకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే

ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని."

*(ఖుర్‌ఆన్- 4వ అధ్యాయం, 135వ వచనం)*

**ఇస్లాంలో ముస్లిమేతరుల పట్ల దౌర్జన్యం చేయమనే ఆదేశాలున్నాయంటూ అపవాదు వేయబడుతూ ఉంది. కాని ముస్లిమేతరులతో కాదు గదా శత్రువుల పట్ల కూడా దౌర్జన్యం చేయకూడదని ఉంది ఇస్లాంలో. చూడండి.**

"మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు."

*(ఖుర్‌ఆన్- 2వ అధ్యాయం, 190వ వచనం)*

*ఇస్లాంలో ఏ నిరపరాధినీ హత్య చేసే అనుమతి లేదు. అలా చేసే వారికి శిక్ష రక్తానికి బదులు రక్తం. అయితే ఈ శిక్ష కేవలం హంతకునికి మాత్రమే వేయాలి. అందులో కూడా హద్దులు మీరకూడదు. దీనినే సరైన న్యాయం అంటారు. ఈ క్రింద ఇవ్వబడిన అల్లాహ్ ఆదేశాలను కాస్త చూడండి :*

"ఏ ప్రాణాన్నీ హతమార్చకండి న్యాయంగా తప్ప. దానిని హతమార్చడాన్ని అల్లాహ్ నిషేధించాడు. అన్యాయంగా హత్య చేయబడిన మనిషి వారసునికి మేము "ఖిసాస్"ను కోరే హక్కును ప్రసాదించాము. కాని ఆ వారసుడు హత్యలో హద్దులు మీరకుండా ఉండాలి."

*(ఖుర్‌ఆన్- 17వ అధ్యాయం, 33వ వచనం)*

"విశ్వసించిన ప్రజలారా! హత్యా వ్యవహారాలలో మీ కొరకు ప్రతీకార న్యాయం నిర్ణయించబడింది. హత్య చేసిన వ్యక్తి స్వతంత్రుడయితే, ఆ స్వతంత్రుణ్ణే శిక్షిం చాలి. బానిస అయితే ఆ బానిసనే వధించాలి. స్త్రీ అయితే ఆ స్త్రీనే చంపాలి. ఒకవేళ హతుని సోదరుడు హంతకుణ్ణి కనికరించదలిస్తే, న్యాయసమ్మతంగా రక్తశుల్క నిర్ణయం జరగాలి. హంతకుడు రక్తధనాన్ని ఉత్తమ రీతిలో అతనికి చెల్లించాలి. ఇది మీ ప్రభువు నుండి మీకు లభించే సౌకర్యం, కారుణ్యం. దీని తరువాత కూడా ఈ హద్దులను అతిక్రమించేవారు ఘోరశిక్షకు గురి అవుతారు." *(ఖుర్‌ఆన్- 2వ అధ్యాయం, 178వ వచనం)*

"బుద్ధిజ్ఞానంగల ఓ మానవులారా! ఈ ప్రతీకార న్యాయంలో మీ సమాజానికి ఊపిరి, ఈ శాసనోల్లంఘనానికి మీరు దూరంగా ఉంటారని ఆశించబడుతోంది." *(ఖుర్ఆన్- 2వ అధ్యాయం, 179వ వచనం)*

"కాని మరణ శాసనం చేసిన వ్యక్తి, తెలియకపోవటంవల్లనో లేక బుద్ధిపూర్వకంగానో అన్యాయం చేశాడనే అనుమానం ఎవరికైనా కలిగితే, వారు ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న వారందరి మధ్య రాజీ కుదిరిస్తే, అందులో ఏమాత్రం దోషం లేదు. అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను."

*(ఖుర్ఆన్- 2వ అధ్యాయం, 182వ వచనం)*

"దొంగ – స్త్రీ అయినా, పురుషుడైనా, ఉభయుల చేతులూ నరకండి. ఇది వారి సంపాదనకు ప్రతిఫలం. అల్లాహ్ తరఫు నుండి గుణపాఠం నేర్పే శిక్ష. అల్లాహ్ సర్వశక్తిమంతుడు, అత్యంత వివేక సంపన్నుడు."

*(ఖుర్ఆన్- 5వ అధ్యాయం, 38వ వచనం)*

"విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం మీకు ధర్మసమ్మతం కాదు. ఇంకా, వారిని వేధించి సాధించి మీరు వారికి ఇచ్చిన 'మహర్'లో కొంత భాగాన్ని కాజేసే ప్రయత్నం చెయ్యటం కూడా ధర్మసమ్మతం కాదు. అయితే వారు గనక బాహాటంగా చెడు నడతకు పాల్పడినట్లయితే, (అప్పుడు వారి పట్ల కఠినంగా ప్రవర్తించే అధికారం మీకు ఉంది). వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు." *(ఖుర్ఆన్- 4వ అధ్యాయం, 19వ వచనం)*

"తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది – అది తక్కువైనా సరే లేక ఎక్కువైనా సరే. ఈ భాగం (అల్లాహ్‌చే) నిర్ణయించబడింది."

*(ఖుర్ఆన్- 4వ అధ్యాయం, 7వ వచనం)*

**ఇస్లాం సర్వోన్నత న్యాయవ్యవస్థ కారణంగానే ఇస్లామీయ దేశాల్లో (ఈ వ్యవస్థ అమలవుతున్న చోట) హత్య, దారిదోపిడి, బలాత్కారం, వ్యభిచారం, దొంగతనం**

**మొదలగు నేరాలు జరుగవు. దుబాయ్, ఈరాన్, ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్ మొదలగు ముస్లిం దేశాలలో శుక్రవారం నమాజు అజాన్ అవుతూనే దుకాణదారులు వారి వారి దుకాణాల్లో కోట్లాది రూపాయల విలువైన క్వింటాళ్ళకొద్ది బంగారాన్ని ఇట్టే వదలి నమాజ్ చదవటానికి వెళ్ళిపోతారు. అంగళ్ళలో ఎవరూ లేకపోయినప్పటికీ అక్కడ ఎలాంటి దొంగతనం జరుగకపోవడం చూసి ప్రపంచ ప్రజలు ఆశ్చర్య చకితులవుతారు.**

**ఈనాడు ప్రపంచంలో యువకులను నల్లమందుతో తయారైన మత్తుమందులు కాటేస్తున్నాయి. ఇస్లామీయ న్యాయ ప్రణాళిక అమలవుతున్న దేశాలు ఈ సామాజిక చెడులకు దూరంగా ఉన్నాయి. ఇది ఇస్లామీయ న్యాయవ్యవస్థ మహత్యమే.**

## ఇస్లాంలో ప్రపంచ సర్వోన్నత న్యాయ వ్యావహారిక ఆదర్శం

ఈ ఖుర్ఆన్ సూక్తిని చూడండి:

"సత్కార్యం అంటే, మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే, మనిషి అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ, దైవ దూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకూ, అనాథుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకూ, ఖైదీలను విడుదల చెయ్యటానికి[1] వ్యయ పరచటం. ఇంకా నమాజును స్థాపించటం, జకాత్ ఇవ్వటం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారూ, కష్టకాలంలో, లేమిలో, సత్యానికీ అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థయిర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ పట్ల భయభక్తులు కలవారు వీరే." *(ఖుర్ఆన్ - 2వ అధ్యాయం, 177వ వచనం)*

"మీలో మీరు ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి.

---

*1. ఇక్కడ ఖైదీలను విడుదల చెయ్యడమంటే బానిసలను కొని వారిని స్వతంత్రులుగా చేయడం.*

బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంత భాగం కాజేసే అవకాశం లభిస్తుందేమో అనే దురుద్దేశ్యంతో దానిని న్యాయనిర్ణేతల వద్దకు తీసుకునిపోకండి. " *(ఖుర్‌ఆన్– 2వ అధ్యాయం, 188వ వచనం)*

"మీరు మీ దానధర్మాలను బహిరంగంగా చేసినా మంచిదే. కాని రహస్యంగా నిరుపేదలకు దానమివ్వటం మీకు ఎక్కువ మేలు చేకూరుస్తుంది. మీ దుష్కార్యాలు ఎన్నో దీనివల్ల సమసిపోతాయి. మీరు ఏమి చేసినా అది అల్లాహ్‌కు తెలుస్తుంది." *(ఖుర్‌ఆన్– 2వ అధ్యాయం, 271వ వచనం)*

"అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు. దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు. కృతఘ్నుడూ, దుష్టుడూ అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు."
*(ఖుర్‌ఆన్– 2వ అధ్యాయం, 276వ వచనం)*

"విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే, అల్లాహ్‌కు భయపడండి, ఇంకా మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచిపెట్టండి. కాని ఒకవేళ మీరు అలా చెయ్యకపోతే, మీపై అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరఫు నుండి యుద్ధ ప్రకటన ఉంది అనే విషయం తెలుసుకోండి. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడితే (వడ్డీని వదులుకుంటే) అసలు సొమ్ము తీసుకోవటానికి హక్కుదారులవుతారు. మీరూ అన్యాయం చెయ్యకూడదు, మీకూ అన్యాయం జరగకూడదు. మీ బాకీదారుడు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే, అతని పరిస్థితి మెరుగుపడే వరకు గడువు ఇవ్వండి. లేక మీరు తెలిసినవారే అయితే, ఆ బాకీని అతనికి దానం చెయ్యండి. అది మీకు ఎక్కువ శ్రేయస్కరం. అల్లాహ్ వద్దకు మీరు మరలి వెళ్ళే రోజున జరిగే పరాభవం నుండి, కలిగే ఆపద నుండి రక్షించుకోండి. అక్కడ ప్రతి ఒక్కడికీ అతడు చేసిన మంచి చెడ్డలకు పరిపూర్ణ ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఏమాత్రం అన్యాయం జరగదు." *(ఖుర్‌ఆన్– 2వ అధ్యాయం, 278–281వ వచనాలు)*

"అనాథుల ఆస్తిని అన్యాయంగా తినేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటారు. వారు తప్పకుండా మండే నరకాగ్నిలో త్రోయబడతారు."
*(ఖుర్‌ఆన్– 4వ అధ్యాయం, 10వ వచనం)*

"అనాథుల ఆస్తిని వారికి తిరిగి ఇవ్వండి. వారి మంచి వస్తువులను మీ చెడ్డ వస్తువులతో మార్చకండి. వారి ఆస్తిని మీ ఆస్తితో కలిపి కబళించకండి. ఇది మహాపాపం." *(ఖుర్ఆన్- 4వ అధ్యాయం, 2వ వచనం)*

"అనాథుల ఆస్తి దరిదాపులకు పోకండి, ఉత్తమమైన రీతిలో తప్ప - వారు యుక్త వయస్సుకు చేరే వరకు. కొలతలో, తూనికలో పూర్తి న్యాయం చెయ్యండి. మేము ప్రతి మనిషిపైనా అతని శక్తి మేరకే బాధ్యతా భారాన్ని మోపుతాము. పలికితే న్యాయమే పలకండి, వ్యవహారం మీ బంధువులకు సంబంధించినది అయినా సరే. అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడికను నెరవేర్చండి. ఈ మాటలను అల్లాహ్ మీకు ఉపదేశిస్తున్నాడు, బహుశా మీరు హితబోధను స్వీకరిస్తారేమో అని." *(ఖుర్ఆన్- 6వ అధ్యాయం, 152వ వచనం)*

"ఈ జకాత్ నిధులు అసలు కేవలం నిరుపేదలకు, అక్కరలు తీరని వారికీ, జకాత్ వ్యవహారాలకై నియుక్తులైన వారికీ, ఇంకా ఎవరి హృదయాలను గెలుచుకోవటం అవసరమో వారికీ, ఇంకా బానిసల విముక్తికీ, రుణగ్రస్తుల సహాయానికీ, దేవుని మార్గంలోనూ, బాటసారుల ఆతిథ్యానికీ వినియోగించటం కొరకు. ఇది అల్లాహ్ తరఫు నుండి నిర్ణయించబడిన ఒక విధి. అల్లాహ్ అన్నీ ఎరిగినవాడూ, వివేకవంతుడూను."

*(ఖుర్ఆన్- 9వ అధ్యాయం, 60వ వచనం)*

"సక్రమమైన పద్ధతిలో తప్ప అనాథుని సొమ్ము జోలికి పోకండి, అతడు యుక్త వయస్సునకు చేరే వరకు. చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నిస్సందేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది. కొలపాత్రతో ఇస్తే, పూర్తిగా నింపి ఇవ్వండి, తూచినట్లయితే సరైన తరాజుతో తూచండి. ఇది మంచి పద్ధతి. పర్యవసానాన్నిబట్టి కూడా ఇదే ఉత్తమం. మీకు తెలియని విషయం వెంట పడకండి. నిశ్చయంగా కళ్ళూ, చెవులూ, మనస్సూ అన్నింటి విషయంలోనూ విచారణ జరుగుతుంది. భూమిపై విర్రవీగుతూ నడవకండి. మీరు భూమిని చీల్చనూ లేరు, పర్వతాల ఎత్తుకు చేరనూలేరు. ఈ ఆజ్ఞలలో ఏ ఒక్కదానిని అతిక్రమించినా అది నీ ప్రభువునకు అయిష్టమైనది." *(ఖుర్ఆన్- 17వ అధ్యాయం, 34-38వ వచనాలు)*

"ప్రవక్తా! ఇలా అను, "మానవులారా! నేను మీకు కేవలం (కష్టకాలం రాకముందు) స్పష్టంగా హెచ్చరించే వ్యక్తిని మాత్రమే." కనుక విశ్వసించి మంచి పనులు చేసేవారికి క్షమాభిక్ష లభిస్తుంది, గౌరవప్రదమైన ఉపాధి కూడా లభిస్తుంది. మా ఆయతులను (వచనాలను) కించపరచటానికి ప్రయత్నం చేసే వారు నరకానికి మిత్రులు." *(ఖుర్ఆన్- 22వ అధ్యాయం, 49-51వ వచనాలు)*

"కొలపాత్రలను పూర్తిగా నింపండి, ఎవరికీ తక్కువ చేసి ఇవ్వకండి. సరియైన తరాజుతో తూయండి. ప్రజలకు వారి వస్తువులను తక్కువ చేసి ఇవ్వకండి. భూమిపై కల్లోలాన్ని వ్యాపింపజేస్తూ తిరగకండి; మిమ్మల్నీ, మీకు పూర్వం తరాల వారినీ సృష్టించిన ఆయనకు భయపడండి."

*(ఖుర్ఆన్- 26వ అధ్యాయం, 181-184వ వచనాలు)*

"ప్రజలను దెప్పిపొడవటంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచటంలో ఆసక్తి కనబరచేవాడూ, ధనాన్ని కూడబెట్టి దానిని మాటిమాటికీ లెక్కబెట్టి ఉంచేవాడూ అయిన ప్రతి వ్యక్తీ సర్వనాశనమవుతాడు. అతడు తన ధనం తన వద్ద కలకాలం ఉంటుందని అనుకుంటున్నాడు. అలా ఎన్నటికీ జరుగదు. అతడు నుజ్జు నుజ్జు చేసే స్థలంలో విసరివేయబడతాడు. అలా నుజ్జు నుజ్జుగా చేసే స్థలం ఏమిటో నీకు తెలుసా? అది తీవ్రంగా ప్రజ్వరిల్లంపజేయబడిన దైవాగ్ని. అది గుండెల దాకా చొచ్చుకుపోతుంది. అందులో వారు పడిన తరువాత అది మూసివేయబడుతుంది. ఆ విధంగా వారు పొడుగాటి అగ్ని కీలల మధ్య (చిక్కుకుని ఉంటారు)."

*(ఖుర్ఆన్- 104వ అధ్యాయం, 1-9వ వచనాలు)*

"పరలోక శిక్షను, బహుమానాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా? అతడే అనాథులను కసరికొట్టేవాడు, పేదవాళ్ళకు అన్నం పెట్టమని ప్రోత్సహించని వాడు. పోతే, తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహించేవారు, ప్రదర్శనా బుద్ధితో వ్యవహరించేవారు, వాడుకునే మామూలు వస్తువులను (ప్రజలకు) ఇవ్వటానికి వెనుకాడేవారు సర్వనాశనమవుతారు."

*(ఖుర్ఆన్- 107వ అధ్యాయం, 1-7వ వచనాలు)*

"ఇలా అను: నేను ఉదయం ప్రభువు శరణు కోరుతున్నాను - ఆయన

సృష్టించిన ప్రతిదాని కీడు నుండి, కమ్ముకునే చీకటి రాత్రి కీడు నుండి, అసూయపరుడు అసూయ పడేటప్పటి కీడు నుండి" (ఖుర్ఆన్- అధ్యాయం 113, వచనం 1-5)

"ఇలా అను : నేను మానవుల ప్రభువు మానవుల చక్రవర్తి మానవుల ఆరాధ్య దైవం అయిన (అయిన అల్లాహ్) శరణు కోరుతున్నాను. దుష్టభావాలు రేకెత్తించే వాడి కీడు నుండి వాడు మాటిమాటికీ మరలివస్తూ ప్రజల మనసుల్లో దుష్టభావాలను రేకెత్తిస్తాడు. వాడు జిన్నాతు జాతికి చెందినవాడైనా కావచ్చు. లేదా మానవ జాతికి చెందినవాడైనా కావచ్చు." (ఖుర్ఆన్- అధ్యాయం 114, వచనం 1-6)

"ముడులపై మంత్రించే వారి కీడు నుండి, అసూయాపరుడు అసూయపడే టప్పటి కీడు నుండి." *(ఖుర్ఆన్ 113వ అధ్యాయం, 1-5వ వచనం)*

"ఇలా అను: నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్య దైవం (అయిన అల్లాహ్) శరణుకోరుతున్నాను - దుష్టభావాలు రేకెత్తించేవాడి కీడునుండి. వాడు మాటిమాటికీ మరలి వస్తూ ప్రజల మనస్సుల్లో దుష్ట భావాలను రేకెత్తిస్తాడు, వాడు జిన్నాతు జాతికి చెందినవాడైనా కావచ్చు లేదా మానవ జాతికి చెందినవాడైనా కావచ్చు."

*(ఖుర్ఆన్- 114వ అధ్యాయం, 1-6వ వచనం)*

## ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి ప్రవచనాలు

**ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సఅసం) వారి జీవిత చరిత్ర, వారి ప్రవచనాలు, వారి సాంప్రదాయాలు మరియు ఖుర్ఆన్‌లోని అల్లాహ్ ఆదేశాల పేరే ఇస్లాం.**

**మనం ఖుర్ఆన్‌లోని అల్లాహ్ ఆదేశాలను చూశాం. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) గారి జీవిత చరిత్రను చూశాం. ఇప్పుడు దైవ సందేశహరులు ముహమ్మద్ (సఅసం) వారి ప్రవచనాలను చూడండి.**

(హదీసు) గ్రంథాలన్నిటిలో కంటే ప్రామాణికమైనవి "బుఖారీ షరీఫ్", "ముస్లిం షరీఫ్." ఈ క్రింద ఇవ్వబడిన హదీసులు (ప్రవచనాలు) వీటి నుండి సంగ్రహిం పబడినవే.

దైవప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖించారు: "మీ సోదరునికి సహాయం చెయ్యండి. అతడు దౌర్జన్యపరుడయినా,

దౌర్జన్యానికి గురయినవాడయినా సరే." అందుకు వారు, "ప్రవక్తా! దౌర్జన్యానికి గురయిన వాడికైతే మేము సహాయం చేయగలం. కాని దౌర్జన్యపరునికి ఎలా సహాయం చేయాలి? అని అడిగినప్పుడు, (దౌర్జన్యం చెయ్యకుండా) అతని చేతులను పట్టి ఆపండి. (బుఖారీ షరీఫ్- 1046) అన్నారు ప్రవక్త(సఅసం).

హజ్రత్ ముహమ్మద్ (సఅసం)సెలవిచ్చారని హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖించారు: "ఏ వ్యక్తి అయితే ఇతరులపై (కరుణ (దయ) చూపడో) (దైవం) అతనిపై కరుణ చూపడం జరుగదు." (బుఖారీ షరీఫ్- 1674)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖించారు: హజ్రత్ ముహమ్మద్ (సఅసం) తిట్లు, శాపనార్థాలు, అశ్లీల పదజాలం అంటే ఏమిటో ఎరుగరు. ఆయన మాపై తమ కోపాన్ని, అయిష్టాన్ని ప్రదర్శించేటప్పుడు (మహా అయితే) "ఇతని నొసటికి మట్టి అంటా! ఏమైంది ఇతనికి" అని మాత్రం అనేవారు. (బుఖారీ షరీఫ్ - 1681)

హజ్రత్ ఇబ్నె- ఉమర్(రజి) ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు, "ఒక ముస్లిం ఇతరులను అధర్మంగా హత్య చేయనంత వరకూ, అతని ధర్మంలో విస్తృతి, అభివృద్ధి జరుగుతూనే ఉంటుంది." (బుఖారీ షరీఫ్- 1693)

హజ్రత్ ఇబ్నె- అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: 'దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు, "అన్ని ప్రాణులలోకెల్లా అల్లాహ్ దృష్టిలో ముగ్గురు వ్యక్తులు చెడ్డవారు. పవిత్ర మక్కాలో దౌర్జన్యం చేసేవాడు, ఇస్లాంలో అజ్ఞానపు పోకడలను అనుసరించేవాడు, మూడవ వ్యక్తి నిష్కారణంగా రక్తపాతాన్ని కోరుకునేవాడు. *(బుఖారీ షరీఫ్- 1697)*

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం : "దైవప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు, "త్వరలోనే మీకు నాయకత్వపు (నాయకత్వపు స్థానం పొందాలనే) పేరాశ కలుగుతుంది. కాని ప్రళయ దినం నాడు అది పశ్చాత్తాప పడవలసిన రోజు అవుతుంది. దాని ప్రారంభం అయితే మేలైనదిగా అనిపిస్తుంది. కాని ఫలితం చెడుగా ఉంటుంది." *(బుఖారీ షరీఫ్ -1725)*

హజ్రత్ మాకల్ బిన్ యసార్ (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సెలవిచ్చారు, "ఏ పాలకుడైతే తన పాలితుల (ప్రజల) చెడు కోరే వాడుగా మరణిస్తాడో, అల్లాహ్ అతని కోసం స్వర్గాన్ని నిషేధిస్తాడు.

*(బుఖారీ షరీఫ్, 1727)*

హజ్రత్ అబూ బక్ర్ (రజి) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు : "నాయకుడు కోపావేశంలో ఉన్నప్పుడు ఎవరి పట్ల తీర్పును ఇవ్వకూడదు." *(బుఖారీ షరీఫ్ : 1729)*

హజ్రత్ ఆయిషా (రజి) ఇలా సెలవిచ్చారు : దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచించారు : "ఎప్పుడూ అందరితో పోట్లాడేవాడు అల్లాహ్ దృష్టిలో అందరికంటే చెడ్డవాడు.
*(బుఖారీ షరీఫ్ - 1730)*

హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) ఇలా అన్నారు : దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సెలవిచ్చారు: "మీలో మగ్గురు వ్యక్తులు ఉంటే వారిలో ఇద్దరు కలిసి పరస్పరం గుసగుసలు చేసుకోరాదు. ఎందుకంటే ఆ గుసగుసలు మూడో వ్యక్తిని దూరం చేస్తాయి." *(బుఖారీ షరీఫ్ -1737)*

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం: ఒక వ్యక్తి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను అడిగాడు, "ఎలాంటి ఇస్లాం మంచిది?" అని. అందుకు ప్రవక్త (సఅసం) "ప్రజలకు అన్నం తినిపించడం, పరిచితులూ, అపరిచితులు ఇరువురికీ సలాం చేయడం" అని సెలవిచ్చారు. *(బుఖారీ షరీఫ్- 1804)*

ఒక వ్యక్తి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)తో, "అవిశ్వాసులకు విరుద్ధంగా (కీడు కలగాలని) అల్లాహ్‌తో వేడుకోండి, వారిని శపించండి" అని అడిగాడు. దానిపై ఆయన (సఅసం), "నన్ను ఈ ప్రపంచానికి కారుణ్యంగా పంపడం జరిగింది కాని శపించడానికి కాదు" అని అన్నారు. *(ముస్లిం)*

పైన పేర్కొనబడిన ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి సాంప్రదాయాలు, ప్రవచనాలు, వారి జీవిత చరిత్ర, ఖుర్ఆన్‌లోని అల్లాహ్ వచనాల విస్తృత అధ్యయనం ద్వారా ఇస్లాం శాంతి, దయ, మానవత ఉత్తమ ఆదర్శాలను నెలకొల్పుతుందని స్వయానా పాఠకులే గ్రహించగలరు.

**ప్రపంచంలో కేవలం ఖుర్ఆన్‌లో మాత్రమే ఈశ్వరీయ (అంటే ఆధ్యాత్మిక) వాస్తవికతతోపాటు వ్యవహారిక వాస్తవికత కూడా ఉంది. దీనిలోని ఈ విశిష్టత కారణంగానే మక్కాలో ప్రకటితమయిన ఇస్లాం మొత్తం ప్రపంచమంతా వ్యాపించింది.**

దీని తరువాత కూడా ఎవరైనా ఖుర్ఆన్‌లోని ఈ అల్లాహ్ ఆదేశాలకు తప్పుడు

లేక తన మనోభీష్టమైన అర్థాలను తీసుకుంటే దానికి ఖుర్ఆన్‌గానీ లేక ఇస్లాంగానీ బాధ్యత వహించదు.

సల్మాన్ రుష్దీ, అన్వర్ షేఖ్, తస్లీమా నస్రీన్ లాంటి రచయితలు ఇస్లాం పట్ల తమలో ముందుగానే తిష్టవేసుకున్న భావాల కారణంగానే ఖుర్ఆన్‌లోని వచనాలను ఉగ్రవాదంతో జోడించారనే నిర్ణయానికి పాఠకులు రాగలరు కూడా.

ఇస్లాంలో ఉగ్రవాదపు ఆదేశాలు లేనేలేవు అనే విషయం దీంతో అవగతమవుతోంది. ఇంకా అవి ఉగ్రవాదానికి వ్యతిరేకమైనవిగా ఉన్నాయి. జిహాద్ అంటే ఉగ్రవాదం కాదు, ఆత్మరక్షణ కోసం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే ప్రయత్నం మాత్రమే.

"ఇస్లామిక్ ఆతంక్‌వాద్ కా ఇతిహాస్" (ఇస్లామీయ ఉగ్రవాద చరిత్ర) అనే నా పుస్తకంలో హైందవ రాజులు, ముస్లిం చక్రవర్తుల మధ్య యుద్ధాల్లో జరిగిన రక్తపాతాన్ని గురించి వ్రాసి ఉన్నాను, కాని ఆ రక్తపాతాలన్నీ యుద్ధాలకు, వ్యక్తులకు సంబంధించినవేకాని, ఇస్లాంకు సంబంధించినవి కావని నాకు ఇప్పుడు తెలిసి వచ్చింది. యుద్ధాలలో ఇలాంటి రక్తపాతాలు అన్ని దేశాలలో, అన్ని జాతులలో నిరంతరం జరుగుతున్నవే. చరిత్రలో అలెగ్జాండర్ నుండి హిట్లర్ వరకూ ఇదే చేశారు. మన భారత దేశంలో అశోకుని కళింగ విజయం సందర్భంగా లక్షకు పైగా జనం మరణించారు. వీరి ఈ దుష్కృత్యాలకుగాను వీరి ధర్మం దోషి కాదుగా! ముస్లిం పాదుషాల విషయం కూడా ఇదే విధంగా ఉంది.

## సనాతన వైదిక ధర్మం మరియు ఇస్లాం

**ఏకేశ్వరవాది అయిన ఇస్లాం ధర్మం సనాతనమైంది, అది ఈ ప్రపంచంలో ఆది నుంచీ ఉంది.**

ఇస్లాం ఏకేశ్వర వాదం వివిధ దేశాల్లో వివిధ పేర్లతో వెలిసింది: భారత దేశంలో ఇది సనాతన వైదిక ధర్మం, వేదాలు, ఉపనిషత్తులు, గీత రూపంలో ఉంది.

కొందరు హిందూ సోదరులు ఇస్లాం అరేబియా నుండి వచ్చిన హిందువుల విరోధి అయిన ధర్మమని భ్రమసి ఉన్నాను. తొలుత నేను కూడా ఇలాగే అనుకున్నాను. ఇస్లాం వాస్తవికత తెలిసిన తరువాత ఇది అరేబియా నుంచి కాని, అరబ్బుల కోసం కాని వచ్చింది కాదని తెలిసొచ్చింది. ఇది దేవుని తరఫు నుండి వచ్చింది, కేవలం ముస్లింల కోసమే కాదు, సమస్త మానవ జాతి కోసం వచ్చింది. ఖుర్ఆన్‌లోని 2వ

అధ్యాయం, 185వ వచనంలో "మానవులందరికీ (ఆ గ్రంథం) మార్గదర్శకం. రుజుమార్గం చూపే సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి....." అని ఉంది.

ఇక్కడ 'మానవులందరికీ' అని చెప్పబడిందికాని, ముస్లింల కోసమనో, అరబ్బుల కోసమనో చెప్పబడలేదు. ఇదే విధంగా 25వ అధ్యాయం, మొదటి వచనంలో "ఎనలేని శుభాలవాడు ఈ గీటురాయిని (సత్యాసత్యాలను వేరుపరచే ఈ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని) తన దాసునిపై అవతరింపజేశాడు. సకల విశ్వాసులకు హెచ్చరిక చేసేదిగా (రుజుమార్గం చూపేదిగా) ఉండేటందుకు." అని ఉంది.

ఇది హిందువులకు విరోధి కూడా కాదు, ఎందుకంటే, ఇస్లాం ఏ వ్యక్తికీ, ఏ సముదాయాన్నీ, ఏ ధర్మాన్నీ విరోధించదు. ఇస్లాం కేవలం తప్పుడు మాటలను, చెడులను విరోధిస్తుంది. ఈ వైరుధ్యం కేవలం సైద్ధాంతికపరమైన వైరుధ్యం మాత్రమే. ఇందులో ఏ విధమైన బలవంతమూ లేదు. ఖుర్‌ఆన్‌లోని 2వ అధ్యాయం, 256వ వచనంలోని దైవాదేశం, "ధర్మం విషయంలో నిర్బంధంగానీ, బలాత్కారంగానీ లేవు." 109వ అధ్యాయం, 6వ వచనంలో "మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే" అని చెప్పబడింది.

ఇస్లాం విషయంలో హిందువులకూ, సనాతన వైదిక ధర్మం పట్ల ముస్లింలకూ సరైన పరిజ్ఞానం లేని కారణంగా ఒండొరులూ తమ తమ ధర్మాలు పరస్పరం వ్యతిరేకమైనవనే భ్రమలో ఉంటున్నారు. నిజానికి ఇస్లాంకు అన్నింటికంటే దగ్గరి పోలికలున్న ధర్మం అంటూ ఏదైనా ఉంటే అది 'సనాతన వైదిక ధర్మమే!'

**సనాతన వైదిక ధర్మాన్ని పాఠకులు పొరబాటున నేటి హిందూ ధర్మంగా భావించకూడదు. ఎందుకంటే, 'హిందూ' అనే పేరుతో ఏ ధర్మమూ లేదు. ఇదైతే ఒక జీవన విధానం. హిందువుల వాస్తవిక ధర్మం పేరు 'సనాతన వైదిక ధర్మం', కాని హిందువుల్లో చాలా మంది వారి వాస్తవిక ధర్మం, అంటే 'సనాతన వైదిక ధర్మాన్ని' దాదాపుగా మరచిపోయి సత్యమార్గం నుండి తప్పిపోయారని వ్రాయటానికి ఖేదపడుతున్నాను.**

భారతదేశంలో దాదాపు 75 కోట్ల హిందువులు, 25 కోట్ల ముస్లింలు (ఇది వ్రాస్తున్న సమయానికి) కలిసి మెలిసి ఉంటున్నారు. ఒకవేళ మనం ఒకరి ధర్మాన్ని మరొకరు, ఒకరి భావాలను మరొకరు తెలుసుకోలేకపోతే మానవతా విరోధ తత్వాలు, సమాజ వైరుధ్య తత్వాలు సులభంగా మన మధ్య భ్రమలు, సందేహాలు, అవిశ్వాసాలను

సృష్టిస్తారు. ఈనాడు జరుగుతున్న విధంగా ఈ దేశానికి ఇది అతి పెద్ద సమస్యగా ఉంది.

ముస్లిం సోదరుల ధర్మమైన ఇస్లాంను హిందూ సోదరులూ, సనాతన వైదిక ధర్మాన్ని అంటే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతను ముస్లిం సోదరులూ తెలుసుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది. ఆ విధంగా జరిగితే ధర్మం పేరుతో మన మధ్య ఎవరు కూడా అపార్థాలను సృష్టించలేరు. ఇది ఓ వివేచన (తత్వపూర్ణ విషయం). ఈ వివేచన వల్ల సత్యం ప్రస్ఫుటమవుతుంది. భ్రమ, సందేహం దూరమవుతాయి. హిందువులు, ముస్లింలలో ఒండొరుల పట్ల విశ్వాసం పెంపొందుతుంది. ధర్మం పట్ల కూడా విశ్వాసం పెరుగుతుంది, ఈ విశ్వాసమే భవిష్యత్తులో ప్రజలకు ఓ న్యాయ మార్గాన్ని ఆవిష్కరిస్తుంది. ఖుర్ఆన్ వివేచన (తత్వపూర్ణ శిక్షణ) కూడా ఇదే. "గ్రంథప్రజలారా! మాకూ మీకూ సమానమైన ఒక విషయం వైపునకు రండి, (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ దాస్యం చెయ్యరాదు."

(ఖుర్ఆన్ 3 : 64).

'సనాతన వైదిక ధర్మమూ' మరియు 'ఇస్లాం'లో ఏ సమానతలున్నాయో మనం చూద్దాం.

## సనాతన వైదిక ధర్మం మరియు ఇస్లాంలో ఆశ్చర్యజనక సమానతలు

ఇస్లాం వాస్తవికతను తెలుసుకోవటానికి ఖుర్ఆన్‌ను నేను రెండవసారి చదవటం మొదలుపెట్టినప్పుడు ఇది వేలాది సంవత్సరాలుగా మన వేదాలు, ఉపనిషత్తులు, గీతలో ఉన్న సత్యాలే అని తెలుసుకున్నాను. ఆ విధంగా ఇస్లాం మనదే అన్న భావన నాలో కలిగింది. ఖుర్ఆన్ ప్రారంభంలోని **'బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం'** అంటే, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో' చదువుతూనే నాకు 'ఓమ్' జ్ఞాపకమొచ్చింది. దీని శాబ్దిక అర్థం 'పరమ కళ్యాణకారుడు పరమేశ్వరుని పేరుతో' అవుతుంది. వైదిక మంత్ర ప్రారంభం 'ఓమ్'తో మొదలవుతుంది. ఏదేని మంత్రం ఆరంభంలో 'ఓమ్' చేర్చబడుతుందో దాని భావార్థం 'పరమ కళ్యాణకారుడు అయిన పరమేశ్వరుని పేరుతో' లేక 'అనంత కృపాశీలుడూ, పరమ దయాళువు అయిన పరమేశ్వరుని పేరుతో' అని అవుతుంది. 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం' అంటే ఇదే కదా!

బహుదైవారాధన పట్ల ఇస్లాం మౌలిక వైరుధ్యం అంటే **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** (అల్లాహ్, అంటే పరమేశ్వర్ తప్ప ఎవ్వరూ ఆరాధ్య యోగ్యుడు కాదు) సనాతన వైదిక ధర్మం మౌలిక విశ్వాసం కూడా ఇదే.

**ప్రపంచంలో అన్నిటికంటే ప్రాచీన ధర్మగ్రంథం రుగ్వేదంలో 'లా ఇలాహ ఇల్లల్లాహ్' ఉంది. రుగ్వేదంలోని ఒకటవ మండలం, 7వ సూక్తి, 10వ మంత్రంలో "ఇంద్రంవో విశ్వతస్పరి హవామహే జనేభ్యంః అస్మాకమస్తు కేవలః"** ***(రుగ్వేదం : మండలం-1, సూక్తం 7, మంత్రం -10)***

**భావార్థం:** "మానవులారా! నన్ను వదలి ఇతర దైవాలనెవ్వరినీ ఎన్నటికీ ఆరాధనా యోగ్యులుగా చేసుకోకండి. ఎందుకంటే ఒక్కడనైన నేను తప్ప రెండవ దేవుడెవ్వడూ లేడు" (హిందీ అనువాదం : మహర్షి దయానంద)[1]

ఈ భావార్థం సంక్షిప్త రూపం, "పరమేశ్వర్ వినా పూజనీయులెవ్వరూ లేరు. ఇదే, **"లా ఇలాహ ఇల్లల్లాహ్."**

**భగవద్గీతలో ఇలా ఉంది:**

"మత్తః పరతరం నాన్యత్కిఞ్చదస్తి ధనంజయ" (అధ్యాయం 7, శ్లోకం -7)

"ఓ ధనుంజయా! నాకంటే వేరుగా రెండవ దేవుడు ఎవ్వరూ లేరు."

ఇది శ్రీమద్భగవద్గీతలో పరమేశ్వరుని సందేశం అని చెప్పడం అవసరం.

---

*1. వేదం సంపూర్ణ ఏకేశ్వరవాద ఈశ్వరీయ గ్రంథం. వేదాల భాష వైదిక సంస్కృత వ్యాకరణంగా ఉంటుంది. ప్రజలు అందులోని మంత్రాల అర్థాన్ని తమ ఇష్టానుసారం వక్రీకరిస్తున్నారు. స్వామి దయానంద సరస్వతి వైదిక సంస్కృతంలో అఖండ విద్వాంసులు, ఏకేశ్వరవాద ధర్మాచార్యులు. వారు వేదాలపై కేవలం విశ్వాసముంచడమేకాకుండా వాటి ఆదేశాలనే సర్వోన్నతమైనవిగా విశ్వసించేవారు. ఈ పుస్తకంలో ఇవ్వబడిన వేదమంత్రాల హిందీ భావార్థాన్ని, నేను స్వామి దయానంద సరస్వతి ద్వారా చేయబడిన వేదాల హిందీ భాష్యం నుండి తీసుకున్నాను. ఎందుకంటే అవే శుద్ధంగా ఉన్నాయి.*

*శ్రీ దయానంద సరస్వతిగారి హిందీ భాష్యాలనే తీసుకోవటంలో మరో కారణమేమంటే, నేను ఈ పుస్తకంలో వెనుక వ్రాసినట్లు స్వామీజీ తమ పుస్తకం 'సత్యార్థ ప్రకాష్'లో ఇస్లాంను గురించి వ్రాసి ఉన్నారు. దానివల్ల చాలా మంది ఇస్లాం పట్ల అపార్థాల్లో పడిపోయి ఉండవచ్చు. అందుకోసమే నేను వైదిక మంత్రాల భావార్థం స్వయానా వైదిక ధర్మం అఖండ విద్వాంసులైన శ్రీ స్వామి దయానంద సరస్వతిగారు వ్రాసి ఉన్నవాటినే తీసుకున్నాను. ఎందుకంటే "సత్యప్రకాష్" పుస్తకాన్ని చదివి భ్రమించిన వారు స్వయానా స్వామీజీ వారి భాష్యంతో నిజాలను తెలుసుకోగలందు కోసమని.*

ఈ సందేశాలను అందించిన శ్రీ కృష్ణుడు ఒక మహాయోగి.[1] అందువల్లనే ఆయనను యోగేశ్వర్ అని చెప్పబడింది. దేవుని నుండి సందేశాలను గ్రహించటానికి వారు ఏ స్థితిలోనైనా దేవునితో యోగం, అంటే చేరుకొని ఆయన సందేశాలను పొందగలిగే వారు.

ఇస్లాం ప్రకారం, అల్లాహ్ (అంటే పరమేశ్వర్)కు తప్ప ఇతరులకు ఆరాధన, సాష్టాంగ పడడం బహుదైవారాధన (షిర్క్) అవుతుంది. ఇస్లాం దీనిని అన్నిటికంటే ఘోరమైన పాపం అంటుంది. సనాతన వైదిక ధర్మం కూడా ఈ బహుదైవారాధనను ఇస్లాం చెప్పిన విధంగా అంతే ఘోరమైన చెడు అంటుంది.

శ్రీమద్భగవద్గీత 7వ అధ్యాయం, 20వ శ్లోకంలో శ్రీకృష్ణుడు అర్జునునకు దేవుని సందేశాన్ని ఇస్తూ ఇలా అంటారు.

**కామైస్తై ర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేన్య దేవతాః**

**తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాస్సయా.**

**అర్థం:** భౌతిక వాంఛలచే ఓటమిపాలైన జ్ఞానము కలవారు తమ స్వభావముతో ప్రేరితులై ఆయా నియమాలను అనుసరించి అన్య దేవతలను పూజిస్తున్నారు.

దీని భావార్థం ఏమిటంటే, భోగలాలసం, విశృంఖల విలాసమూ, ధనమూ మొదలగు భౌతిక వస్తువులను పొందాలనే కోరికల కారణంగా ఎవరి వివేకమైతే హరించుకొనిపోయిందో (ఇలాంటివారు) వాటిని పొందాలనే కోరికతో (పేరాశకు ప్రేరితులై) వేరు వేరు దేవతలను వేరు వేరు విధాలుగా పూజిస్తున్నారు.

భగవద్గీత 7వ అధ్యాయం, 23వ శ్లోకంలో ఇలా ఉంది:

**అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్ప మేథసామ్**

**దేవాన్దేవయజో యాన్తి మద్భక్తాయాన్తి మామపి.**

**భావార్థం:** పరమేశ్వర్ (దేవుని) వినా ఇతర దేవతలను పూజించే మందబుద్ధుల ఆ ఫలాలు (అంటే భౌతిక వస్తువులు, ప్రాపంచిక జీవన సామగ్రి) కొద్ది రోజులవి మాత్రమే. దేవతలను పూజించువారు దేవుతలను పొందుదురు. పరమేశ్వరుడనయిన నా భక్తులు (తమను తాము నాకు సమర్పించుకున్నవారు) నన్నే పొందుదురు, నా లోకానికి వెళ్ళుదురు అంటే స్వర్గానికి పోవుదురు.

---

1. *పరమేశ్వర్ (దేవుడు)తో సంధానం చేసుకునే క్రియను 'యోగ' అంటారు. ఈ 'యోగ' ద్వారా దేవునితో సంబంధాన్ని ఏర్పరచుకునేవాడు 'యోగి'.*

**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత**
**తత్ప్రసాదాత్పరాంశాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతం**

*(భగవద్గీత- 18వ అధ్యాయం, శ్లోకం 62)*

"(అందుకే) ఓ అర్జునా! (నీవు) అన్ని విధాలా ఆ దేవుని శరణునే పొందుము. ఆ దేవుని కృపతో (నే/నీకు) దివ్యమైన శాంతిని (ఇంకా) శాశ్వతమైన పరమ ధామమును అంటే మోక్షము ప్రాప్తించును (స్వర్గం ప్రాప్తించును).

ఇస్లాంలో నమాజ్ కేవలం ఒకే ఒక్కడైన దైవాన్ని నిష్కామ భావంతో చేసే ఆరాధన. భోగవిలాసాలు, భౌతిక వస్తు సంపద ఇత్యాది కోరికల కోసం చేసే దైవ ఆరాధన, లేక అన్య దేవతల ఆరాధన ఇస్లాంలో లేనేలేదు. ఇంకా భగవద్గీత ప్రకారం చూసినా ఇలాంటి ఆరాధన చేస్తున్న ముస్లింలు మాత్రమే ముక్తి మోక్షాలు పొందుతారు.

ఖుర్ఆన్‌లోని 10వ అధ్యాయం, 106వ వచనంలో ఇలా ఉంది:

"అల్లాహ్‌ను వదలి నీకు నష్టాన్నిగాని లాభాన్నిగాని కలిగించలేని ఏ శక్తినీ వేడుకోకు. ఒకవేళ అలా చేస్తే నీవూ దుర్మార్గుడవై పోతావు."

ఖుర్ఆన్, 3వ అధ్యాయం 14వ వచనంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"స్త్రీలు, సంతానమూ, వెండి బంగారు రాశులు, మేలుజాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షణగా చేయబడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే."

ఖుర్ఆన్, 3వ అధ్యాయం, 15వ వచనంలో...

(ప్రవక్తా!) ఇలా చెప్పు : "వాటికంటే శ్రేష్టమైనదేదో నేను మీకు తెలిపేదా? భయభక్తులు కలవారి కొరకు వారి ప్రభువు వద్ద ఉద్యాన వనాలున్నాయి. వాటి క్రిందుగా కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి శాశ్వతమైన జీవితం లభిస్తుంది. పరిశుద్ధ చరిత్రలైన భార్యల సాంగత్యం లభిస్తుంది. అల్లాహ్ తన దాసుల నడవడికను శ్రద్ధతో గమనిస్తాడు."

ఖుర్ఆన్, 3వ అధ్యాయం, 16, 17 వచనాలు :

"వారు అల్లాహ్‌ను ఇలా వేడుకుంటారు : "ప్రభూ! మేము విశ్వసించాము. మా తప్పులను మన్నించు. మమ్మల్ని నరక జ్వాలల నుండి కాపాడు." వారు

సహనశీలురు, సత్యసంధులు, విధేయులు, దానపరులు, క్షమించు అని రాత్రి చివరి ఘడియలలో అల్లాహ్‌ను వేడుకుంటారు. "

"ఈ సంపదా, ఈ సంతానమూ కేవలం ఐహిక జీవితపు తాత్కాలిక అలంకారాలు మాత్రమే. అసలు శాశ్వతంగా ఉండిపోయే పుణ్యకార్యాలే నీ ప్రభువు దగ్గర పరిణామం రీత్యా ఉత్తమమైనవి." (ఖుర్‌ఆన్ 18వ అధ్యాయం, 46వ వచనం)

**ఇస్లాం ప్రకారం అల్లాహ్ (దేవుడు)యే ఈ బ్రహ్మాండాన్ని సృష్టించాడు, ఆయనే పోషణ కర్త, ఆయనే ప్రళయాన్ని చేసేవాడు.**

వేదాలు కూడా ఇదే చెబుతున్నాయి. రుగ్వేదంలో ఇలా ఉంది:

**పరిధామాని యాని తేత్వం సోమాసి విశ్వతః పవమాన ఋతుభిః కవే॥**

*(రుగ్వేదం : మండలం- 9, సూక్తం- 66, మంత్రం- 3)*

**భావార్థం :** పరమాత్మ (దేవుడు) సృష్టి, స్థితి, ప్రళయం ఈ మూడు క్రియలకు కారకుడు. అంటే ఆయనతోనే ప్రపంచ సృష్టి, ఆయనతోనే స్థితి మరియు అతని చేతనే ప్రళయం సంభవిస్తుంది. (హిందీ అనువాదం: మహర్షి దయానంద)

**త్వం ధ్యాం చ మహివ్రత పృథివీంచాతిజ్రిషే।**
**ప్రతి ద్రాపిమము ధాం పవమాన మహిత్వనా॥**

*(రుగ్వేదం : మండలం-9, సూక్తి-100, మంత్రం -9)*

**భావార్థం:** సర్వలోకాలను ఐశ్వర్యవంతంగా చేసి వాటిని తన రక్షారూప కవచముతో ఆచ్ఛాదించి ఉన్నాడు. ఇంతటి విచిత్ర రచనతో ఈ ఉన్నత బ్రహ్మాండాన్ని సృష్టించాడు. ఆయన మహత్తును ఎవ్వరూ పొందజాలరు. (హిందీ అనువాదం : మహర్షి దయానంద)

**యో నఃపితాజనితా యో విధాతా ధామాని వేద భువనాని విశ్వా।**
**యో దేవానాం నా మధా ఏక ఏవతం సంప్రశ్నం భువనాయ న్యాన్యా॥**

*(రుగ్వేదం : మండలం -10, సూక్తి- 82, మంత్రం -3)*

**భావార్థం:** ఏ పరమేశ్వరుడైతే మన పాలకుడో, మనలను సృష్టించునో, సమస్త జగత్తు నిర్మాతయో, ఇంకా సమస్త స్థానముల, లోకాలు, పదార్థాల పేర్లను పెట్టినవాడో ఆయనే అద్వితీయుడు (అంటే ఆయనకు సరిసమానులితరులెవ్వరూ లేరు). (హిందీ అనువాదం : మహర్షి దయానంద)

భగవద్గీత, అధ్యాయం 7, శ్లోకం- 6లో ఇలా ఉంది :

**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రళయస్తథా**

నేను సంపూర్ణ బ్రహాండం ఉత్పత్తిని మరియు ప్రళయాన్ని (ప్రళయానికి మూల కారణం).

యజుర్వేదంలో ఇలా ఉంది:

**అపాం వృష్టమసి యోనిగ్నేః సముద్రమభితః పిన్వమానమ్**

**మామదేవతాః సచన్తామ్** *(యజుర్వేదం- 13వ అధ్యాయం, మంత్రం-2)*

**భావార్థం:** మానవులను సత్, చిత్ మరియు ఆనంద స్వరూపముతో సర్వజగత్తును సృష్టించినవాడు, సర్వమూ వ్యాపించి ఉన్నవాడూ, సర్వోన్నతుడూ, సర్వశక్తిమంతుడూ అయిన సృష్టికర్త (బ్రహ్మ) ఆరాధనతో సంపూర్ణజ్ఞానం, అనంత గుణాలు ప్రాప్తమవుతాయి (అలాంటి) ఆయనను ఎందుకు సేవించకూడదు. (హిందీ అనువాదం : మహర్షి దయానంద)

**ఇస్లాం ప్రకారం అల్లాహ్ (అంటే పరమేశ్వర్) ఒక్కడే. కేవలం ఒకే ఒక్కడు, ఆయన అజన్ముడు, వినాశం లేనివాడు, నిరాకారుడు మరియు సర్వశక్తిమంతుడు. ఆయన జన్మించడూ మరణించడు.**

వేదాలు సైతం ఇదే అంటున్నాయి. శ్వేతాశ్వతరోపనిషత్తు అధ్యాయం 6, శ్లోకం -8లో ఇలా ఉంది.

**న తస్య కార్యం కరణఞ్చ విద్యతే**

**భావార్థం** : ఆ పరమేశ్వరునకు శరీరముగాని, చక్షురాద్రీంద్రియములుగాని లేవు. అనగా ఆయన నిరాకారుడు (ఆయన అహారపానీయాలూ ఇంకా ఎలాంటి కోరికలు అవసరాలకు అతీతుడు)

కనోపనిషత్తు, ఖండం- 1, శ్లోకం- 6లో ఇలా ఉంది:

**యచ్చక్షుషా న పష్యతి యేన చక్షుంషి పష్యతి**

**తదేవ్ బ్రహ్మత్వం విద్రు నేదం యదిద్ ముపాసతే**

**భావార్థం:** ఎవరినైతే ఏ కళ్ళు చూడలేవో, ఎవరి సహాయంతోనైతే కళ్ళు చూడగలవో ఆయననే నీవు ఈశ్వర్ (దేవుని)గా తలచు. ప్రజలు కళ్ళకు కనపడే (వేరు వేరు) తత్వాలను దేవునిగా తలిచి ఆరాధిస్తున్నారు, అవి దేవుడు కాదు.

శ్వేతాశ్వతరోపనిషత్తు, అధ్యాయం–6, శ్లోకం –9లో ఇలా ఉంది :

**న తస్య కశ్చిత్పతిర స్తి లోకే**
**న చేశితా నైవ చ తస్య లిఙ్గమ్**
**స కారణం కరణాధిపాధిపో**
**న చాస్య కశ్చిజ్జనితా న చాధిపః**

**భావార్థం:** బ్రహ్మాండములో ఆయనకు ప్రభువుగానీ, శాసన కర్తగానీ ఎవరూ లేరు. ఆయన ఇట్టివాడు అని ఊహించుటకు చిహ్నముగాని లేదు. ఆయన సమస్త జీవ జగత్తు (జీవరాశి)ను సృష్టించినవాడు, వాటికి ప్రభువు అయి ఉన్నాడు. ఆయనకు జనకుడు గాని, ఆయనకంటే అధికుడుగాని ఎవ్వడూ లేడు.

విశ్వప్రసిద్ధ ఇస్లాం నినాదం 'అల్లాహు అక్బర్' (అంటే అల్లాహ్ అందరికంటే గొప్పవాడు లేక అల్లాహ్ మహనీయుడు) ఒక పరిపూర్ణ, సార్వభౌమిక సత్యం. ఈ లోకం లేనప్పుడు కూడా ఈ సత్యం ఉండింది. నేడూ ఉంది, ఇంకా ప్రళయ దినానంతరం ఈ లోకం అంతమైపోయినప్పుడు కూడా ఉంటుంది. సనాతన వైదిక ధర్మం మూలం కూడా ఇదే.

**"పూర్ణశ్య పూర్ణ పూర్ణమే వా వశిష్యతే"**

(పరమేశ్వర్ చాలా గొప్పవాడు, ఎంతటి గొప్పవాడంటే)

పూర్ణత నుండి పూర్ణతను తీసివేసినా తిరిగి ఆ పూర్ణతయే శేషంగా మిగిలి ఉంటుంది. (అర్థమేమిటంటే, అల్లాహ్ అనంతుడు. ఎందుకంటే, కేవలం అనంతములో నుండి అనంతాన్ని తీసివేసినప్పుడు అనంతమే శేషంగా మిగిలిపోతుంది.

శ్వేతాశ్వతరోపనిషత్తు, అధ్యాయం– 6, శ్లోకం– 8 అల్లాహు అక్బర్:

**నతత్సమాశ్చాప్యధికశ్చ దృశ్యతే**

**భావార్థం:** ఆ (పరమేశ్వర్)కు సమానులు గాని, ఆయన కంటే మించినవారు కూడా ఎవరూ కనిపించరు. అంటే పరమేశ్వర్ లేక అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు. ఆయన అద్వితీయుడు.

శ్వేతాశ్వరోపనిషత్తు, అధ్యాయం–4, శ్లోకం– 19లో ఇలా ఉంది:

**నైన మూర్ధ్వం న తిర్యఞ్చం న మధ్యే పరిజగ్రభత్।**
**న తస్య ప్రతిమా అస్తి యస్య నామ మహద్యశః॥**

**భావార్థం:** (పరమేశ్వర్ అనంతుడు, ఆయన ఎంత గొప్పవాడంటే) ఆయనను పై నుండి, ఇటు నుండి, అటు నుండి చివరకు మధ్య నుండి కూడా ఎవ్వరూ తాకలేరు. ఆయన పేరు అత్యంత మహిమాయుక్తమైనది. అనగా ఆయన అన్నిటికంటే మహనీయుడు. ఇలాంటి ఆ పరమేశ్వర్‌తో ఎవరికీ పోలికలేదు అంటే ఆయన సాటిలేనివాడు. ఆయనకు ఎలాంటి అవతారముగానీ, విగ్రహంగానీ లేక చిత్రముగానీ లేదు.

ఈ విధంగా సనాతన వైదిక ధర్మం ముఖ్య విశ్వాసం పరమేశ్వరుడు (అంటే అల్లాహ్) పుట్టుక లేనివాడు, వినాశము లేనివాడు, నిరాకారుడు, సర్వశక్తిమంతుడు, అద్వితీయుడు, ఆయనకు సరిసమానులెవ్వరూ లేనివాడు. ఆయనకు కుమారులూ లేరు, కుమార్తెలూ లేరు. ఆయనకు తల్లీ లేదూ తండ్రీ లేడు. సోదరుడూ లేడు సోదరీ లేదు, భార్యా లేదు. ఇస్లాం మౌలిక విశ్వాసం కూడా ఇదే.

> "ఆయన ఆకాశాలను, భూమినీ ప్రభవింపజేసినవాడు. ఆయనకు ఒక జీవిత సహచరి అంటూ లేనప్పుడు ఆయనకు కొడుకు ఎలా ఉంటాడు? ఆయన ప్రతి వస్తువును పుట్టించాడు." (ఖుర్ఆన్- 6 : 101)

> "ఉజైర్ అల్లాహ్ కుమారుడు" అని యూదులు అంటారు. "మసీహ్ అల్లాహ్ కుమారుడు" అని క్రైస్తవులు అంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడివున్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి. దేవుని దెబ్బ వారిపై పడుగాక! వారెలా మోసపోతున్నారు!?
> (ఖుర్ఆన్ 9వ అధ్యాయం, 30వ వచనం)

భగవద్గీతలోని ప్రసిద్ధ శ్లోకం:

**కర్మణ్యేవాధికార స్తే మాఫలేషు కదాచన!** (గీత: 2వ అధ్యాయం, శ్లోకం- 47)

(అంటే కర్మ చేయుటలోనే నీ అధికారం ఉన్నది (దాని) ఫలితములో ఎన్నటికీలేదు.

నేను దీని వ్యవహారిక రూపాన్ని ఇస్లాంలోనే చూశాను. లాభనష్టాలూ, జీవన్మరణాలూ, కీర్తి అపకీర్తులూ అల్లాహ్ అభీష్టం మేరకే జరుగుతాయని ఒక ముస్లిం మాత్రమే వ్యావహారికంగా అంగీకరిస్తాడు. వ్యావహారిక రూపంలో మనిషిని నిష్కామ కర్మయోగిగా చేసేది ఇస్లామ్ మాత్రమే. అతడు ప్రతి విషయానికీ "ఇన్షా అల్లాహ్" (అంటే అల్లాహ్ అనుమతిస్తే) అని అంటాడు.

ఒక ముస్లిం ఏదైనా పరోపకారాన్ని చేస్తే అది తాను చేయలేదని అది అల్లాహ్ చేశాడని అనుకోవడాన్ని స్వయానా పాఠకులే అనుభవపూర్వకంగా గ్రహించగలరు. తాను చేసిన పనికి గర్వపడడంగాని, దానికి ప్రతిగా ఏదైనా కోరడంగాని చేయడు. ఇస్లాం మాత్రమే మనిషిని వ్యవహారిక రూపంలో నిష్కామ కర్మయోగిగా చేస్తుంది.

భగవద్గీతలో సకామ కర్మ, సకామ[1] ఉపాసనను అధమమైనదిగాను, నిష్కామ కర్మ[2], నిష్కామ ఉపాసనను సర్వశ్రేష్టమైనదిగా చెప్పబడింది. పరమేశ్వరుని (అల్లాహ్) సకామ ఉపాసన అస్సలు లేని ఏకైక ధర్మం ఇస్లాం మాత్రమే. అక్కడ ఉన్నది కేవలం నిష్కామ ఉపాసన మాత్రమే.

ఉదాహరణకు, ఖుర్ఆన్‌లోని ప్రారంభం సూరా ఫాతిహ[3] (తొలి అధ్యాయం పాతిహ), అల్లాహ్ (ఈశ్వర్) స్తోత్రంతో మొదలవుతుంది. ఈ స్తోత్రంలో తన భోగవిలాసం, తన విచ్చలవిడి లాలసం, భౌతిక సంపద మొదలగు ఎలాంటి కోరికలు లేవు. ఇది పరమేశ్వరునికి (అల్లాహ్‌కు) నిష్కామ భావంతో చేసిన స్తోత్రం. (ఉపాసనకు అంటే నమాజ్‌కు) ఏమాత్రం జాగు చేయకుండా, క్రమం తప్పకుండా, అన్ని పరిస్థితుల్లోనూ ప్రతి రోజు అయిదు పూటలా అత్యంత శ్రద్ధాసక్తులతో పరమేశ్వరుణ్ణి (అల్లాహ్‌ను) నిష్కామ భావంతో ఆరాదించేవాడు ఒక్క ముస్లిం మాత్రమే. పరమేశ్వరుని అల్లాహ్ పట్ల ఇలాంటి నిష్కామ భావంతో ఇలాంటి సమర్పణ వేరెక్కడా లేదు. ఒక్క ఇస్లాం మాత్రమే మనిషిని పరమేశ్వరుని (అల్లాహ్) పట్ల సమర్పణకారునిగా చేస్తుంది. ఇలాంటి సమర్పణకారి అయిన భక్తునికి భగవద్గీతలో ఈ సందేశం ఉంది

**అనన్యాశ్చిన్తయన్తో మాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం**

*(భగవద్గీత- అధ్యాయం 9, శ్లోకం- 22)*

**అనువాదం:** అనన్య ప్రేమికులైన భక్త జనులు పరమేశ్వరుడనైన నన్ను నిరంతరం ధ్యానించుచు నిష్కామ భావంతో నన్ను పూజింతురు. ప్రతి దినమూ సదా నన్ను ఆరాధించే అలాంటి వారికి యోగక్షేమాలను నేను స్వయంగా నొసంగుదును.

---

1. *'సకామ' అర్థం : సాంసారిక జీవనం (అంటే ప్రాపంచిక జీవితం కోసం).*
2. *'నిష్కామ' అర్థం : సాంసారిక జీవితం కోసం కాకుండా కేవలం పరమేశ్వరుని కోసం (అల్లాహ్ కోసం) సమర్పించుకోవడం.*
3. *'సూరె ఫాతిహా' : ఖుర్ఆన్‌లోని మొదటి అధ్యాయం.*

పరమేశ్వరుని శరణులోనికి వెళ్ళిన ఇలాంటి సమర్పణకారి, నిష్కామ ఉపాసకుడు ఆధ్యాత్మిక శాంతి, నన్ను పొందు అధికారం కలిగి ఉంటాడు. భగవద్గీత 6వ అధ్యాయం, 15వ శ్లోకంలో ఇలా ఉంది:

**"శాన్తిం నిర్వాణపరమాం మత్సంస్థా మధిగచ్ఛతి**

(ఇలాంటి సమర్పణకారి అయిన ఉపాసకుడు) నాలోని పరమానందము, సర్వోన్నత శాంతిని పొందుతాడు.

ఇదే విధంగా ఖుర్‌ఆన్‌లోని 2వ అధ్యాయం, 112వ వచనంలో అల్లాహ్ వాగ్దానం ఇలా ఉంది:

"ఎవరు తమను తాము అల్లాహ్ పట్ల విధేయతకు అంకితం చేసుకుని, ఆచరణలో సన్మార్గం అవలంబిస్తారో, దానికి వారు తమ ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం పొందుతారు. అటువంటి వారికి (ప్రళయం నాడు) భయంకాని, దుఃఖం కాని కలిగే అవకాశం ఎంతమాత్రం లేదు."

ఖుర్‌ఆన్- 24వ అధ్యాయం, 46వ వచనం

"మేము నిజాన్ని స్పష్టంగా తెలిపే వాక్యాలను అవతరింపజేశాము. ఇక ఋజుమార్గం వైపునకు అల్లాహ్‌యే తనకు ఇష్టమైన వారికి దారి చూపుతాడు."

సనాతన వైదిక ధర్మం అనగా వేదాలూ, ఉపనిషత్తులూ, భగవద్గీత ద్వారా రుజువు అవుతున్నదేమిటంటే, దైహిక, దైవిక, భౌతిక ఈ మూడు విధాల ప్రకారం శాంతిని, ముక్తి, మోక్షాలను పొందే తిన్నని మరియు సరళమైన మార్గం **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అనగా, అల్లాహ్ తప్ప ఎవ్వరూ ఆరాధనీయులు కాదు' అని.

ఇస్లాం ప్రకారం ప్రళయంనాడు పునరుద్ధానం (తిరిగి లేపబడటం) జరుగుతుంది. ఇది ఒక తర్కపూరిత వాస్తవం. ఆత్మ యొక్క శరీరం మరలా ఆరోగ్య స్థితిలో ప్రాప్తమవుతుంది. ఎందుకంటే అప్పుడు మాత్రమే ఆత్మ తన కర్మఫలం ప్రకారం లభించే స్వర్గసుఖాలనూ లేక నరక యాతనలను అనుభవించగలదు.

ఈ విధంగా హజ్రత్ ముహమ్మద్ (సఅసం) తీసుకువచ్చిన ఇస్లాం ధర్మం అది ఏదో కొత్త ధర్మం కాదు; నిశ్చయ రూపంలో ఇస్లాం కాలానుకూల పరివర్తిత సత్యధర్మం.

పైన ఉదహరించిన రుజువుల ప్రకారం ఏకేశ్వరోపాసన ఆధారంగా ఇస్లాంకు అతి దగ్గరి ధర్మం అంటూ ఏదైనా ఉందంటే అది సనాతన వైదిక ధర్మమే.

**ఇస్లాంలోని దేవుని ఏకత్వం (ఏకేశ్వరవాదం) విశ్వాసం, సమర్పణ లాంటిది మరెక్కడా లేదు.**

**ఇస్లాంలో దేవుని ఏకత్వం (ఏకేశ్వరవాదం), ఖుర్ఆన్‌లోని వచనాల శుద్ధతను (మార్పులకు గురికాని విధం) శాశ్వతంగా నిలిచి ఉండేలా చేయబడిన ఇలాంటి వ్యవస్థ మరెక్కడా లేదు.**

**ఇస్లాంను విశ్వసించిన వారి మనస్సులో అల్లాహ్ (పరమేశ్వర్) పట్ల భీతి ఏదైతే ఉంటుందో, అలాంటిది ఇతరుల్వెరి మనస్సుల్లో ఉండదు.**

**ఇటువంటి విశేషాల కారణంగానే ఇస్లాం శ్రేష్టమైన ధర్మం అయింది.**

ఏకేశ్వరవాద వాస్తవికతను తెలిపే సనాతన వైదిక ధర్మం ఈనాడు కేవలం పుస్తకాలకే పరిమితమైపోవడం ఎంతో దురదృష్టకరం, దాని స్థానంలో అసత్యమైన బహుదైవవాదం (షిర్క్) వచ్చేసింది. ఇది నేటికీ కొత్త కొత్త దేవతల, దేవుళ్ళ అవతారాలు సృష్టిస్తూ పోతోంది. టి.వీ.ల్లోనో లేక ఏదైనా సినిమాల్లో ఏ వ్యక్తినైనా దేవుని అవతారంగా చేస్తే (వేషం వేస్తే) ప్రజలు అతణ్ణి పూజించడం మొదలుపెడుతున్నారు. కొన్ని చోట్లయితే అతణ్ణి సాక్షాత్తు దేవుడే అని చెప్పుకుంటూ తిరుగుతున్నారు, జనం వారి వెంట పరుగులు తీస్తున్నారు. శోచనీయమైన విషయమేమిటంటే, మన వద్ద అసత్యానికి ఎంత ప్రచారమయితే జరుగుతూ ఉందో అది మరెక్కడా లేదు. దేవుడు అందరికీ సద్బుద్ధి ప్రసాదించుగాక. ప్రజలు తమ బుద్ధీ వివేకాలను ఉపయోగించడం లేదనిపిస్తూ ఉంది.

## కాస్త ఆలోచించండి!

దారితప్పిన మన ప్రజలు కాస్త ఆలోచించాలి, ఏ భూమండలంపై మనం నివసిస్తున్నామో అది సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్న ఒక గ్రహం. సూర్యుని చుట్టూ పరిభ్రమించే ఇలాంటి ఎన్నో గ్రహాలున్నాయి, ఈ గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తున్న వేరు వేరు గ్రహాలూ, మరెన్నో ఉపగ్రహాలున్నాయి. మన భూమికి చంద్రుడు ఉపగ్రహమై భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నట్టు. ఈ సూర్యుని ఈ గ్రహాలు మన భూమి కంటే కొంచెం చిన్నవి కూడా ఉన్నాయి. ఇంకా మన భూమిలాంటి వేలాది భూగోళాలు ఇమిడిపోయే బుధగ్రహమంత పెద్దవి కూడా ఉన్నాయి. సూర్యుడూ, సూర్యుని ఈ గ్రహాలూ, ఉపగ్రహాల (అంటే మండలాలు) మధ్య మన భూమి అస్థిత్వం చాలా చిన్నది.

మన సూర్యుడు మన ఆకాశ గంగ (Galaxy) ఒక నక్షత్రం. ఈ ఆకాశగంగలో దాదాపు 20,000 (ఇరవై వేలు) కోట్ల నక్షత్రాలు (సూర్యులు) ఉన్నాయి. వాటిలో చాలా నక్షత్రాలు మన సూర్యుని కంటే వేల రెట్లు పెద్దవి, ప్రకాశవంతమైనవి.

ఈ బ్రహ్మాండంలో మన ఆకాశగంగలాంటి వందల వేల కోట్ల ఆకాశగంగ లున్నాయి. మళ్ళీ వాటిలో వేలాది కోట్ల గంగలున్నాయి, వీటన్నింటిలో మన ఆకాశ గంగ కంటే లక్షలాది నక్షత్రాలు (సూర్యులు) ఉన్నాయి. నక్షత్రాల మధ్య దూరాలు ఎంత ఎక్కువగా ఉంటాయంటే దీనిని కొలవటానికి మైళ్ళలో, కిలోమీటర్ల స్థానే కాంతి సంవత్సరాలలో కొలవవలసి వస్తుంది. మన భూమి నుండి ఆకాశ గంగకు గల మధ్య దూరాన్ని ఇంత వరకు గరిష్టంగా దూరం 1320 (పదమూడు వందల ఇరవై కోట్ల) కాంతి సంవత్సరాలని కొలవబడింది.

'కాంతి' ఒక సెకనుకు దాదాపు మూడు లక్షల కిలోమీటర్ల వేగంతో పయ నిస్తుంది. ఆ విధంగా ఇక ఈ దూరం ఎంతవుతుందో ఊహించుకోవచ్చు. ఈ లెక్కన అది ఒక గంటకు 108 (నూటా ఎనిమిది) కోట్ల కిలో మీటర్ల దూరం వెళు తుంది. ఈ వేగం నేటి విమానపు అత్యధిక వేగానికి (విమాన గరిష్ట వేగం గంటకు 1500 కిలోమీటర్లు) ఏడు లక్షలా ఇరవై వేల రెట్లు ఎక్కువ. రాకెట్ గరిష్ట వేగం (గంటకు ముప్పై వేల కిలోమీటర్లు కంటే 36 వేల రెట్ల అధిక వేగం అవుతుంది. ఇంతటి వేగంతో కాంతి ఏక బిగిన ఒక సంవత్సర కాలంలో అది తొమ్మిది లక్షల నలభై ఆరువేల ఎనభై కోట్ల (9,46,080 కోట్లు) కిలో మీటర్లు పయనించిన దూరాన్ని ఒక 'కాంతి సంవత్సరం' అంటారు.

ఈ వేగంతో కాంతి నిరంతరం పదమూడు మిలియన్ల ఇరవై కోట్ల సంవత్సరాలు పయనిస్తే వెళ్ళగలిగే దూరం 13 మిలియన్ల 20 కోట్ల కాంతి సంవత్సరాలవుతుంది. పైన తెలిపినట్లు ఇంత వరకూ మహా అయితే ఇంత దూరంలో గల ఆకాశగంగను మాత్రమే కనుగొనటం జరిగింది.

ఈ దూరమైతే కేవలం మన ఆకాశగంగ మరో ఆకాశగంగకు మధ్య కొలవ గలిగిన దూరం మాత్రమే. బ్రహ్మాండమైతే ఇదే విధంగా అన్ని వైపుల నుండి వ్యాపించి ఉంది. ఈ దూరం ఇప్పుడు కొలిచిన విధంగా కొలవలేనిది. బ్రహ్మాండం యొక్క వైశాల్యాన్ని గురించి వారికున్న పరిజ్ఞానం ప్రకారం, వాస్తవానికి బ్రహ్మాండంలో అలాంటి ఎన్నో ఖరబ్ (ఒక ఖరబ్ అంటే పది వేల కోట్లు)ల బ్రహ్మాండాలు వ్యాపించి ఉన్నాయని ఖగోళ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. అంతా కలపి నేటి విజ్ఞాన

శాస్త్రం లెక్కన అల్లాహ్ (అంటే పరమేశ్వర్) సృష్టి మనిషి బుద్ధి, గణనలకు అతీతంగా ఉంది.

మనం దేవునిచే (ఈశ్వర్) సృష్టించబడిన బ్రహ్మాండాన్నీ, అందులోని జీవ జంతువులు, వృక్షజాలం, ప్రకృతి అనుశాసిత వ్యవస్థను చూసి దానిపై లోతుగా ఆలోచిస్తే దేవుని (ఈశ్వర్) హద్దులేని, అనంత శక్తిని చూసి ఆయన పట్ల, విశ్వాసం, శ్రద్ధలతో మనసు నిండిపోతుంది.

ఉదాహరణకు, ఈ భూమినే తీసుకోండి. ఇది జీవించటానికి తగిన విధంగా దేవుని (ఈశ్వర్) ద్వారా రచింపబడిన ఎంతటి వ్యవస్థీకృత ప్రణాళికాబద్ధమైన రచనయో! ఇక్కడ మనుగడ సాగించటానికి అవసరమైన అన్ని పరిస్థితులు ప్రకృతి ద్వారా ఎంతో ప్రణాళికాబద్ధంగా చేయబడ్డాయి. సూర్యుని నుండి వెలువడే విషతుల్యమైన అతి నీలలోహిత కిరణాలతో జీవరాశిని కాపాడటానికి ఆశ్చర్యకరమైన రీతిలో ఓజోన్ పొర పరచబడింది. జీవరాశి ఆహారపానీయాల కోసం రకరకాల ఏర్పాట్లు చేయబడ్డాయి. ఇదంతా ఎంత వ్యవస్థీకృతంగా చేయబడిందంటే ఈ విషయంలో మనం లోతుగా ఆలోచిస్తే ఆశర్యంలో పడిపోతాము. ఇదంతా దానంతట అదే జరగలేదు. నిశ్చయంగా ఈ వ్యవస్థనంతా ఏదో శక్తి తయారుచేసింది.

ఏదైనా శక్తి సామర్థ్యాలు లేకుండా ఏ పనీ జరుగదనేది విజ్ఞాన శాస్త్ర నియమం. ఈ పనులన్నింటిలో ఏ సామర్థ్యం వినియోగించబడిందో అది గతి శక్తి కావచ్చు లేక స్థితి శక్తి కావచ్చుగాక, దానికి ఆ బలమూ, ఆ శక్తీ ఎక్కడి నుండి వచ్చాయి? ఒకవేళ సూర్యుని నుండి వచ్చాయని అనుకుంటే అది సూర్యునిలో ఎక్కడి నుండి వచ్చింది? ఒకవేళ దాని పదార్థంలోని పరమాణు కేంద్రంలో జరిగిన విస్ఫోటకం (Nuclear Reaction) వల్ల అని అనుకుంటే ఆ ప్రక్రియ ఎలా జరిగింది? దీని కోసం ఆ పదార్థం ఎక్కడి నుండి వచ్చింది? ఈ ప్రశ్నల పరంపర మొదలైతే విషయం మళ్ళీ మొదటికే వస్తుంది. ఎటువంటి ఇంధనం లేకుండా శక్తి, బలం అనేవి ఉత్పన్నం కాజాలవు అని.

మరో మాటలో చెప్పాలంటే, శక్తితో ఇంధనం, ఇంధనంతోనే శక్తి ఉంది. ఇదే విధంగా ఒకవేళ పదార్థంతో ఇంధనం వెలువడినట్లయితే ఆ పదార్థం అస్థిత్వం ఇంధనంతోనే సంభవమవుతుంది. ఇది ప్రకృతి ధర్మం, ప్రకృతియే విశిష్ట విజ్ఞానం. చివరకు మళ్ళీ అదే ప్రశ్న. విత్తనం నుండి చెట్టయిందా? లేక చెట్టు నుండి విత్తనమా? ఈ ప్రశ్నలు నాస్తికులూ, మిధ్యావాదుల వద్ద కేవలం అహేతుకమైన సమాధానం మాత్రమే ఉంటుంది.

ఈ బ్రహ్మాండంలో గాని, భూమిపైగాని జీవి ఎలా వచ్చింది? ఎక్కడి నుండి వచ్చింది? మనుష్యులతోపాటు పశుపక్షాదులూ, క్రిమికీటకాలు మొదటగా భూమిపై ఎలా వచ్చాయి? ఆశ్చర్యజనకమూ, విచిత్రమూ అయిన వాటి సృష్టిని చూడండి - కళ్ళూ, చెవులు, ఇతర అవయవాలను చూడండి, దీనిని గురించి లోతుగా ఆలోచిస్తే దీననంతా ప్రణాళికాబద్ధంగా సృష్టించిన వారెవరో ఉన్నారని అనిపించటం లేదా? సృష్టిని వృద్ధి చేయటానికి అన్ని జీవులలో ఏ విధంగా కామప్రవృత్తిని కలుగజేయ బడింది, ఒకవేళ ఈ ప్రవృత్తి లేకపోయి ఉంటే జీవ జంతువులు తమ సంఖ్యను పెంచుకోలేకపోయేవి. ఇంతటి విచిత్ర ఆశ్చర్యజనక సృష్టి (అంటే జీవరాశి) రచన పరమేశ్వరుని (దేవుడు) వినా మరెవ్వరూ చేయలేరు.

ఇదైతే ఈ అనంత బ్రహ్మాండంలో ఒక కణం లాంటి భూమి పరిస్థితి. ఇక గ్రహాలూ, ఉపగ్రహాలూ, సూర్యగ్రహం, నక్షత్ర గ్రహాలూ, ఆకాశ గంగ ఇంకా ఇతర ఆకాశగంగలు బ్రహ్మాండంలో ఇంత వ్యవస్థీకృతంగా ఎలా పరిభ్రమిస్తున్నాయో కాస్త ఆలోచించండి. ఒకవేళ వీటిలో ఈ వేగాన్ని ఇచ్చి ఉండకపోతే అసలు వీటి ఉనికే ఉండేది కాదు.

వీటికి ఈ వేగాన్ని ఇచ్చిన వారెవరు? కొందరు నాస్తికులూ, అజ్ఞానులూ బ్రహ్మండములో జరిగిన ఓ మహా విస్ఫోటకం వాటికి ఈ వేగాన్ని కలిగించిందంటారు. ఇక్కడ మా ప్రశ్న ఏమిటంటే, ఈ విస్ఫోటకం జరగటానికి అవసరమైన పరిస్థితులను ఎవరు కల్పించారు? మళ్ళీ అదే ప్రశ్నకు సరైన సమాధానమివ్వడం మానవ మస్తిష్క పరిధులకు ఎంతో ఆవల ఉన్నాయి.

నేడు మానవ నిర్మిత ఒక ఉపగ్రహాన్ని (స్యాటిలేట్‌ను) భూ కక్ష్యలో పరిభ్రమించటానికై అక్కడ నిలిపి ఉంచటాని కోసం రాకెట్ ద్వారా దానిని గంటకు ఎన్ని కిలోమీటర్ల వేగంతో కక్ష్యలోనికి విసరివేయవలసి ఉంటుందని లెక్కవేయబడుతూ ఉంది. ఇప్పుడు ఇక్కడ ఉదయించే ప్రశ్న ఏమిటంటే ఆ మహా విస్ఫోటకంతో అసంఖ్యాక నక్షత్రాలు ఏర్పడడానికి అవసరమైన పదార్థం వ్యాపించడం, అన్నిటికోసం ఇలా వేర్వేరుగా లెక్కకట్టడం ఎలా జరిగింది? ఈ గణాంకాన్ని ఎవరు చేశారు? అసంఖ్యాక నక్షత్రాల ఆ పదార్థం (లక్షలాది కిలోమీటర్ల వ్యాసం గల నక్షత్రాలు ఏర్పడ్డాయి. ఇంకా అలా ఏర్పడుతూనే ఉన్నాయి). ఇంకా ఆయా కక్ష్యలలో స్థిరపడి నక్షత్రాలుగా మారి వాటివాటి నిర్దిష్ట మార్గంలో పరిభ్రమిస్తున్నాయి. ఇదంతా దానంతట అదే జరిగిపోతోందా? మనిషి జ్ఞానం, తర్కమూ ఇందుకు నకారాత్మక సమాధాన మిస్తుంది.

దైవ గ్రంథమైన ఖుర్ఆన్‌లో ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ (పరమేశ్వర్) మహిమయే అని పదే పదే చెప్పబడింది. వేదాలలో కూడా ఇదే విధంగా ఈ అనంత బ్రహ్మాండాన్ని ఆద్యంతములు లేని ఒక్కడైన ఆ పరమేశ్వర్ (అంటే అల్లాహ్) ఉద్భవింపజేశాడు అని చెప్పబడింది.

ఈ అనంత బ్రహ్మాండం ఊహకందని ఒక వైచిత్రి. దీని రచన దానంతటదే జరిగింది కాదు. ఎందుకంటే ఏది కూడా దానంతటదే జరుగదు. అది జరగటానికి కారణమంటూ ఉంటుంది. అనంతమైన ఈ అనంత బ్రహ్మాండం యొక్క సృష్టికి కారణం ఒక్కడైన ఆ అల్లాహ్ (పరమేశ్వర్) తప్ప మరెవ్వరూ కాదు. అన్ని ప్రశ్నలకూ ఇదొక్కటే సంతృప్తి, సంతోషకరమైన సమాధానమవుతుంది.

ఈ భూమిపై జన్మించి, తిండీ తిప్పలు చూసుకుంటూ, వ్యాధుల బారిన పడుతూ, వృద్ధుడయిపోయి మరణించే లాంటి వ్యక్తి కాజాలడు. ఈ బ్రహ్మాండంతో పోల్చుకుంటే శూన్యం లాంటి వ్యక్తి, అనంతమైన ఈ బ్రహ్మాండాన్ని సృష్టించినవాడూ, నడిపించేవాడూ, దాన్ని నాశనం (ప్రళయం) చేసేవాడు అయిన దేవుడు కాజాలడు అని చెప్పటానికే ఇదంతా ఇంత వివరంగా చెప్పవలసి వచ్చింది.

ఈశ్వర్ (దేవుడు) తినటం, త్రాగటం లాంటి అవసరాలకూ, లింగభేదాలకూ, కామ వాంఛలకూ అతీతంగా ఉంటాడు, ఎందుకంటే, కామవాంఛతో ఏ ఆనందమైతే మనిషికి ప్రాప్తమవుతుందో దానికి స్వయానా ఆయనే ఆనందబ్రహ్మ (ఆనందాన్ని సృజించినవాడు). ఆయన నిరాకారుడు. ఆయనకు ఎలాంటి సంతానమూ లేదు. తల్లీ లేదు, తండ్రీ లేడు, సోదరి లేదు సోదరుడూ లేడు. భార్యాలేదు, కూతురూ లేదు కుమారుడూ లేడు. ఆయనకు జన్మా లేదు మరణమూ లేదు. ఆయన అల్లాహ్ (పరమేశ్వర్) ఆయన తప్ప రెండవ వాడెవ్వడూ లేడు.

ఈ అనంత బ్రహ్మాండాన్ని సృష్టించిన అల్లాహ్ (అంటే పరమేశ్వర్) జన్మలేని వాడూ, వినాశం లేనివాడు, సర్వశక్తిమంతుడూ, అంతములేనివాడు. ఆయనకు సరిసమానులెవ్వరూలేరు.

**“పూర్ణమదః పూర్ణమిదం పూర్ణత్పూర్ణ ముదచ్యతే”**

**భావార్థం :** ఆయన (పరమేశ్వర్) పరిపూర్ణుడు, (ఆయన యొక్క) ఈ బ్రహ్మాండమైన సృష్టి కూడా పరిపూర్ణమైనది, ఎందుకంటే, పరిపూర్ణతతోనే పరిపూర్ణత వెలుస్తుంది. (ఈ పరిపూర్ణత అర్థం అనంతమైనది. ఇప్పుడే పైన మనం బ్రహ్మాండాన్ని

అనంతమైనదిగా నిరూపించుకున్నాం, అనంతాన్ని అనంతంగా చేయగలిగే ఒకే ఒక్క పరిపూర్ణత అనంతుడు)

దీని భావార్థమేమిటంటే, సర్వశక్తిమంతుడు, అనంతడు అయిన ఆయన సృష్టి అయిన బ్రహ్మాండం కూడా అనంతమైనది. ఎందుకంటే, అనంతము నుండే అనంతం పుడుతుంది.

**"అల్లాహు అక్బర్"** అంటే, అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు. ఇంకా **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** (అంటే, అల్లాహ్ తప్ప ఇతరులెవ్వరూ పూజనీయులు కారు) అనే సందేశాన్ని నినాద రూపంలో ఇస్లాం ప్రపంచానికి అందించింది.

దీనితో నిష్కర్షగా తేలేదేమిటంటే, ఇస్లాం ధర్మం ఆది నుంచీ ఉంది. మరో మాటలో ఇస్లాం అనాదిగా ఉంది, అనంతమైనదిగా ఉంది.

**ఈ పుస్తకంలోని నిష్కర్షమైన నిజాలను గ్రహించిన తరువాత అంతిమంగా "ఇస్లాం ఉగ్రవాదం కాదు ఆదర్శవాదం" అని నిరూపితమవుతోంది.** ఇస్లాం యొక్క ఈ ఆదర్శం స్వీకారయోగ్యమైనది.

## మనందరి కర్తవ్యం

**ఇస్లాం కేవలం ముస్లింల కోసమే కాదు, సమస్త మానవాళి కోసం, అది మానవ కళ్యాణం కోసమైనదని నిరూపితమైపోయింది.**

ఇటువంటి ఇస్లాంను అపఖ్యాతిపాలు చేయడానికని "ముస్లిములందరూ ఉగ్రవాదులు కారు, కాని ఉగ్రవాదులందరూ ముస్లింలే" అంటూ మొబైల్ ఫోన్లపై ఎస్.ఎమ్.ఎస్‌లు పంపుతూ ఉగ్రవాదాన్ని ముస్లింలతో ముడిపెట్టే ప్రణాళికాబద్ధమైన కుట్ర జరుగుతూ ఉందని తెలుస్తోంది.

ఒకవేళ ముస్లిములే ఉగ్రవాదులై ఉంటే, వారిపై ఉగ్రవాద దాడులు జరిగేవి కావు. హైదరాబాద్‌లోని మక్కా మస్జిద్, మాలేగాంవ్ (మహారాష్ట్ర) ఈద్గాలో ఈ దాడులు జరిగి ఉండేవి కావు.

ముస్లిం మదరసాలు, ధార్మిక, సామాజిక సంస్థలు, ముస్లిం పండితుల విషయంలో వారంతా ఉగ్రవాదానికి ప్రేరణ కలిగిస్తున్నారనే దుష్ప్రచారం చేయబడుతూ ఉంది. ఇందులోని వాస్తవాన్ని తెలుసుకోవటానికి నేను దాదాపు అన్ని ప్రధాన సామాజిక, ధార్మిక ముస్లిం సంస్థలను అధ్యయనం చేశాను. కాని అక్కడ నాకు ఉగ్రవాదాన్ని సమర్థించేవారు ఎక్కడా కనిపించలేదు. మదరసాలలో ఉగ్రవాదులను

తయారుచేస్తున్నారని చెప్పబడుతూ ఉంది. మదరసాలలో తయారు చేయబడుతున్న ఈ ఉగ్రవాదులను వెతకటానికని నేను లక్నోలోని స్థానిక మదరసా నద్వా కాలేజితో పాటు ఎన్నో ఇతర మదరసాలకు వెళ్ళాను. కాని అక్కడ ఉగ్రవాద స్థానంలో నేను శాంతి, క్రమశిక్షణ, సంస్కృతి, పెద్దలను గౌరవించటం, ఆదరించటం, మానవత పట్ల ప్రేమాభిమానాలను చూడటం జరిగింది. వారి మౌలానాలు (ఇస్లామీయ పండితులు) ఉగ్రవాదాన్ని బోధిస్తూ ఉంటారని కొందరు అనుకుంటున్నారు. ఇందులోని వాస్తవికతను తెలుసుకోవటానికి నేను వారి మౌలానాలతో (పండితులతో) కలిశాను. వారి అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత నాకు అక్కడ ఈ ఇస్లాం విద్వాంసులు ఏ కోణంలోనూ ఉగ్రవాదాన్ని సమర్థించేవారుగా కనిపించలేదు. ఎందుకంటే, వీరు ఇస్లాం అంటేనే మానవత అంటున్నారు. ఈ పుస్తకం వ్రాయటానికి పూర్వమే విద్వాంసులైన వారి మౌలానాలతో కలిసి ఉన్నాను. హజ్రత్ మౌలానా సయ్యద్ అబుల్ హసన్ అలీ అల్ హసనీ అన్ నద్వీ (రహ్మాలై) (అలీమియాం) ద్వారా స్థాపించబడిన "పైయామె ఇన్సానియా ఫోరం" దేశంలోని విభిన్న ప్రాంతాలలో సెమినార్‌లను ఏర్పాటు చేసింది. వాటిలో మానవతపై అభిప్రాయాలు వ్యక్తం చేయటాని కోసం నన్ను ఆహ్వానించసాగారు.

ఇదే కాకుండా దేశంలోని అనేక ముస్లిం సంఘాలు, సంస్థలు కూడా తమ బహిరంగ సభలలో నాకు ప్రసంగించే అవకాశాన్నిచ్చారు. ఇటువంటి అన్ని సందర్భాల్లో నేను చాలా మంది మౌలానాలతో కలిశాను. నిరాడంబరత, సజ్జనత, మానవీయత పై ఈ మౌలానా (విద్వాంసులందరి మనసుల్లో ఉన్న ఆవేదన నన్ను చాలా ప్రభావితం చేసింది. ముస్లిం సామాజిక, ధార్మిక సంస్థలు, ముస్లిం విద్వాంసులతో కలిసిన తరువాత, ప్రజల మధ్య తెలిసి కావాలని ఇస్లాంను అపఖ్యాతిపాలు చేయటానికి కుట్ర జరుగుతోందనే నిర్ణయానికి వచ్చాను.

ఉగ్రవాదంపై ముస్లింల అభిప్రాయం తెలుసుకోవటానికని నేను వేలాది ముస్లింలతో కలిసి మాట్లాడాను. ఈ ముస్లింలందరిలోనూ వారి పొరుగువారైన ముస్లిమేతరుల పట్ల గల సోదర, స్నేహ సంబంధాలను నేను చూశాను. వారిలో ఏ ముస్లిం కూడా నిరపరాధులైన వారిని చంపటాన్ని కోరుకోడు, సమర్థించడు. ముస్లిమేతరులను (ముస్లింలకు హాని చేయనివారు) ద్వేషించే, ఉగ్రవాదాన్ని సమర్థించే ఒక్క ముస్లిం కూడా నాకు కనిపించలేదు.

దీని తరువాత కూడా ఒకవేళ ఎవరైనా అలాంటి వారు ఉంటే విషయాన్ని

అటూ ఇటూ మలుపులు తిప్పి దానికి ముస్లింలందరినీ లేక ఇస్లాంను దోషులుగా నిలబెట్టలేము. అది అపవాదం. ఇలాంటి అపవాదం అన్ని చోట్లా జరుగుతూ ఉంది.

ఉగ్రవాదపు దుష్పరిణామాలను ముస్లింలూ, ముస్లిమేతరులు ఇరువైపులా అనుభవిస్తున్నారు. ఎందుకంటే, ఇరువురూ ఉగ్రవాదానికి బలి అవుతున్నారు. కాని ముస్లింలు మాత్రమే అనుమానాస్పద దృష్టితో చూడబడుతున్నారు. ఉగ్రవాదులు ఉగ్రవాదులే అవుతారు. వారిని ఏ మతంతోనూ, సాంప్రదాయంతోనూ ముడిపెట్టడం పూర్తిగా అన్యాయమే అవుతుంది.

ప్రతి ఉగ్రవాద దాడితో ఇస్లాంను అపఖ్యాతిపాలు చేయాలనుకునేవారికి బలం చేకూరుతుందనీ, ఈ దాడుల తరువాత ముస్లిమేతరులంతా భయంతో ఒకటై ప్రజాస్వామ్యంలో ఒక సంఘటిత శక్తిగా మారిపోతారనీ, ఈ శక్తితో ఇస్లాం విరోధులకు లాభిస్తుందని ముస్లింలకు బాగా తెలుసు.

ఇలాంటి ప్రతి దాడి తరువాత ఈ శక్తి బలపడుతూనే ఉంది. ఎక్కడైతే ఉగ్రవాద దాడులు పెరిగిపోయాయో లేక అధిక సంఖ్యలో జరిగి ఉన్నాయో ఆ ప్రాంతాల్లో నయితే అత్యంత పటిష్ఠమైన రాజకీయ శక్తిగా మారిపోతూ ఉంది. ఇస్లాంను అపఖ్యాతి పాలు చేయాలనుకునే శక్తులు కూర్చున్న చోటనే ఉచితంగానే ఈ బలం లభిస్తూ ఉండటానికని ఇలాంటి దాడులు పదేపదే జరుగుతూ ఉండాలని కోరుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇలాంటి వాళ్ల ఈ ఉద్దేశ్యాలను సఫలం కానివ్వకుండా చేసి దేశాన్ని అరాచకం నుండి కాపాడడం మనందరి కర్తవ్యం కావాలి.

## సమర్పణ

ఇస్లాంను గురించి నేను అంతకు ముందు వ్రాసి ఉన్నవి లేక చెప్పివున్నవన్నీ అసత్యం, అనుచితమైనవనీ, ఇస్లాం వాస్తవితకను బాగా అర్థం చేసుకున్న తరువాత నాకు నా తప్పిదం తెలిసొచ్చిందనీ ఈ పుస్తక ప్రారంభంలో వ్రాసి ఉన్నాను.

**ఇస్లాంను సమీపంలో నుంచి తెలుసుకోకుండా భ్రమల్లో పడిన వారికి ఇస్లాం మౌలానాలు (పండితులు) ముస్లిమేతరులను పచ్చిగా ద్వేషించేవారు అని అనిపిస్తుంది. కాని నేను వారిని ప్రత్యక్షంగా చూసి, వారిని గురించి తెలుసుకొని, విన్న తరువాత మౌలానాలనబడే వారు వారి వ్యవహారాలలో సదాచారులనే వాస్తవం నాకు తెలిసొచ్చింది. ఇతర ధర్మాల, ధర్మాచారుల పట్ల వారి మనసుల్లో వారు గౌరవ భావం కలిగి ఉంటారు. వారిలో అన్నీ సాధు గుణాలను నేను చూశాను. ఇస్లాం సిద్ధాం**

తాలనూ, నియమాలనూ ఖచ్చితంగా పాటించే ఈ ఇస్లాం పండితులు ఆదరణ యోగ్యులు, వారు సజ్జనులను గౌరవిస్తారు, వారు సభ్యతగల వారు, మృదు భాషీయులు.

ఇలాంటి ముస్లిం ధర్మపరాయణుల పట్ల నేను కూడా అపార్థాలతో తప్పుడు అభిప్రాయం ఏర్పరచుకొని ఉండేవాణ్ణి. దాని ప్రభావం "ఇస్లామిక్ ఆతంక్‌వాద్ కా ఇతిహాస్" (ఇస్లామీయ ఉగ్రవాద చరిత్ర) అనే నా తొలి పుస్తకంపై కూడా పడింది. నా ఈ తప్పిదాలకు ప్రాయశ్చిత్తంగా నేను బహిరంగంగా క్షమాపణ కోరాలనుకునేవాణ్ణి. కాని సమస్య ఏమిటంటే, నేను వ్రాసిన పుస్తకం 'ఇస్లాం ఆతంక్‌వాద్ కా ఇతిహాస్' (ఇస్లాం ఉగ్రవాద చరిత్ర) నా ఉపన్యాసాల క్యాసెట్లు అప్పటికే యావత్తు దేశంలో వ్యాపించి ఉన్నాయి. కాబట్టి నేను దేశానికంతా తెలిసే విధంగా క్షమాపణ (తౌబా) కోరుకోవాలనుకుంటున్నాను. అప్పుడే నేను వ్రాసిన లేక చెప్పివున్న మాటల ఖండన వాటిని చదివిన, విన్న వారి వద్దకు చేరగలుగుతాయి. దీని కోసం ప్రభావశీలురైన హిందూ, ముస్లిం సోదరుల సహాయ సహకారాల అవసరం ఎంతయినా ఉంది. ఇలాంటి వారి సహాయం కోసమని నేను దేశంలోని వివిధ పట్టణాలకు వెళ్ళి ప్రజలను కలుసుకుంటున్నాను. (వారి అభిప్రాయాలు, ఆలోచనలు ఎలా ఉన్నాయంటే )...

ప్రజలు సహకరించటానికి వాగ్దానం చేసి మరుసటి దినమో లేక ఆ తరువాత మరచిపోతారు. రెండవసారి కలిసినప్పుడు తమ వాగ్దానం నుంచి వెనుతిరిగిపోతారు. ఈ విధంగా ఆరు మాసాల వరకూ దేశంలో నిరంతరం ఉరుకులు పరుగులు తీసే వాణ్ణి. ఇందుకోసం నా డబ్బు, సమయం చాలా వరకు వృథా అయిపోయాయి. కాని ఏ ఫలితమూ లభించలేదు. నా ఆదాయ వనరులు చాలా పరిమితంగా ఉండడం, ఇంతగా శ్రమించిన తరువాత కూడా ఫలితం లేకపోయిన కారణంగా నాలో ధైర్యం నశించిపోసాగింది.

నేను చేయదలుచుకున్నది తప్పేమో, అది పరమేశ్వర్ అంటే అల్లాహ్‌కు అయిష్టమయినదేమో కాబట్టి ఈ ప్రయాసను ఇంతటితో వదలిపెట్టాలని అనుకుంటూ ఒకనాటి రాత్రి నాకు చాలా సేపటి వరకూ నిద్రపట్టలేదు. నిద్రలో నాకు బహు తేజస్వి అయిన ఒక పురుషుడు కనిపించాడు. ఆయన నన్ను తడుతూ, "లే! నిరాశ పడకు. క్షమాపణకై చేసుకున్న నీ వేడుకోలును అల్లాహ్ అంగీకరించాడు. ఏ విధంగానైతే దానిని వ్రాశావో దీనిని కూడా అదే విధంగా వ్రాసెయ్యి. ముందు ముందు సాఫల్యమే సాఫల్యం ఉంది" అని అన్నాడు.

ఆ తరువాత నా నిద్ర ఎగిరిపోయింది. మేల్కొన్న తరువాత నాలో ఏదో తీవ్ర మైన భయం, గాభరా కలిగింది. గుండె దడ వేగం పెరిగిపోయింది. అయిదు - ఏడు నిమిషాల వరకు అదే స్థితిలో కూర్చుండిపోయిన తరువాత నేను లేచి నీళ్ళు తాగాను. చూస్తే గడియారంలో రాత్రి మూడు గంటలా కొన్ని నిమిషాలయ్యాయి. (నిమిషాలు నాకు జ్ఞాపకం లేవు). తరువాత నేను అలాగే కూర్చుండిపోయి నా గురించి ఆలోచించసాగాను. 'అది ఎలా వ్రాశావో ఇదీ అలాగే వ్రాసెయ్' అన్న దాని భావమేమిటో నాకు అర్థం కాలేకపోయింది. చాలా సేపటి వరకు ఆలోచించిన తరువాత, "ఏ విధంగానైతే ఆ పుస్తకం (అంటే "ఇస్లాం ఉగ్రవాద చరిత్ర") వ్రాశావో అలాగే (అంటే ఏదతై వాస్తవమో) దాన్ని రాసెయ్" కాబోలు అనిపించింది.

దీనిని దైవాదేశంగా (ఈశ్వరీయ ఆదేశంగా) భావించి ఇక నేను ఈ విషయంలో ఎవరితోనూ కలుసుకోవటానికి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను. ఇక్కడ జరిగిన ఒక గొప్ప పరివర్తన ఏమిటంటే, తొలుత కేవలం నా తప్పిదాల మన్నింపు కోసం క్షమాపణ కోరడం వరకే ఉండింది, అంటే నేను వ్రాసిన, చెప్పి ఉన్న మాటలను బహిరంగంగా ఖండించి, క్షమాపణ కోరి, అందుకు పశ్చాత్తాపం చెంది మౌనంగా కూర్చుండిపోవాలనుకున్నాను. అప్పుడు ఈ పుస్తకం "ఇస్లాం ఆతంక్ యా ఆదర్శ్" (ఇస్లాం ఉగ్రవాదమా? ఆదర్శవాదమా?) వ్రాయాలనే ఆలోచన నా మనసులో ఏ కోశానా లేదు. కాని ఈ ఆదేశం వచ్చిన తరువాత నా ఆలోచన మారిపోయింది. ఇప్పుడు నేను ఇస్లాం వాస్తవికతపై ఈ పుస్తకాన్ని వ్రాయటానికీ వ్యాఖ్యానాల ద్వారా ప్రజలకు వాస్తవిక ఇస్లాంతో పరిచయం చేయటానికీ, ఈ దేశంలో పీడితుల పట్ల జరిగిన భేదభావాల పట్ల గళమెత్తటానికనీ, ఇంకా హిందువులు, ముస్లింల మధ్య ఏర్పడిన దూరాలను సమాప్తం చేయటానికని "భారతీయ జన సేవా ఫ్రంట్" "హిందూ ముస్లిం జన ఏకతా మంచ్" పేర్లతో సంఘాలను ఏర్పాటు చేయాలని తీర్మానించు కున్నాను. ఈ కార్యంలో సహకరించటానికి ప్రజలకు ప్రేరణ కలిగించమంటూ దైవాన్ని (ఈశ్వర్) ప్రార్థిస్తున్నాను.

దీని తరువాత నేను ప్రాథమిక ఆధారాలపై ఈ పుస్తకాన్ని వ్రాయాలని నిశ్చయించుకున్నాను. కాని విషయం నేను వ్రాసిన మొదటి పుస్తకానికి వ్యతిరేకమైనదిగా ఉండింది. దీనిపై నేను ఎన్నడూ ఆలోచించి ఉండలేకపోవటమే కాదు. ఈ విషయంలో నాకు ఎక్కువ పరిజ్ఞానం కూడా లేదు. అయినప్పటికీ ఏదో అదృశ్య శక్తి ప్రభావంతో నేను దీన్ని వ్రాయడం మొదలుపెట్టాను.

పుస్తకాన్ని వ్రాస్తున్న సమయంలో నాకు కాలం కలిసొచ్చిన తీరును, వ్రాయటంలో కలిగిన సౌలభ్యం తీరును చూస్తే దీని వెనుక ఉన్న అల్లాహ్ (అంటే పరమేశ్వర్) సహాయంతోనే నేను ఈ పుస్తకం వ్రాయగలిగాను.

పుస్తకం వ్రాయటం మొదలుపెట్టినప్పుడు ప్రారంభంలోనే నేను ఏ కరపత్రాన్ని గురించి అయితే వ్రాశానో అప్పుడు ఆ కరపత్రం నా వద్ద లేదు; అయినా ఇలాంటి కరపత్రమొకటి పంచబడిందని తెలుసు. ఆ 24 (ఖుర్‌ఆన్) వచనాలలో కొన్ని వచనాలు మినహా మిగతా వచనాలు నాకు జ్ఞాపకం లేవు. ఆ సమయంలో నా వద్ద ఆ కరపత్రం లేకపోవటం నాకు చాలా బాధ కలిగించింది. ఆ కరపత్రం ఎక్కడ నుండి తేవాలి? అని ఆలోచిస్తూ ఉండేవాణ్ణి. కాని ఆశ్చర్యకరంగా అదే రోజు సాయంత్రం ఆ కరపత్రం ప్రకాశకుడు 'హిందూ రాష్ట్రీయ ఫోరం" సంస్థాపకుడు డా॥ కె.వి. పాలీవాలా, ఢిల్లీ నుంచి పోస్టు ద్వారా నాకు పంపిన ఒక కవరు వచ్చింది. అందులో ఆ 24 వచనాలు గల కరపత్రం ఉండింది. పోస్టు ద్వారా వచ్చిన ఆ కవరూ, ఇంకా దాని వెంట పంపిన కరపత్రం వెంట ముద్రించబడిన ఇతర సామగ్రి మా వద్ద ఇంతవరకూ భద్రంగానే ఉన్నాయి. ఆ మరుసటి దినమే ఢిల్లీ నుండి వెలువడే హిందూ మహాసభ పక్షపత్రిక "హిందూ సభ వార్త" కూడా నాకు దొరికింది. అందులో ఈ విషయంలో ఇంకా వివరంగా వ్రాయబడింది. ఈ విధంగా రెండవసారి ఆ కరపత్రం దొరికిన కారణంగానే నా పుస్తకంలో ఆ 24 ఖుర్‌ఆన్ వచనాల అంశం ప్రస్తావన ఉంది.

మానవతా హితంలో సత్యం, న్యాయం ఈ కార్యసాఫల్యం కోసం ఆ కృపాశీలుడూ, దయాళువూ నాకు సహాయం చేయాలనీ, నాకు మార్గం చూపాలనీ ఆ పరమేశ్వర్‌నే (అంటే అల్లాహ్‌నే) అర్థిస్తున్నాను.

"ఇస్లాం ఆతంక్‌వాద్ యా ఆదర్శ్‌వాద్" అనే ఈ పుస్తకాన్ని ఎవరి కృపతోనైతే వ్రాయడం జరిగిందో ఆ కృపాశీలుడు, దయాళువు అయిన అల్లాహ్ (పరమేశ్వర్)కే సమర్పిస్తున్నాను.